ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP కపిల్ చిట్స్ 46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-1-2026 శనివారం సంపుటి: 31 సంచిక: 333 పేజీలు: 10+4 వెల: 6.50

# కడుపునిండా విషమేనా!

## అది మూసీ కాలుష్యం కంటే ప్రమాదకరం

### సభలో విపక్ష సభ్యులను నిశితంగా విమర్శించిన సిఎం రేవంత్

### ప్రజలకు నిజాలు తెలియకుండా అడ్డుకుంటారా?

### మూసీని ప్రక్షాళన చేయాలో, వద్దో చెప్పండి

### ఆ నదిలో యేడాదంతా మంచినీరు ప్రవహింప చేస్తా

### విపక్ష సభ్యులు బాయ్‌కాట్ చేసేదాకా సాగిన వాదోపవాదాలు


శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,జనవరి 2,ప్రభాతవార్త:** "ఆయన దు:ఖం చూడు ఆయన బాధ చూడు కడుపుల విషం ....విషం.... విషం ఎట్ల అంటే కడుపు నిండా విషం... ఆ మూసీ కాలుష్యం కంటే వీళ్లకంటే వీళ్ల కడుపుల అంతకంటే ఎక్కువ విషం ఉంది అధ్యక్షా..! విషం చిమ్ముతుండ్రు మీరు మూసీ కాలుష్యమే ప్రమాదం అనుకుంటున్నారు ఈ మనుషుల కడుపులోఉన్న విషం మూసీ కాలుష్యంకంటే అత్యంత ప్రమాదకరంగా తయారైంది. ఏం నొప్పి అధ్యక్షా నేను ఎవరినన్నా విమర్శించిన అధ్యక్షా..! ఈ ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టబోతందో సభలో సభ్యులు మాకు తెలవాలని అడిగింద్రు పాయలశంకర్ ఏం అడిగిండో ఆయనకు మా ప్రభుత్వం చేసింది వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారు" అంటూవిపక్ష సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభలో హరీశ్‌రావుపై ధ్వజమెత్తారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాలో ఒవైపు మూసీ కాలుష్యం మరోవైపు ఫ్లోరోసిస్ పీడిస్తోంది మూసీ నది ప్రక్షాళన చేస్తున్న మీరు చేయమంటారా? వద్దంటారా ఏం చేయాలో సూటిగా చెప్పండి. మీకు చేతనైతే సలహాలు ఇవ్వండి మీకు కడుపు మంటెందుకు అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి >>2

**వీబీ జీ రామ్ జీని వ్యతిరేకిస్తూ అసెంబ్లీ తీర్మానం**
**పేదల హక్కులు దెబ్బతీస్తున్న కేంద్రం: సిఎం** 2లో

# అసెంబ్లీ బాయ్‌కాట్



### శీతాకాల సమావేశాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన బిఆర్ఎస్

### సిఎం వ్యాఖ్యలు, స్పీకర్ వైఖరికి నిరసనగా ఎమ్మెల్యేల వాకౌట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి2:** అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బహిష్కరించాలని బిఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు మీడియాకు తెలియజేశారు. సిఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు,స్పీకర్ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. శాసనసభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం గన్‌పార్క్ వద్ద పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి హరీశ్‌రావు నిరసన తెలిపారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బహిష్కరించాలని బిఆర్ఎస్ నిర్ణయం తీసుకుందన్నారు. స్పీకర్, ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ సమావేశాలను బాయ్ కాట్ చేస్తున్నామని మాజీ మంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ తీరు చూస్తుంటే శాసనసభ నిబంధనలకు విరుద్ధంగా ఉందని మండిపడ్డారు. బీఏసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు విరుద్ధంగా సభ నిర్వహిస్తున్నారు.అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీని బూతులమయం చేశారని మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష పార్టీకి మైక్ ఇవ్వరా అని ప్రశ్నించారు.సిఎంను విమర్శించొద్దని స్పీకర్ అంటే ఎలా? పార్లమెంటులో ప్రధాని నరేంద్ర మోదీని రాహుల్ గాంధీ తిట్టడంలేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో తాను సిఎం గురించి మాట్లాడితే తప్పు ఏంటి అంటూ ఫైర్ అయ్యారు. అసెంబ్లీని గాంధీ భవన్‌లాగా, సిఎల్పీ మీటింగ్‌లాగా మార్చారంటూ వ్యాఖ్యలు చేశారు. మూసీ కంపు కంటే సిఎం నోటి నుంచి వచ్చే మాటల కంపు ఎక్కువంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా లేక స్ట్రీట్ రౌడీనా అని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ద్రోహి, నీళ్ల ద్రోహి >>2

# నీటి పంచాయితీలపై ప్రత్యేక కమిటీ


సిడబ్ల్యుసి చైర్మన్ అతుల్ జైన్

- ఎపి, తెలంగాణ మధ్య జలవివాదాల పరిష్కారానికి కేంద్రం కొత్త యత్నం
- సిడబ్ల్యుసి చైర్మన్ నాయకత్వం
- కమిటీ సభ్యులలో కృష్ణా, గోదావరి బోర్డు చైర్మన్లు
- సమస్యల పరిష్కారానికి పూర్తి సహకారం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్. జనవరి2:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య దశాబ్దకాలంగా కొనసాగుతున్న కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఓ ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ అతుల్ జైన్ ఈ కమిటీకి అధ్యక్షత వహిస్తారు. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కెఆర్ఎంబి, జిఆర్ ఎంబి) ఛైర్మన్లు, జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడిఎ) చీఫ్ ఇంజినీర్‌తో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. గతేడాది జులైలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సిఆర్ పాటిల్ అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ కమిటీ ఏర్పాటుకు నిర్ణయంతీసుకున్నారు. ఆ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్య మంత్రులు పాల్గొని చర్చించారు. ఇటీవల డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం తమ ప్రతినిధులను నామినేట్ చేయ డంతో కమిటీ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. ఇరు రాష్ట్రాల మధ్య నీటిని సమానంగా పంచడం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలు వంటి కీలక అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను సూచి స్తుంది. ఇదే సమయంలో, కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్2 (కేడబ్ల్యూడీటీ2) గడువును కూడా కేంద్రం 2026 జులై వరకుపొడిగించింది.కాగా, రెండు తెలుగు >>2



**పేదల జీవితాల్లో వెలుగు నింపిన ఉపాధి పథకం**
**గాంధీల కుటుంబం దేశంకోసం రక్తం చిందించింది**
**అసెంబ్లీలో డిప్యూటీ సిఎం భట్టి**

# కూలీలను కొట్టి కార్పొరేట్లకా?

## కొత్త చట్టంతో ప్రజలకు తీవ్ర నష్టం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి2:** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేదలకు, మధ్య తరగతి ప్రజలకు ఆర్థికంగా ఉతమిచ్చిందని శుక్రవారం శాసనసభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బిజెపి ప్రభుత్వం పేదలను, మధ్య తరగతి ప్రజలను కార్పొరేట్ సంస్థలకు ధారదత్తం చేసేలా కొత్త చట్టాన్ని తీసుకువచ్చిందని తీవ్రస్థాయిలో ఆయన విమర్శించారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ ఈ పథకం ఆనాడు యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చారని ఆయన చెప్పారు. స్వాతంత్రం అనంతరం ఆరు నెలల్లో హత్య చేశారన్నారు. ఆయన రక్తం దేశం భూమి పోరల్లో కలిసి పోయిందని చెప్పారు. సోనియా గాంధీ గారు దేశ సమగ్రత కోసం కృషి చేశారని పేర్కొనన్నారు. రాజీవ్‌గాంధీ కూడా దేశం కోసం ప్రాణాలిచ్చారన్నారు. మీరెవరైనా దేశం కోసం ఒక్క రక్తపు బొట్టు అయినా కార్చారా? అంటూ బిజెపిని ఆయన >>2

# నేడు కొండగట్టుకు ఎపి డిసిఎం పవన్



**మల్యాల, జనవరి 1, ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంకు ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేడు రానున్నారు, కొండగట్టు చరిత్రలోనే ఊహించని విధంగా ఎపి డిప్యూటీ సిఎం పవన్ కొండగట్టు అంజన్న ఆలయం అభివృద్ధి అడుగులు వేస్తున్నారు, వందలాది సంవత్సరాల చరిత్ర కలిగిన కొండగట్టు ఆంజనేయస్వామి వారిపై అపారమైన భక్తి పారవశ్యంతో పక్క రాష్ట్రం అయినప్పటికీ పవన్ కళ్యాణ్, కొండగట్టు పై కేంద్రీకరించారు. పవన్ కల్యాణ్ కు కొండగట్టు ఆంజనేయ స్వామి వారిపై, అత్యంత విశ్వాసం, భక్తిశ్రద్ధలు ఎందుకు నిదర్శనం,,, అంజన్న భక్తుడైన పవన్ శ్రీ స్వామివారి దయవలెను తాను >>2

# 52.82 లక్షల మందికి 'గృహలక్ష్మి'

## 22 బిసి కార్పొరేషన్లకు రూ. 495 కోట్లు, రిటైరైన వారికోసం రూ. 1752 కోట్లు

### అసెంబ్లీలో జవాబిచ్చిన డి.సిఎం భట్టి, మంత్రులు పొన్నం, తుమ్మల

**హైదరాబాద్, ప్రభాతవార్త, జనవరి 02:** తెలంగాణ రాష్ట్ర శాసనమండలి శీతాకాలం సమావేశాలు రెండోరోజు శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యాయి. సభ ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలను చేపడుతున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. మొదటి ప్రశ్నను కాంగ్రెస్ సభ్యురాలు, నటి విజయశాంతి, అద్దంకి దయాకర్ ఎనర్జీ శాఖకి సంబంధించిన ప్రశ్నను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను అడిగారు. రాష్ట్రంలో మహాలక్ష్మీ పథకంలో భాగంగా అర్హులైన మహిళలకు గృహజ్యోతి పథకం కింది నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును ఎంత మందికి అందిస్తున్నారని, తద్వారా ప్రభుత్వంపై ఎంత మేరకు భారం పడుతుందని ప్రశ్నించారు. విజయశాంతి ప్రశ్నకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధాన మిస్తూ.. రాష్ట్రంలో ఎన్‌పిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ అధ్వర్యంలో 52,82,498 మంది లబ్ధిదారులకు గహ్రాహజ్యోతి పథకాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ పథకం మూలంగా రాష్ట్ర ప్రభుత్వం మార్చి 2024 నుంచి ఈ ఏడాది డిసెంబర్ వరకు రూ. 3593.17 కోట్లను ఖర్చు చేసినట్టు తెలిపారు. అర్హులైన మహిళలందరికీ ఈ పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. బిఆర్ఎస్ సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్ రావు ప్రశ్నిస్తూ ప్రతి వెనుకబడిన కులానికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులను కేటాయించారా? అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానమిస్తూ.. రాష్ట్రంలోని ప్రతి వెనుకబడిన కులానికి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయలేదని, రాష్ట్రంలో 22 కార్పొరేషన్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆయా కార్పొరేషన్లకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 4956.04 కోట్ల నిధులను కేటాయించినట్టు మంత్రి తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులతోపాటు మహిళా ఉద్యోగులకు పూర్తి సర్వీసు కాలంలో చైల్డ్‌కేర్ లీవ్‌లు వాడుకోవడానికిగాను కేంద్ర ప్రభుత్వం 360 రోజులను, ఇతర రాష్ట్రాలు 180 రోజులను మంజూరు చేయగా, తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 90 రోజులను మాత్రమే మంజూరు చేశారని.. రాష్ట్రంలో కూడా కేంద్రం, ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాన్ని అమలు చేసే యోచనను ప్రభుత్వం చేస్తుందా? అని ప్రశ్నించారు. అందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సమాధానమిస్తూ.. రాష్ట్రంలో ప్రస్తుతం మహిళలకు 90 రోజులపాటు చైల్డ్ కేర్ లీవ్‌లను అమలు చేస్తున్నామని.. ఇవి కాకుండా మెటర్నరీ సెలవులు వేరుగా ఉంటాయని తెలిపారు. >>7

# జిహెచ్ఎంసి సవరణ సహా 5 బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి2:** తెలంగాణ శాసనసభ శుక్రవారం జరిగిన సమావేశాల్లో 5 కీలక సవరణ బిల్లులకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన మున్సిపాలిటీల నాలుగో సవరణ బిల్లు, జీహెచ్ఎంసీ సవరణ బిల్లు , జీహెచ్ఎంసీ రెండో సవరణ బిల్లులను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. నగర పాలనలో సంస్కరణలు తీసుకురావడంతో పాటు, ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించడమే ఈ బిల్లుల ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం పేర్కొంది. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించే యోచనలో భాగంగా >>2

# ఇక సామాన్యుడిదే 'వైకుంఠం'!

## ప్రశాంతంగా భక్తులు సంతోష దర్శనం

**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** ధనుర్మాసంలో పవిత్రమైన పదిరోజుల వైకుంఠద్వార దర్శనంలో నాల్గవరోజు శుక్రవారం నుండి వారంరోజులు సామాన్యభక్తులకే అవకాశం కల్పిస్తున్నారు. ఈ వైకుంఠ దర్శనాలకు ఎటువంటి టోకెన్ ,టిక్కెట్ లేకున్నా సర్వదర్శనమ్‌లో భక్తులను తిరుమలలోని ఆక్టోపస్ భవనం కూడలి నుండి గురువారం రాత్రి అనుమతించిన టిటిడి అధికారులు శుక్రవారం ఉదయం శిలాతోరణం వద్ద ఉన్న క్యూలైన్ల మీదుగా భక్తులను వైకుంఠమ్ 2 లోనికి అనుమతిస్తున్నారు.

తొలినుండి పటిష్టప్రణాళికలు రచించిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ గురువారం మద్యాహ్నం నుండి క్యూలైన్లను పర్యవేక్షించారు.

శుక్రవారం ఉదయం నుండి సామాన్యభక్తులకు ఆన్‌లైన్‌లో 300 రూపాయలు 15వేలమంది, వెయ్యిమంది శ్రీవాణి టిక్కెట్ భక్తులతో బాటు వైకుంఠద్వార దర్శనాలను మహాలఘులోనే అనుమతించి చేయిస్తున్నారు. సాయంత్రం వరకు 47వేల మంది భక్తులు వైకుంఠ ద్వారంలో ఏడుకొండలస్వామిని దర్శించుకున్నారు. పదిరోజుల వైకుంఠ దర్శనాల్లో తోలిమూడురోజులు డిసెంబర్ 30,31,జనవరి 1న మాత్రం ఆన్‌లైన్‌లో ఇడిప్ టోకెన్లు కలిగిన 1.79లక్షల మంది భక్తులు దర్శనం చేసుకోగా అదనంగా మరో దాదాపు 23వేలమంది వరకు భక్తులు రాజ్యాంగహోదాలో ఉన్న విఐపిలువారి కుటుంబ సభ్యులు ,టిటిడి ఉద్యోగులు దర్శనం చేసుకోవడం విశేషం.

ఆ మూడురోజులు సాఫీగా చేయించిన టిటిడి అధికారులు శుక్రవారం నుండి రెండింతలు ప్రశాంతంగా, సాఫీగా సంతోషకర వైకుంఠ దర్శనాలు చేయిస్తున్నారు. తిరుమల ఆలయంలో ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలతోబాటు మరో ఎనిమిదికోజులు భక్తులు తిరుమలకు చేరుకుని భారీగా గోవింద మాలలు ధరించి గోవిందనామాలతో తిరుమల మారుమోగుతోంది. భక్తులకు టిటిడి అధికారులు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. సరాసరి రోజుకు 70వేలమందికి మించి దర్శనం చేసుకోంటున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు సామాన్యభక్తులకే వైకుంఠద్వార దర్శనాలు ప్రాధాన్యతనిస్తున్నామని టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితెలిపారు. నిర్ణేశిత సమయం ప్రకారమే భక్తులను రెండు గంటల్లోనే సర్వదర్శనంలో వైకుంఠ ద్వారం దర్శనం చేయించడం ప్రత్యేకత. తిరుమలలో భక్తులకు క్యూలైన్లలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. తాగునీటికి ప్రత్యేకంగా క్యాన్లను తీసుకువచ్చి భక్తులకు ఎక్కడ అడిగితే అక్కడ తాగునీరు అందించడం ఈ ఏడాది ప్రత్యేకత.

కాగా ఏఐతో తొలిసారిగా తిరుమలలో శుక్రవారం ఉదయం 9గంటలవరకు 805వాహనాలు చేరుకోగా,తిరుపతికి 399 వాహనాలు వెళ్ళాయి. మొత్తం 30,976మంది భక్తులు చేరుకోగా 10వేలయమంది భక్తులు దర్శనం చేసుకున్నారు.ఈ వివరాలను అదనపు ఇఒ వెంకయ్యచౌదరి వెల్లడించారు.

# రెండు స్టూడెంట్ బస్సులకు ఘోర ప్రమాదాలు

## మొద్దులగూడెంలో స్కూలుబస్సు కాలువలోకి పల్టీ

### 20 మందికి పైగా గాయాలు, బస్సులో వందమంది పైనే


బోల్తాపడిన వివేకానంద విద్యాలయ బస్సు

**సత్తుపల్లి జనవరి 2 ప్రభాత వార్త :** ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని యంసూర్ మండలంలోని మోద్దులగూడెం గ్రామానికి చెందిన వివేకానంద విద్యాలయానికి చెందిన ప్రైవేటు బస్సు విద్యార్థినీ విద్యార్థులను సాయంత్రం ఇళ్లకు తరలిస్తున్న సమయంలో డ్రైవర్ అతివేగంగా నిరక్ష్యంగా బస్సును నడపడంతో నాగార్జునసాగర్ కెనాల్ పక్కనే ఉన్న దిమ్మును ఢీకొని కాలువలో పల్టీ కొట్టిన సంఘటన గణేష్ పాడు గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. కాలువలో నీళ్లు లేకపోవడంతో విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి ప్రాణహాని లేకుండా పెను ప్రమాదం నుంచి బయటపడగలిగారు. బస్సు పల్టీ కొట్టిన ఎమ్మట్లోనే సమీపంలోని గ్రామాలకు చెందిన వారు >>2

## మణుగూరునుంచి వెళ్తూ మరో కాలేజి బస్సు బోల్తా

### పలువురికి తీవ్రగాయాలు, తప్పిన ప్రాణ నష్టం

**అశ్వాపురం, ప్రభాతవార్త జనవరి 02:** ఏ దేవుడు కరుణించాడో,క్షేమంగా పోయి లాభంగా రా బిడ్డా అని ఏ తల్లి దీవించిందో,ఆ దీవెనలే పెను ప్రాణ నష్టం సంభవించకుండా తమ బిడ్డలను కాపాడుకుంది. వివరాల్లోకి వెళితే పాల్వంచకు చెందిన కేఎల్ఆర్ కాలేజీ యాజమాన్యం ప్రతిరోజూ విద్యార్థులను తమ కాలేజీ బస్సు ద్వారా విద్యార్థులనుమణుగూరు నుండి పాల్వంచకు తీసుకెళ్తుంది. రోజు లాగానే శుక్రవారం కూడా మణుగూరు నుండి విద్యార్థులను ఎక్కించుకొని మొండికుంట దాటగానే మొండికుంట నుండి భద్రాచలం >>2


ప్రమాదానికి గురై బోల్తాపడిన బస్సు



శుక్రవారం చెన్నై వచ్చిన ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు స్థానికులు ఘనస్వాగతం పలికిన దృశ్యం

# 5 బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

>> ఈ సవరణలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. పాలనా సౌలభ్యం కోసం వార్డుల పునర్విభజన, అధికారుల నియామకానికి ఈ బిల్లులు మార్గం సుగమం చేయనున్నాయి.మూడు రోజుల విరామం తర్వాత తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాలు శుక్రవారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఐదు కీలక బిల్లులను సభలో ప్రవేశపెట్టగా.. శాసనసభ వాటికి ఆమోదం తెలిపింది. వీటిలో అత్యధికంగా నాలుగు బిల్లులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సభ ముందు ఉంచారు. పాలనలో సంస్కరణలు, విద్యా రంగంలో మార్పులే లక్ష్యంగా ఈ సవరణలు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది.

**మున్సిపల్ అండ్ జీహెచ్ఎంసీ సవరణ బిల్లులు:**
నగర పాలనలో మరింత పారదర్శకత కోసం తెలంగాణ మున్సిపాలిటీ నాలుగో సవరణ బిల్లుతో పాటు.. జీహెచ్ఎంసీకి సంబంధించిన రెండు సవరణ బిల్లులను ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారు. ఇవి స్థానిక సంస్థల అధికారాలు, పరిపాలనా విధివిధానాలను మెరుగుపరచడానికి ఉద్దేశించినవని పేర్కొన్నారు. ప్రైవేట్

**విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు:**
రాష్ట్రంలో ఉన్నత విద్యా ప్రమాణాలను పెంచేందుకు, ప్రైవేట్ వర్సిటీల నిర్వహణలో మార్పులు చేస్తూ ఈ బిల్లును ఆమోదించారు.

**మోటార్ వాహనాల పన్ను సవరణ బిల్లు:**
రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. వాహనాల పన్నుల క్రమబద్ధీకరణ దీని ప్రధాన ఉద్దేశం. మున్సిపల్ పరిపాలనను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో పేర్కొన్నారు. జీహెచ్ఎంసీలో మెరుగైన సేవల కోసం గ్రేటర్ పరిధిని మూడు కార్పొరేషన్లుగా విభజించే యోచనలో ఉన్నామని, దీనిపై అందరి అభిప్రాయాలు తీసుకుంటామని తెలిపారు. నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలిస్తామని, భవిష్యత్తులో కేవలం ఎలక్ట్రిక్ బస్సులు మాత్రమే తిరిగేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం టేకోవర్ చేసి.. నగరం నలుమూలలా విస్తరిస్తామన్నారు.

# అసెంబ్లీ బాయ్‌కాట్

>> అని.. కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్లు సీఎం మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.అసెంబ్లీలో రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఆర్ ఆర్ ట్యాక్స్ నడుస్తోందని ఆరోపించారు. ప్రతి దానికి కమీషన్లు తీసుకుంటున్నారన్నారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కుతున్నారని మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలు చేశారు. అంతకు ముందు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ సుందరీకరణపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రతిపక్ష, అధికార కాంగ్రెస్ పార్టీ మధ్య మాటల యుద్ధం జరిగింది.
హరీశ్‌రావు మాట్లాడుతూ.. మూసీ సుందరీకరణ పనుల పేరుతో పేదల ఇండ్లను కూల్చివేస్తే బీఆర్ఎస్ ఊరుకోదని హరీశ్‌రావు హెచ్చరించారు. అవసరమైతే బుల్డోజర్ల కింద పడుకుని కూల్చివేతలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణకు అసలు బడ్జెట్ ఎంత? దానికి ఎక్కడి నుంచి డబ్బులు తీసుకొస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. దీనిపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది.
మూసీ ప్రక్షాళనను హరీశ్‌రావు వ్యతిరేకించలేదని సనంత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళన విషయంలో ఎలా ముందుకెళ్తారని అడిగారని వివరించారు. మా సభ్యులు ముఖ్యమంత్రిని కించపరిచినట్లు మాట్లాడలేదని స్పష్టం చేశారు.
ప్రశ్నోత్తరాలకు ఇంత సమయం వద్దని.. స్వల్పకాలిక చర్చ చేపట్టాలని కోరామని తెలిపారు. దీనికే ముఖ్యమంత్రికి అంత అక్కసు ఎందుకని ప్రశ్నించారు. అయితే ముఖ్యమంత్రి వ్యాఖ్యలపై మాట్లాడేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు స్పీకర్ తగినంత సమయం ఇవ్వలేదు. దీనికి నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు.

# కడుపు నిండా విషమేనా!

>> విపక్ష సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు బాలునాయక్, కె.శంకరయ్య, ఎంఎల్ఆర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానం ముఖ్యమంత్రిచెప్పారు. సిఎం వ్యాఖ్యలపై మాట్లాడటానికి అవకాశం ఇవ్వాలని పట్టుబట్టిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ సానుకూలంగా స్పందించకపోవడంతో ఆగ్రహంతో అసెంబ్లీ బహిష్కరిస్తామని చెప్పి సభ నుంచి వెళ్లిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ఎక్కడ అనుకుంటే మూసీ నది ప్రక్షాళన చేసి ఏడాది అంతా మంచి నీటి ప్రవాహం అందులో ప్రవహించేలా చర్యలు తీసుకొంటామని సభకు తెలిపారు.తెలంగాణ అనంతగిరి హిల్స్‌లో పుట్టి 240 కిమి ప్రవహించి మూసీ నది వాడపల్లిలో కృష్ణా నదిలో కలుస్తోందని ముఖ్యమంత్రి భౌగోళిక స్వరూపం వివరించారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోట బాపుఘాట్ నిర్మిస్తామని అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని చెప్పారు. మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కి.మీ నిడివితో చేయాలని ప్రతిపాదించామని అన్నారు. ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు 9.5కిమి,హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.5కి.మి అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారంభిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డిపిఆర్ పై క్లారిటీ వస్తుందని వివరించారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మి మూసీ అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. 51 కి.మి ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని దానిపై రూ.450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సిఎం ప్రకటన చేశారు.
గతంలో గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60 వేల కుటుంబాలను మరో ప్రాంతానికి తరలించారని అదే తరహాలో కొంత మందికి పునరావాసం చేయాల్సి వస్తే చేస్తామని ఎవ్వరికి అన్యాయం చేయమని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో గంగా నది ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారన్నారు. నది పరివాహక ప్రాంతాల అభివృద్ధిని బిజెపి ఎన్నికల మేనిఫెస్టోను మర్చిందని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించట్లేదని మన వద్ద కొందరు వ్యతిరేకిస్తున్నారని ముఖ్యమంత్రి ఆవేదన చెందారు. మనవద్ద నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. వరద నుంచి హైదరబాద్‌ను రక్షించేందుకు 1922నాటికి ఉస్మాన్‌సాగర్,హిమాయత్‌సాగర్ ప్రాజెక్టులను చేపట్టారని నైజాం ప్రపంచ దేశాలతో హైదరాబాద్ నగరం తర్చిదిద్దారని అయితే ఆ జలవనరులను కలుషితం చేశారని అన్నారు. కబ్జాలు చేసి ఫాంహౌజ్‌లు నిర్మించి వాటి డ్రైనేజిని జంటజలాశయంలో కలిపారని అలాంటి నిందితులపై ఉక్కుపాదం మోపితే తనను రియల్‌ఎస్టేట్ వ్యాపారి అంటూ తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపుతామని చెప్పారు.
మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నుంచి 20 టిఎంసిలు నగరానికి తరలించేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.నగరం దాహార్తి తీర్చేందుకు 15 టిఎంసిలు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మరో 5 టిఎంసిలు గండిపేటకు తరలించాలని యోచన తమ ప్రభుత్వానికి ఉందని వివరించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చి నిర్మిస్తామని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని ప్రకటించారు. ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు రూ.4,100 కోట్ల రుణం ఇస్తుందన్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. మీ హైదరాబాద్ లోని ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపునిచ్చారు.హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టంచేశారు. తాము మంచి పని చేయాలనుకుంటున్నామనీ, మీ సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. డిపిఆర్ సిద్దమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ఇచ్చి సలహాలు తీసుకుంటామని గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలకు స్పష్టం చేశారు.

**మూసీ ప్రక్షాళన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతిపాదించారు : దానం నాగేందర్**
మూసీ ప్రక్షాళన 2004లో వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రణాళికలు చేశారని,ఆ తరువాత వచ్చిన ముఖ్యమంత్రులు దానిని కోల్డ్‌స్టోరేజిలో వేశారని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మూసీ కలుషిత నీటితో పండించిన పంటలు రైతులు విక్రయించుకోలేకపోతున్నారని కొన్నవాళ్ళకు కూడా ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని ఆయన ఆవేదన చెందారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన కోసం ప్రణాళిక బద్ధంగా వెళుతున్నారని మంత్రుల బృందం సౌత్ కొరియాకు పంపించారని గుర్తుచేశారు. సోషల్‌మీడియాలో మూసి ప్రక్షాళన చేసే ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆవేదనచెందారు.

# నేడు కొండగట్టుకు ఎపి డిసిఎం పవన్

>> ప్రమాదం నుండి బయటపడ్డానని పేర్కొనడం, ఎన్నికల సమయంలో తన ప్రచార వారాహి రథాన్ని కూడా అంజన్న ఆలయం వద్దనే పూజలు జరిపి ఇక్కడి నుండే ప్రచార పర్వం మొదలుపెట్టి, ఎన్నికల్లో విజయం సాధించి ఆపై ఏపీ డిప్యూటీ సిఎంగా కూడా పదవి నలంకరించారు, ఎపిలో ఎన్నికల సమయంలో కొండగట్టుకు శ్రీ స్వామివారి దర్శనానికి వచ్చిన సందర్భంగా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి తోపాటు, అర్చకులు, అధికారులు ఇక్కడ భక్తులకు సౌకర్యార్థం 100 గదుల సత్రం, 2000 మంది కూర్చునే కెపాసిటీ గల మాల విరమణ మండపం కావాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. కొండ గట్టుకు నిధులు మంజూరి కోసం స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కూడ గత ఏడాది కాలం నుండి ఏపీ డిప్యూటీ సిఎం అయిన పవన్ కల్యాణ్‌కు స్వయానా విజ్ఞప్తులతో పాటు, లేఖలు కూడా రాయడంతో పవన్ కల్యాణ్ అంజన్న ఆలయం పై ప్రత్యేకించి దృష్టి పెట్టి ఇటీవలే టిటిడి పాలకమండలిలో కొండగట్టు అభివృద్ధికి రూ, 35,19 కోట్ల నిధులను కేటాయింపు జరిపించి తన అపూర్వమైన పవర్ఫుల్ భక్తిని నిరూపించారు, ఆ నిధులతో కొండగట్టులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు మహత్తరమైన కార్యక్రమాన్ని సాగిస్తున్నారు.

# కూలీలను కొట్టి కార్పొరేట్లకా?

>> ప్రశ్నించారు.ఈ చర్చలో బిఆర్ఎస్ పాల్గొనకపోవడం దురదృష్టకరం అని చెప్పారు. వాళ్లకు పేదల మీద ప్రేమ లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రాజకీయ లబ్ధి తప్ప ప్రజల మీద ఆలోచన లేదని విమర్శించారు. బిజెపి తీసుకువచ్చిన చట్టానికి వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం బిఆర్ఎస్‌కు లేదన్నారు. అంతేకాక వారికి మద్దతుగా ఉండే ఆలోచన మాత్రమే ఉంది. ఇది రాష్ట్రానికి ఏ మాత్రం మంచిది కాదన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వాలు తీసుకువచ్చిన చట్టాలు సమాజంలో మార్పు సమతుల్యత కోసం తీసుకువచ్చాయని చెప్పారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్ తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. భూమి లేని నిరుపేదలకు భూస్వాముల భూములను పేదవాళ్లు భూమిని పంపిణీ చేసిందన్నారు. ఇది సమాజంలో అసమానతలను తగ్గించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. తెలంగాణలో తీసకువచ్చిన ల్యాండ్ టెన్నెన్సీ యాక్ట్ తీసకువచ్చి భూములపై హక్కులను కల్పించామని చెప్పారు. బ్యాంకలు జాతీయీకరణ ద్వారా దేశంలోని ప్రయివేట్ బ్యాంకులను జాతీయ చేశాము. సామాన్యులను, పేదలను, రైతులను బ్యాంకులకు తీసుకువచ్చి లోన్లు తీసుకోవడం జరిగింది. సమాజంలో ఎన్నో మార్పులకు ఇది ఈ నిర్ణయం నాంది పలికిందన్నారు, ఫుడ్ సెక్యూరిటీ చట్టం ద్వారా ప్రతి పేదవాడికి ఆహార బద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించిందన్నారు. దేశం నేడు అభివృద్ధి చెందిందంటే,ఆనాటి నాయకులు ముందు చూపు మాత్రమే. పండిట్ నెహ్రూ, మహాత్మా గాంధీ, బాబా సాహెబ్ అంబేద్కర్ అంటే బిజెపి ప్రభుత్వానికి ఏ మాత్రం పడదన్నారు. ఒకప్పుడు కూలీ పెరగాలంటే ఉద్యమాలు జరిగేవి. లాఠీ ఛార్జీలు జరిగేవి. అలాంటివి ఊమీ లేకుండా ఉపాధి కూలీ చట్టం ద్వారా ఒక్కటే సారి వంద రూపయాలు పెంచి అన్ని కల్పించేవి. నిశ్శబ్ద విప్లవం ఇది.ఈ చట్టాన్ని మార్చేసి.. సమాజంను ఇబ్బందుల్లోకి నెట్టడమే. కార్పోరేట్ శక్తులకు వంత పాడేలే కొత్త చట్టం ఉందన్నారు.జీవితాలకు భద్రత లేకుండా చేస్తున్నారు. మాది రైట్ టు వర్క్ అనేది మా చట్టం. మీరు దానిని పూర్తిగా మార్చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడైనా పనిచేసే హక్కును ఈ ప్రభుత్వం తీసేసింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో మొత్తం 100శాతం కేంద్రమే భరించాలి. గతంలో మేము అలాగే ఇచ్చాము. బీజేపీ ప్రభుత్వం కూడా అలాగే ఇవ్వాలి. ఉపాధి హామీ పథకాన్ని మార్చేసి 6040కి ఎలా మారుస్తారు. ఇది రాష్ట్రాల మీద భారం వేయడమే. కర్నాటక 100 రూపాయలు ఇస్తే.. 25 నుంచి 30 రూపాయలు ఇస్తున్నారు. తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు 100 రూపాయలు ఇస్తే.. 35 నుంచి 40 రూపాయలు ఇస్తున్నారు. ఉత్తర్ ప్రదేశ్ 100 రూపాయలు ఇస్తే 350, బీహార్ 100 రూపాయలు ఇస్తే 650య రూపాయలు ఇస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలు ఏం పాపం చేశాయి. దేశానికి జీడీపీ ఇవ్వడమే మేము చేసిన తప్పా. ఎవరి సొమ్ము ఎవరికి ధారాదత్తం చేస్తున్నారు. పేదలకు మేలు చేసే చట్టాలకు బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. దీనిని ఖండిస్తున్నాం. కూలీలకు బేరం ఆడే శక్తిని తగ్గిస్తుంది. ఇది అత్యంత ప్రమాదకరం. గ్రామీణ మహిళలకు ఆర్థిక సాధికారత నశించిపోతుంది. సామాజిక పరివర్తనకు ఇది గండి కొడుతుంది. ఉపాధి కూలీలందరూ ఈఆ రోజుఏ మౌనంగా రోధిస్తున్నారు. పేదల పక్షాన నిలబడేందుకు మనం ఒక ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి అని సూచించారు.

# నీటి పంచాయితీలపై ప్రత్యేక కమిటీ

>> రాష్ట్రాల జల వివాదాల పరిష్కారానికి కేంద్రప్రభుత్వం సంపూర్ణ సహకారం అందజేస్తుందని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి ఓ కమిటీని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. ఆ కమిటీని కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ నోటిఫై చేసిందని తెలిపారు. కేంద్ర జల వనరుల సంఘం ఛైర్మన్ నేతృత్వంలో ఈ కమిటీ పని చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కమిటీలో సభ్యులుగా తెలుగురాష్ట్రాల ఇరిగేషన్ అధికారులు ఉన్నారని వివరించారు. ఈ కమిటీలో కెఆర్ఎంబి,జిఆర్ఎంబి ఛైర్మన్లు, సిడబ్ల్యుసి,ఎన్‌డబ్ల్యుడిఏ చీఫ్ ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు.
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీజలాల వినియోగంలో నెలకొన్న వివాదాల పరిష్కారానికి సంబంధించిన కమిటీని శుక్రవారం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ నోటిఫై చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం.. సహకార సమాఖ్య విధానంతో.. గత 11 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాల పరిష్కారానికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని చెప్పుకొచ్చారు. ఇందుకోసం ప్రత్యేకమైన వేదికలను ఏర్పాటుచేసి సమన్వయంతో సమస్యల పరిష్కారానికి బాటలు వేస్తోందని పేర్కొన్నారు.
ఉదాహరణకు.. కృష్ణానది జల వివాద పరిష్కారానికి 6 అక్టోబర్ 2023నాడు కెడబ్ల్యుడిటి-2 (కృష్ణా వాటర్ డిస్‌పూట్ ట్రిబ్యునల్)ను) ఏర్పాటుచేసి.. అడిషనల్ టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌ను నిర్దేశించింది. రెండేళ్ల కాల వ్యవధి 1 ఆగస్టు,2025 నాడు ముగిసింది.కృష్ణాజలాల వినియోగంపై వాదనలు నడుస్తోండటంతో దీన్ని మరో ఏడాది (31 జూలై, 2026) పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇలా తెలుగు రాష్ట్రాల జల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సహకరిస్తోంది.
కాగా, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని చాప్టర్ 9, సెక్షన్ 84 ప్రకారం.. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగానికి సంబంధించిన విషయంలో సమస్యల పరిష్కారం కోసం అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటైంది. 16, జూలై 2025 నాడు ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ (జల్‌శక్తి) మంత్రి సిఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న విషయం తెలిసిందే.
ఈ సమావేశంలో.. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలను ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రస్తావించగా.. వాటిని చర్చించి, సాంకేతికతంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని అపెక్స్ కౌన్సిల్ నిర్ణయించింది. ఇందుకోసం ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయాలని సూచించింది. డిసెంబర్ 23, 2025 నాడు తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేయడంతో శుక్రవారంనాడు కేంద్ర జలవనరుల సంఘం కొత్త కమిటీని నోటిఫై చేసింది. ఈ కమిటీకి కేంద్ర జల వనరుల సంఘం ఛైర్మన్ నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో తెలంగాణ నుంచి జలవనరుల శాఖ సలహాదారు, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ, ఇంజనీర్ ఇన్ చీఫ్ సభ్యులుగా ఉండగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి.. జలవనరుల శాఖ స్పెషల్ సెక్రటరీ, జలవనరుల శాఖ సలహాదారు, ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇరిగేషన్), చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉండనున్నారు. వీరితోపాటుగా.. కృష్ణానది యాజమాన్య బోర్డు ఛైర్మన్, గోదావరి నది యాజమాన్య బోర్డు ఛైర్మన్, నేషనల్ వాటర్ డెవలప మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యుడిఏ) చీఫ్ ఇంజనీర్, సిడబ్ల్యుసి చీఫ్ ఇంజనీర్ కూడా సభ్యులుగా ఉండనున్నారు.

## వారం - వర్జ్యం

03-01-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం, పూర్వాషాఢ కార్తె
○ పౌర్ణమి మ.3.35,
ఆరుద్ర సా.5.30,
వర్జ్యం : తె.4.23-తె.5.50,
దు.ఉ.6.37-ఉ.8.10
శుభసమయం : ఉ.8.20-8.50,సా.5.50-6.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఇంటి యందు శుభకార్యాల గురించి సన్నిహితులతో చర్చిస్తారు. స్త్రీ మూలంగా ధనలాభం పొందుతారు.

**వృషభం :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతారు.

**మిథునం:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంత వరకు మెరుగు పడుతుంది. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**కర్కాటకం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వివాదాలకు దూరంగా వుండండి. ఉద్యోగులకు స్థాన చలనం.

**సింహం:** దూర ప్రాంతాల నుండి ముఖ్య సమాచారం తెలుసుకొంటారు. చర్చా గోష్ఠులలో పాల్గొంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**కన్య :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. ఆహార నియమాలు పాటిస్తారు.

**తుల :** పారిశ్రామిక, రాజకీయ రంగాలలోని వారికి కొంతవరకు అనుకూలం. శుభవార్తలు ఆనందం కలిగిస్తాయి.

**వృశ్చికం:** దురభ్యాసాల వైపు మనస్సు మళ్ళకుండా జాగ్రతలు వహించండి. ఆదాయాన్ని మించి ఖర్చులు పెరుగుతాయి.

**ధనుస్సు:** స్పెక్యులేషన్సు దూరంగా ఉండటమే పరోక్షంగా లాభంగా పరిణమిస్తుంది. ఇంటాబయటా అనుకూలం.

**మకరం:** వృత్తి, ఉద్యోగాల పరంగా ఉపయుక్తం లేని బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్య నియమాలను పాటించండి.

**కుంభం:** మానసిక వత్తిడి అధికమవుతుంది. సెంటిమెంటు వస్తు భద్రతపట్ల జాగ్రత్తలు అవసరం.

**మీనం:** స్త్రీలతో విభేదాలు ఏర్పడనంతవరకు చెప్పుకోదగిన ఇబ్బందు లేవీ చోటు చేసుకోవు. వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మనాలిలో ఒకవంక చలి ఎముకలు కొరికేస్తుండగా హాట్ ఎయిర్ బెలూన్లు ఎగురవేసిన దృశ్యం

# వీబీ జీ రామ్ జీని వ్యతిరేకిస్తూ అసెంబ్లీ తీర్మానం

## పేదల హక్కులు దెబ్బతీస్తున్న కేంద్రం: సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.జనవరి2:** జాతీయ ఉపాధి హామీ పథకంపై తెలంగాణ సిఎం ఎ.రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై కేంద్రం ప్రభుత్వ వైఖరిపై తెలంగాణ అసెంబ్లీలో శుక్రవారం సాయంత్రం చర్చించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2005లో యుపిఎ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేసిందని ప్రస్తావించారు. 2006 ఫిబ్రవరి నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చిందని స్పష్టం చేశారు. 62శాతం పేదవారు వెనుకబడిన వర్గాలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందాయని వెల్లడించారు.పేదల హక్కులు దెబ్బతీసేలా కేంద్రనిర్ణయం ఉందని ధ్వజమెత్తారు. కొత్త చట్టం మహిళా కూలీలకు వ్యతిరేకంగా ఉందని చెప్పుకొచ్చారు. కొత్త చట్టంతో పని దినాలు తగ్గిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. నిధుల వాటా 60, 40శాతం మార్చడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న పనుల జాబితాను యథావిధిగా కొనసాగించాలని అసెంబ్లీలో తీర్మానం చేస్తున్నామని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సభా తీర్మానంను సభలోని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన కోరారు.గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి కల్పించి, పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాను అందించేందుకు డా. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపిఎ ప్రభుత్వం 2005లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులోకి తీసుకు వచ్చిందని గుర్తు చేశారు. ఈ చట్టం 2006 ఫిబ్రవరి 2 నుంచి అమలులోకి వచ్చిందని తెలిపారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి కనీసం 100 రోజుల ఉపాధి కల్పించి, కనీస వేతనం అందించే గ్యారంటీ ఈ చట్టం ప్రధాన లక్ష్యమన్నారు. గత 20 సంవత్సరాలుగా ఈ పథకం ద్వారా మన రాష్ట్రంలో లబ్ధి పొందిన వారిలో సుమారు 90 శాతం ఎస్సీలు, ఎస్టీలు, బీసీలున్నారని చెప్పారు. వీరిలో 62 శాతం మహిళలు లబ్ధి పొందారు. దళితులు, గిరిజనులు, దివ్యాంగులు, అత్యంత వెనుకబడిన తెగలకు చెందిన ఆదివాసీలు, చెంచులు, పేద వర్గాలే ఎక్కువగా ప్రయోజనంపొందారని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ) చట్టం విబి జి ఆర్ఎం జి - 2025 పేదల హక్కులను దెబ్బతీసేలా ఉందన్నారు.. కొత్త చట్టం పేదల హక్కులకు వ్యతిరేకంగా ఉంది. ఉపాధి హామీ చట్టం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. డిమాండ్ అనుగుణంగా పనుల ప్రణాళికను తయారు చేసే విధానానికి స్వస్తి పలికింది. డిమాండ్ ఆధారిత పాత విధానాన్ని కొనసాగించాలి. కొత్త చట్టం మహిళా కూలీలకు వ్యతిరేకంగా ఉంది. ఇప్పుడు అమల్లో ఉన్న ఎంజిఎన్ఆర్ఈజీఏలో దాదాపు 62 శాతం మహిళలు కూలీ పొందేవారు. కొత్త చట్టంలో పొందుపరిచిన పరిమిత (నార్మేటివ్) కేటాయింపుల విధానం వల్ల పని దినాలు తగ్గిపోతాయి. దీంతో పేద కుటుంబాల్లోని మహిళలు నష్టపోతారు. మహిళా సాధికారత సాధించాలంటే పాత విధానం పునరుద్ధరించాలి. ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో పూర్తిగా కేంద్రమే నిధులు కేటాయించేది. కొత్త చట్టం ద్వారా కేంద్రరాష్ట్ర నిధుల వాటా 60:40గా మార్చటం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుంది. ఇది రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారాన్ని మోపుతుంది. పాత నిధుల వాటా నమూనాను పునరుద్ధరించాలి. మహాత్మాగాంధీ గారి పేరును ఈ పథకం నుంచి తొలగించటంతో గాంధీ గారి స్ఫూర్తిని నీరుగార్చినట్లయింది.5. వ్యవసాయ సీజన్ లో 60 రోజుల విరామం తప్పనిసరిగా విధించడంతో భూమి లేని నిరుపేద కూలీలకు అన్యాయం జరుగుతుంది. ఉపాధి హామీ పథకాన్ని సంవత్సరం పొడవునా కొనసాగించాలి.6. ప్రస్తుతం ఉపాధి హామీ ద్వారా 266 రకాల పనులు చేపట్టే వెసులుబాటు ఉంది. కొత్త చట్టంలో భూముల అభివృద్ధి వంటి శ్రమ ఆధారిత పనులు తొలిగించటంతో చిన్న సన్నకారు రైతులు, దళితులు, గిరిజనులు నష్టపోతారు. ఇప్పుడున్న పనుల జాబితాను యథాతథంగా అనుమతించాలి. ఈ ఆరు అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎంజిఎన్ఆర్ఇజిఎ చట్టంలో నిర్దేశించిన ఉద్దేశాలు,లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని కూలీకుటుంబాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు మహాత్మాగాంధీ ఎన్ఆర్ఈజిఎ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలని ఈ సభ తీర్మానిస్తుందని సిఎం వెల్లడించారు. ఆ వెంటనే సభలోని సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం శనివారం ఉదయం 10 గంటలకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సభను వాయిదా వేశారు.
అసెంబ్లీ ఆవరణలో మంత్రి సీతక్క మీడియాతో చిట్ చాట్‌చేస్తూ ఉపాధి హామీ పథకం పై మాట్లాడాల్సి వస్తుందనే బిఆర్ఎస్ సభ నుంచి వాకౌట్ చేసిందని ఆరోపించారు. బిజెపికి బిఆర్ఎస్ సహకరిస్తుందనే దానికి ఇదే నిదర్శనమని, బిజెపి బిఆర్ఎస్ ఎజెండా ఒక్కటే..కార్పోరేట్‌ల కోసమే బిజెపి, బిఆర్ఎస్ పని చేస్తున్నాయి,అందుకే ఈరోజు చర్చలో టిఆర్ఎస్ పాల్గొనలేదన్నారు. మోడీ మెప్పు కోసం బిఆర్ఎస్ పెద్దలు సభను బైకాట్ చేశారని పేర్కొన్నారు.

# మొద్దుల గూడెంలో

>> వెంటనే సంఘటన ప్రదేశం కొచ్చి విద్యార్థిని విద్యార్థులను బస్సులో నుంచి బయటికి లాగటంతో చాలా మంది విద్యార్థిని విద్యార్థులకు సురక్షితంగా బయటపడగలిగారు. బస్సులో లెక్కకు మించి విద్యార్థిని విద్యార్థులని ఎక్కించుకొని పాఠశాల సమయం అయిన తర్వాత ఇళ్లకు పంపించే సమయంలో డ్రైవరు అతి వేగంగా నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు 108 సిబ్బందికి వివరించారు. ఆర్టిఏ రూల్స్ కు విరుద్ధంగా ప్రవేట్ స్కూల్ యాజమాన్యం విద్యార్థిని విద్యార్థులను లెక్కకు మించి ఎక్కించటం వల్ల డ్రైవర్ మద్యం సేవించి అతివేగంగా నిర్లక్ష్యంగా బస్సు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బస్సులో ప్రయాణించే విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మొద్దులగూడెం గ్రామంలోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ కి చెందిన స్కూలు బస్సు సాయంత్రం బడి వేళలు పూర్తయినమ్మట్లోనే పిల్లలను ఇళ్లకు చేర్చే అందుకు వెళుతున్న ఈ బస్సు అదుపుతప్పి కాలువలో పడ్డ ఎమ్మట్లోనే సమీప గ్రామస్తులు హుటా హుటిన వచ్చి108 కి సమాచారం ఇవ్వటంతో బస్సులోని దెబ్బలు తగిలిన చిన్నారులను 20 మందికి పైగా ఏంసూరు108 ఈఎంటి మాధవరావు, ఫైలెట్ ప్రశాంత్ గౌడ్, సిబ్బంది పెనుబల్లి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. హాస్పటల్లో గోదా సమ్మిత్ కుమార్, ఎలమర్తి జితేందర్ రెడ్డి ,సాధన చాందిని, యశ్వంతు, కంచర్ల ప్రశాంతు, లు చికిత్స పొందుతుండగా, మరికొందరినీ తల్లిదండ్రులు తిరువూరు ప్రైవేట్ హాస్పటల్‌కి చికిత్స నిమిత్తం తరలించారు. తిరువూరులో ఎంతమంది చికిత్స పొందుతున్నారు అన్నది తెలియాల్సి ఉంది. స్కూల్ బస్సు ప్రమాదంపై విచారం వ్యక్తం చేసిన మంత్రి పొన్నం...సత్తుపల్లి నియోజకవర్గం లోని పెనుబల్లి మండలం గణేష్ పాడు సమీపంలో శుక్రవారం సాయంత్రం స్కూల్ బస్సు పల్టీ కొట్టి పలువురు విద్యార్థులకు తీవ్ర గాయాలైన సంఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సులో తీసుకెళ్లడం పట్ల మంత్రి పాఠశాల యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మణుగూరునుంచి వెళ్తూ..

>>క్రాస్ రోడ్ మధ్యలో ఉన్నటువంటి సాయిబాబా ఆలయం సమీపంలో ఒక్కసారిగా బస్సు పల్టీ కొట్టింది. బస్సు డ్రైవర్ మార్జిన్ తప్పి రహదారి పక్కన ఉన్న ఆర్ అండ్ బి సిగ్నల్ బోర్డును, కాలువ పక్కన ఉన్న కల్వర్టు ను ఢీ కొట్టి గాలిలో ఎగిరి కాలువ అవతల పక్క పడిపోయింది. ఈ సమయంలో బస్సులో సుమారు 40 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. వెంటనే విద్యార్థులు బస్సు యొక్క ముందు వెనక ప్రధాన అద్దాలను పగలగొట్టి బయటికి వచ్చారు. కానీ డిప్లమా ఫైనల్ ఇయర్ చదువుతున్న అంబిక మాత్రం తన చేయి దురదృష్టవశాత్తు బస్సు క్రింద ఉండిపోవడంతో బయటకు రాలేక చేతికి అయిన తీవ్ర గాయంతో చేసే ఆర్తనాదాలు పలువురికి కన్నీళ్లు తెప్పించాయి.అప్పటికప్పుడు రక్షణ శాఖ స్పందించి జెసిబి తెప్పించి దాని సహాయంతో బస్సును కదిలించి అంబికను 108 ద్వారా భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినారు. అనంతరం పలు స్కానింగ్ ల నిమిత్తం కాలేజీ యాజమాన్యం సూచన మేరకు భద్రాచలం లోని ప్రముఖ ప్రైవేటు వైద్యశాల కు తరలించారు.ప్రమాదం సంభవించినప్పుడు క్షణకాలం పసి హృదయాల ప్రాణాలు గాలిలో దీపాలు అయ్యాయి.ఘటన సంభవించిన తర్వాత గుక్కపెట్టి ఏడ్చిన వారి తీరు ఎంతగా భయపెట్టిందో అర్థం చేసుకోవచ్చు.ప్రమాదం సంభవించిన విషయం తమ తల్లిదండ్రులకు చరవాణిలో చేరవేయగా తమ పిల్లలకు ఏమి జరిగిందో అనే ఆతృతతో చేరుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలను గుండెలకు హత్తుకొని కన్నీళ్ల పర్యంతమైనారు. బస్సులో ఉన్న విద్యార్థులలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరందరిని సమాచారం అందగానే సంఘటన స్థలానికి చేరుకున్న అశ్వాపురం సీఐ గూడా అశోక్ రెడ్డి,ఎస్సై రాజేష్ లు తమ సిబ్బందితో భారీగా జామ్ అయిన ట్రాఫిక్ ను కంట్రోల్ చేస్తూ విద్యార్థులను ఎప్పటికప్పుడు 108 ల ద్వారా భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ప్రమాదం జరిగినప్పుడు బస్సు యొక్క స్టీరింగ్ స్ట్రక్ అయిందని విద్యా ర్థులు తెలుపుతున్నారు.నూతనసంవత్సరం జరిగిన తొలి విషాదఘటనగా ఈ ప్రమాదాన్ని అభివర్ణించవచ్చు.

# కృష్ణా జలాలపై బిఆర్ఎస్ ప్రచారాన్ని తిప్పికొట్టండి

### మహబూబ్‌నగర్ ప్రజాప్రతినిధులతో సిఎం రేవంత్ సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 2:** కృష్ణా జలాల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఏం జరిగిందో బయట పెట్టాలని వారికి సూచించారు. కృష్ణాజలాల్లో వాటా తగ్గడం వల్ల జరిగిన నష్టాన్ని వివరించాలన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రజాప్రతి నిధులకు ఆయన పలు సూచనలు చేశారు. శుక్రవారం అసెంబ్లీలో సిఎంను ఆయన ఛాంబర్‌లో కలిశారు. కృష్ణాజలాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు కేసీఆర్ కేసీఆర్ ఏడేళ్ల వరకు డీపీఆర్ సమర్పించలేదని, డీపీఆర్ లేకుండానే రూ.27 వేల కోట్లు ఖర్చు చేశారని సీఎం రేవంత్ రేవంత్ రెడ్డి గురువారం ఆరోపించిన విషయం తెలిసిందే. ఇందువల్ల పర్యావరణ అనుమతులు కూడా రాలేదని, అనుమతులు లేని ప్రాజెక్టులు నిర్మిస్తున్నారన్నారని పాలమూరు రంగారెడ్డిపై కేసులు వేశారని విమర్శించారు. తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం సృష్టించి, తద్వారా లబ్ది పొందాలని భారత రాష్ట్ర సమితి అధినేత కె. చంద్రశేఖర్ ప్రయత్నిస్తున్నారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

# పార్టీ మనుగడ సాగించాలంటే అసెంబ్లీకి కెసిఆర్ రావాల్సిందే

### మండలి చైర్మన్‌ను కలిసిన కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 2:** ప్రస్తుతం జరగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో కేసీఆర్ పాల్గొనాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు. అసెంబ్లీ వేదికగా ప్రస్తుత రాజకీయ పరిణామాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా వచ్చి మాట్లాడితేనే బాగుంటుందని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా జలాలపై కేసీఆర్ మాట్లాడి.. అధికార పక్షం నోరు మూయించాలని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ లీడర్లను మరోసారి టార్గెట్ చేశారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో అక్రమాలకు పాల్పడిన వారిని డిప్యూటీ



ఫ్లోర్ లీడర్‌గా చేయడం అన్యాయమని.. హరీశ్ రావును ఉద్దేశించి విమర్శించారు. బీఆర్ఎస్‌లో బబుల్ షూటర్లకే డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌కు పదవులు ఇచ్చారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్టీ మనుగడ సాగించాలంటే కేసీఆర్ అసెంబ్లీకి రావాలన్నారు.పిల్ల కాకులకేం తెలుసు.. నదీ జలాల విషయాన్ని పిల్లకాకులకు వదిలేయవద్దని.. బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి కల్వకుంట్ల కవిత అన్నారు. అంతేకాకుండా ఆర్థిక శాఖలో ఒక్కో ఫైల్ 9 నెలలుగా పెండింగ్‌లో ఉందని విమర్శించారు. ప్రభుత్వం తన చేతగాని తనాన్ని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్‌పై నిందలు వేస్తున్నారని మండి పడ్డారు. ఆంధ్రప్రదేశ్ నాయకులు శాశ్వతంగా తెలంగాణ నీళ్లు ఎత్తు కెళ్లాలని చూస్తున్నారని.. ఆంధ్ర నేతలకు ఉన్న ఐక్యత తెలంగాణలో లేదని కవిత ఘాటుగా విమర్శించారు. ఇక భవిష్యత్తులో తెలంగాణ జాగృతి మళ్లీ యాక్టివ్ అయితే.. బీఆర్ఎస్‌కు గడ్డుకాలం తప్పదని వార్నింగ్ ఇచ్చారు. అందుకే పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత కేసీఆర్‌పైనే ఉందని తేల్చి చెప్పారు.

**అందుకే అసెంబ్లీకి వచ్చాను..**

కాగా, తాను ఎమ్మెల్సీ పదవికి సెప్టెంబర్ 3వ తేదీనే రాజీనామా లేఖ సమర్పించానని చెప్పిన కవిత.. దాన్ని ఆమోదించాలని మండలి చైర్మన్‌ను కోరేందుకు అసెంబ్లీకి వచ్చానని చెప్పారు. మండలిలో చివరిసారిగా మాట్లాడేందుకు అనుమతి కోరానని తెలిపారు.

# శాసన మండలిలో 22 ప్రత్యేక ప్రస్తావనలు, 8 పిటిషన్లు

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** తెలంగాణ శాసనమండలి శీతకాల సమావేశాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు ఉదయం ప్రశ్నోత్తరాలు ముగియగానే మధ్యాహ్నం స్పెషల్ మెన్షన్లు, పిటిషన్లకు అవకాశం కల్పిస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. దీంతో సభలో 22 మంది సభ్యులు స్పెషల్ మెన్షన్లను చేయగా.. మరో 8 మంది పిటిషన్లను సమర్పించారు. స్పెషల్ మెన్షన్స్‌లో భాగంగా తక్కెళ్లపల్లి రవీందర్ రావు ఉద్యోగుల పెండింగ్ బిల్స్‌పై ప్రస్తావించారు. వాణిదేవి ఉస్మానియా యూనివర్సిటీల్లో హాస్టల్స్‌లలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఒంటేరు యాదవ రెడ్డి జర్నలిస్టులకు ఇబ్బందికరంగా మారిన జీవో 252న సవరించాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి సర్వశిక్ష అభయాన్ ఉద్యోగులు చేసిన 29 రోజుల సమ్మె కాలానికి వేతనం చెల్లించాలని కోరారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. యాదాద్రి టెంపుల్ నిర్మాణంలో సుమారు రూ. 1300 కోట్లు అవినీతి జరిగిందని దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అలా కానీ పక్షంలో సభాసంఘం ఏర్పాటు చేయాలన్నారు.

టెండర్లు ఇచ్చిన సంస్థలకు అదనంగా నిధులను కేటాయించినట్టు ఆర్‌టిఐ ద్వారా సేకరించిన వివరాల్లో ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. టీచర్స్‌కి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ప్రస్తావించారు. ఉద్యమకారుల వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయాలని, వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని స్పెషల్ మెన్షన్ చేశారు. సాహిత్య అకాడమీలను ఏర్పాటు చేయాలని గోరేటి వెంకన్న ప్రస్తావించారు. దేశపతి శ్రీనివాస్ స్పెషల్ మెన్షన్ చేస్తూ.. 125 అడుగుల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర సందర్శనకు అవకాశం కల్పించాలని, అలాగే నిర్వహణను నిర్లక్ష్యం చేయవద్దని ప్రస్తావించారు. 22 మంది స్పెషల్ మెన్షన్ల అనంతరం పిటిషన్లకు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అవకాశం కల్పించారు.

# అక్రమంగా రివాల్వర్ కలిగివున్న వ్యాపారి అరెస్టు

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** పాతబస్తీలోని హుస్సేని ఆలం పరిధిలో గల కిల్వత్‌కు చెందిన ఓ వ్యాపారి ఇరుగు పొరుగు వారిని బెదిరిం చేందుకు అక్రమంగా ఆయుధాన్ని ఖరీదు చేసిన ఉదంతమిది. సదరు వ్యాపారిని సిసిఎస్, హుస్సేని ఆలం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. దీ నికి సంబంధించిన వివరాలను సిసిఎస్ డిసిపి శ్వేత మీడియాకు వెల్లడించారు కిల్వత్‌కు చెందిన అంజాద్ ఖాన్ (29) కొంతకాలం సౌదీ అరేబియాలో వుండి ఎనిమిది నెలల



క్రితం భారత్‌కు వచ్చాడు. అక్కడ సంపాదించిన సొమ్ముతో చార్మినార్ వద్ద వ్యాపారం మొదలు పెట్టాడు. ఇంతవరకు బా గానే వున్నా ఇతను తనకు తెలిసిన ఓ మధ్యవర్తి అమిత్ (ఇతను బిహెచ్ఈఎల్‌కు చెందిన వాడు) సహకారంతో మధ్యప్రదేశ్‌కు చెందిన అవినాష్ అ లియాస్ కల్లు అనే ఆయుధ వ్యాపారి నుంచి 80 వేల రూపాయలకు 0.7 పిస్టల్‌ను కొన్నాడు. దీనిని తన వద్ద భద్రంగా వుంచుకున్న అంజాద్ ఖా న్ కొన్ని రోజులుగా ఇరుగు పొరుగువారిని తాను చెప్పినట్లు వినాలని, తనకు ఎదురు మాట్లాడకూడదని ఈ ఆయుధంతో బెదిరిస్తున్నాడు. దీనిపై స మాచారం అందుకున్న సిసిఎస్, హుస్సేనిఆలం పోలీసులు శుక్రవారం ఉదయం అంజాద్ ఖాన్ ఇంటిపై దాడిచేసి సదరు అక్రమ ఆయుధాన్ని జప్తు చేశారు. ఆయుధంతోపాటు ఒక సెల్‌ఫోన్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. అతన్ని విచారించగా అమిత్, అవినాష్‌ల పేర్లు వెలుగుచూశాయి. ఈ కేసులో అమిత్, అవినాష్‌ల కోసం గాలిస్తున్నారు. కాగా అంజాద్‌ఖాన్ అక్రమ ఆయుధంతో ఏదైనా నేరం చేశాడా...? అనే దానిపైనా విచారణ చేస్తున్నారు.

# శాంతియుత నిరసనకారులపై కాల్పులు జరపొద్దు

### ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వార్నింగ్

### మీ జోక్యం అనవసరం.. తిప్పికొట్టిన సుప్రీంలీడర్

**వాషింగ్టన్, జనవరి 2:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇరాన్‌లో నిరసనకారులపై అక్కడి భద్రతాదళాలు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన చేపడు తున్న వారిపై కాల్పులు జరపవద్దని, అలాంటి వారిని అమెరికా కాపా డుతుందని అన్నారు. శాంతియుతంగా ఆందోళన జరుపుతున్న వారిని లక్ష్యంగా చేసుకుంటే అమెరికా చూస్తూ ఊరుకోదని



ఆయన అన్నారు. అమెరికా అన్నింటికీ సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీఖమేనీ సీనియర్ సలహాదారుడు అలీ లారిజాని తిప్పికొట్టారు. ఈ వ్యవహారంలో అమెరికా జోక్యం అవసరం లేదని ఘాటుగా వ్యాఖ్యా నించారు. అమెరికా జోక్యం చేసుకుంటే ఆ ప్రాంత మంతా ఘర్షణలకు దారితీస్తుందని వ్యాఖ్యా నించారు. తమ జాతీయ భద్రత రెడ్‌లైన్ వంటిదని, దీనిని పరీక్షించాలనుకోవడం సాహసమే అవు తుందని అన్నారు. దేశంలో ధరలు పెరగడంతో పాటు కరెన్సీ విలువ పడిపోయింది. ఇరాన్ ఆర్థిక పరిస్థితి క్షీణించింది. దీంతో దేశంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో నిరసనకారులు పోలీసుల కార్లకు నిప్పంటించారు. పలు ప్రాంతాల్లో భద్రతా దళాలు కాల్పులు జరపడంతో పలువురు ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు.

# న్యూఢిల్లీలో తెలుగు విశ్వవిద్యాలయం రసఝురి అంతర్జాతీయ నృత్యోత్సవం

### వర్సిటీ విసి ఆచార్య వెలుదండ నిత్యానందరావు

**హైదరాబాద్ (నాంపల్లి), జనవరి 2, ప్రభాతవార్త :** భారతీయ శాస్త్రీయ నృత్య సంప్రదాయల పరిరక్షణ, ప్రచారం లక్ష్యంగా సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, ఆధ్వ ర్యంలో రసఝురి అంతర్జాతీయ నృత్యోత్సవం 2026ను నూఢిల్లీలోని గోదావరి ఆడి టోరియం, ఆంధ్ర అసోసియేషన్, లోధిరోడ్‌లో ఈ నెల 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సహకారంతో ఆంధ్ర అసోసియేన్ ఢిల్లీ, తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్త నిర్వహణలో జరగనున్న ఈ నృత్యోత్సవంలో కూచిపూడి, ఆంధ్రనాట్యం, భరతనాట్యం, కథక్, ఒడిస్సీ, మణిపురి, మోహినీయాట్టం, పేరిణి, మయూర భంజ్, ఛౌ తదితర భారతీయ శాస్త్రీయ నృత్య రూపాల ప్రదర్శనలు, ఉపన్యాస-ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశ నలుమూలల నుండి సంగీత నాటక అకాడమీ, పద్మశ్రీ అవార్డు గ్రహీతలైన ప్రముఖ గురువులతోపాటు అమెరికా, కెనడా, లండన్‌ల నుండి పలువురు ప్రముఖ నృత్యకళాకారులు ఈ ఉత్సవంలో పాల్గొననున్నారని ఆయన వివరించారు. జనవరి 3న ఉత్సవ ప్రారంభోత్సవానికి తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, జనవరి 4న జరిగే ముగింపు కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా విచ్చేయనున్నట్లు, కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ అధికారులతోపాటు తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచా లకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, ఆంధ్ర అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి మాచిరాజు లహరి తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొంటారని విశదీకరించారు. ఈ నృత్యోత్సవంలో అనేక అంశాలతో ప్రత్యేక నృత్య ప్రదర్శనలతో పాటు గురుసత్కార కార్యక్రమం నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు వెల్లడించారు. భారతీయ శాస్త్రీయ నృత్యవారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే ఈ ఉత్సవ ప్రధాన లక్ష్యమని, కళాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరై ఈ రెండురోజుల రసఝురి నృత్యోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ కోఆర్డినేటర్ డా. వనజ ఉదయ్ కోరారు.

# నేటి నుంచి టెట్-2026 పరీక్షలు

### 15 నిమిషాల ముందుగానే గేట్లు మూసివేత

### 9 రోజులపాటు 15 సెషన్స్‌లో పరీక్షల నిర్వహణ

### 18 జిల్లాల్లో 97 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో జరగనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) పరీక్షలు నేటి(శనివారం) నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలను రెండు సెషన్‌లలో నిర్వహించనున్నారు. 15 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేయనున్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు 15 నిమిషాల ముందుగానే చేరుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. నేటి నుంచి ఈ నెల 20 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాల్లో 97 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాలను ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్ నగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఏర్పాటు చేశారు. డిసెంబర్ 27 నుంచి హాల్ టికెట్లను విడుదల చేసిన నేపథ్యంలో పరీక్షలకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో 90 శాతానికిపైగా అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. టెట్-2026 కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు కూడా టెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. టెట్ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2,37,754 దరఖాస్తులు వచ్చాయి. టెట్ దరఖాస్తుల్లో ఇప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారి నుంచి 71,670 దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వ స్కూల్స్‌లో పనిచేస్తున్న వారు 49,236 మంది టెట్-2026 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్నారు. పేపర్-1కి 85,538 దరఖాస్తులు రాగా, పేపర్-2కి 1,52,216 దరఖాస్తులు వచ్చాయి. టెట్ పరీక్షల్లో భాగంగా జనవరి 3, 4, 5, 6, 8, 9, 11 తేదీల్లో మేజర్ పరీక్షలు జరగనుండగా జనవరి 19, 20 తేదిల్లో మైనర్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలను ఉదయం సెషన్ 9 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ పరీక్షలను 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెండు సెషన్‌లలో నిర్వహిస్తారు. ఉదయం పరీక్షలకి 8.45 గంటలకు గేట్లను మూసేయనుండగా.. మధ్యాహ్నం సెషన్‌లో 1.45 గంటలకు క్లోజ్ చేయనున్నారు. పరీక్షల ఫలితాలను ఫిబ్రవరి రెండో వారంలో విడుదల చేయనున్నారు. పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో అత్యధికంగా 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 72,295 మంది పరీక్షలకు హాజరు కానున్నాయి. అయితే ఎక్కువ మంది మాత్రం రంగారెడ్డి జిల్లాలో పరీక్షలకు హాజరు కానున్నట్టు పాఠశాల విద్య డైరక్టర్, టెట్ ఛైర్మన్ నవీన్ నికోలస్ తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 21 పరీక్షా కేంద్రాల్లో అత్యధికంగా 77,790 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 97 పరీక్షా కేంద్రాల్లో 2,37,754 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు.

# ప్రజల నమ్మకం గెలుచుకొన్న కాంగ్రెస్ పాలన

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** ప్రజల నమ్మకం గెలుచుకొన్న కాంగ్రెస్ పాలన వైఖరీతో తెలంగాణలో ఎంతో మంది నాయకులు ప్రజలు పార్టీలో చేరేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శుక్రవారం గాంధీ భవన్‌లో మహబూబాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రముఖ నాయకులను టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. దేశంలో లౌకిక విలువలు సమన్యాయంతో పనిచేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ మాజీ చైర్మన్, రాష్ట్ర ముదిరాజు కార్యదర్శి నీలం సుహాసిని దుర్గేష్, ఎంఇపిఎ రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్, సర్పంచ్ దొంతర బోయిన నరేష్, సారంపల్లి దేవేంద్ర మోహన్ రెడ్డి (సర్పంచ్), సర్పంచ్ దారావత్ కైక, మాజీ ఎంపిటిసి రవి నాయక్, మూడవత్ బుజ్జీ శంకర్, వాళ్ళందాసు రవి, రడం శ్రీను, తుంపిల్ల వెంకన్న, కొలిపాక బాబు, సంకెపల్లి శ్రీనివాస్ రెడ్డి, కాంపటి వీరయ్య, యాకుబ్ రెడ్డి, కొప్పుల వెంకట్ రెడ్డి, పోరెడ్డి రాం రెడ్డి, పాశం రాం రెడ్డి, పుచ్చకాయల వెంకట్ రెడ్డి, కముటం స్వామి, కముటం శ్రీను, కముటం శ్రీధర్, కముటం పెద్ద కుమార్ స్వామి, రడం చిన్న వెంకన్న, కొలిపాక శ్రీను, నీలకుర్తి కళ్యాణ్ రెడ్డి, బొల్లా రాజాలు, శ్రీశైలం, నారాయణ, బొల్లా చిన్న దూడన్న, కీర్తి సంపత్, శీలం సత్యానా రాయణ, పరికిపండ్ల అశోక్ పార్టీలో చేరారు.

# ఆదిలాబాద్‌లో ఈగల్ పోలీసుల దాడులు

### గంజాయి స్మగ్లర్‌ను పట్టించిన జాగిలం

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ పట్టణంలో ఈగల్ పోలీసులు శుక్రవారం ఉదయం పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు చేయగా ఒక యువకుడు గంజాయి ప్యాకెట్లతో దొరికిపోయాడు. పట్టణ పరిధిలోని వినాయక్ చౌక్ వద్ద ఈ ఘటన జరిగింది. పట్టుబడ్డ వ్యక్తిని సాహిల్ అహ్మద్ (38)గా గుర్తించారు. నిందితుడు స్థానిక ధన్‌గర్ మొహల్లాకు చెందిన వాడుగా తేలింది. నిందితుడిని వెంటనే గంజాయితో పాటు ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. కాగా ఈ కేసులో ఈగల్ పోలీసు విభాగానికి చెందిన జాగిలం కీలకంగా వ్యవహరించింది. సాహిల్ అహ్మద్ వద్ద గంజాయి ప్యాకెట్లు వున్న విషయాన్ని ముందుగా ఈగల్ జాగిలం గుర్తించింది. అనంతరం అతను పారిపోతుండగా జాగిలం వెంటాడి పట్టుకుంది.

**మాదకద్రవ్యాలను గుర్తించేందుకు 38 జాగిలాలను వాడుతున్న ఈగల్**

ఇదిలా ఉండగా మాదకద్రవ్యాలను గుర్తించేందుకు ఈగల్ పోలీసులు జాగిలాల సేవలను వాడుతున్నారు. మొత్తం మీద 38 శిక్షణ పొందిన జాగి లాలను ఈగల్ బృందం వాడుతోంది. దేశంలో డ్రగ్స్‌ను పట్టుకునేందుకు ఇన్ని జాగిలాలను వాడుతున్న రాష్ట్రం తెలంగాణ కావడం గమనార్హం. కా గా ఇందులో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో అత్యధికంగా ఐదు, రామగుండం, వరంగల్, సైబరాబాద్ కమిషనరేట్లతో పాటు కొత్తగూడెం జిల్లా లలో రెండేసి జాగిలాలు, మిగతా అన్ని కమిషనరేట్లు, జిల్లా పోలీసు విభాగాల వద్ద ఒక్కో జాగిలం వుంది. ఈ జాగిలాలకు మాదకద్రవ్యాలను పసిగట్టడంలో మొయినాబాద్‌లోని పోలీసు జాగిలాల శిక్షణ కేంద్రంలో శిక్షణనిస్తారు. అనంతరం వీటిని ఆయా జిల్లాల పోలీసు విభాగాలకు పంపుతారు. గత ఏడాది వరంగల్‌లో ఓ ఇంటి టెర్రస్ పైన ఓ వ్యక్తి పూల కుండీలో గంజాయి మొక్క సాగు చేస్తున్న విషయాన్ని ఈగల్ జాగిలం గుర్తించింది. మరో ఘటనలో కాజీపేట్ రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణికుడు తన సంచీలో నాలుగు కిలోల గంజాయిని తరలిస్తుండగా జాగిలం గుర్తించి నిందితుడిని పట్టించింది.

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి

### పార్లమెంట్‌లో విబిఎస్ఎ బిల్లు సిగ్గుచేటు

### ఎఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ఎ స్టాలిన్

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తుందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ఏ స్టాలిన్ విమర్శించారు. అందులో భాగంగానే నూతన జాతీయ విద్యావిధానంను తీసుకువచ్చి పార్లమెంట్‌లో వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్(విబిఎస్ఏ) బిల్లు 2025ని ప్రవేశపెట్టిందని మండిపడ్డారు. వెంటనే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్(విబిఎస్ఏ) బిల్లు 2025ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో సంఘం జిల్లాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్ హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలను సృష్టిస్తూ భ్రష్టు పట్టుస్తున్నారని విమర్శించారు. విద్యారంగం సమస్యలను పరిష్కరించడంలో పాలక వర్గాలకు ఎలాంటి చిత్తశుద్ధి లేదనే విషయం వారి పాలనలోనే అర్థం అవుతుందన్నారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను పూర్తిగా దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని.. అందులో భాగంగా కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం-2020 పేరుతో విద్య కార్పొరేటికరణ, విద్య కేంద్రీకరణ, కాషాయికరణ చేయాలని చూస్తుందని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన విబిఎస్ఏ బిల్లు ..సమాఖ్య నిర్మాణం, ప్రజాస్వామ్య, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి, భారతదేశ ఉన్నత విద్యా వ్యవస్థ లౌకిక, శాస్త్రీయ స్వభావాలను దెబ్బ తీసే విధంగా ఈ బిల్లు ఉందన్నారు. యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ (యూజిసి) ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసిటిఇ)తో సహా ప్రస్తుతం ఉన్న రెగ్యులేటరీ ఆర్కిటెక్చర్‌ను రద్దు చేయాలని విబిఎస్ఏ బిల్లు ప్రతిపాదిస్తుందని, దాని స్థానంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వంచే నియంత్రించబడే ఏకైక, అత్యంత కేంద్రీకృత ఒకే కమీషన్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు.

# మావోయిస్టు అగ్రనేత బర్సెదేవా లొంగుబాటు

### ఎన్‌కౌంటర్‌లో మరణించిన మరో అగ్రనేత హిడ్మాకు అత్యంత సన్నిహితుడు

### 15 మంది సహచరులతో కలిసి లొంగిపోయిన దేవా

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. ఆ పార్టీ అగ్రనేత పిఎల్‌జిఏ (పీపుల్స్ లెబరేషన్ గెరిల్లా ఆర్మీ)



బర్సెదేవా (ఫైల్)

బెటాలియన్ కమాండెంట్‌గా వున్న బర్సెదేవా తన సహచరులు 15 మందితో ఆయుధాలతో సహా తెలంగాణ పోలీసులకు లొంగిపోయారు. ఏపిలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మా వోయిస్టు అగ్రనేత, పిఎల్‌జిఏ కీలకనేత హిడ్మాకు దేవా అత్యంత సన్నిహితుడు. వీరిద్దరిది ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పూవర్తి గ్రామం సొంతవూరు. మావోయిస్టు పార్టీలో హిడ్మా తరువాత దేవా ఆ స్థాయికి ఎదిగిన నేత. రెండేళ్ల క్రితం హిడ్మా, దేవాల కలిసి పనిచేశారు. ఇద్దరు కలిసి అనేక ఆపరేషన్లను నిర్వహించారు. పోలీసులపై జరిగిన అనేక దాడుల్లో వీరిద్దరు ముఖ్య పాత్ర వహించారు. దేవాపై 50 లక్షల రూపాయల రివార్డు వుంది. 2013లో ఝీరాం ఘాటి దాడి సహా భద్రతా బల గాలపై జరిగిన పలు దాడుల్లో దేవా నేరుగా పాల్గొన్నాడని పోలీసులు చెబుతున్నారు. నక్సలైట్లకు ఆయుధాలను సరఫరా చేయడంలో దేవాది ప్రధాన పాత్ర. గత నెల 19న 41 మంది మావోయిస్టులు భారీగా ఆయుధాలతో డిజిపి ఎదుట లొంగిపోవడం తెలి సిందే. దీని తరువాత మరోసారి పెద్దఎత్తున నక్సల్స్ లొంగిపోవడం గమనార్హం. దీనిపై శనివారం పోలీసు శాఖ అధికారికంగా ప్రకటన చేయనుంది.

# ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు

**హైదరాబాద్ (మాదాపూర్), జనవరి 2, ప్రభాతవార్త :** దుర్గం చెరువు ఆక్రమణల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. దుర్గం చెరువు ప్రాంతాన్ని మట్టి, రాళ్ళతో నింపినట్టు తెలుపుతూ మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై, వెంకట్‌రెడ్డి అనే వ్యక్తిపై హైడ్రా అధికారులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మాదాపూర్ పోలీసులు మాట్లాడుతూ దుర్గం చెరువు పరిధిలో దాదాపు 5ఎకరాల స్థలాన్ని కబ్జా చేసినట్టు హైడ్రా అదికారులు గుర్తించారని తెలిపారు. ఆక్రమించిన భూమిని ఎస్‌టిఎస్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వారికి పార్కింగ్ కోసం అద్దెకు వినియోగించినట్టు తెలిపారు. బిఎన్ఎస్ 329(3), 3(5), పిడిపిపి యాక్ట్ 3 సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసినట్టు మాదాపూర్ పోలీసులు తెలిపారు. స్థానికుల పిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించి 5ఎకరాల మేర అక్రమించినట్టు గుర్తించారు. ఆక్రమించిన స్థలాన్ని పార్కింగ్‌కి ఇచ్చి సంవత్సరానికి రూ. 50 లక్షల అక్రమంగా సంపాదిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఇంటర్ విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు హాల్‌టికెట్ ప్రివ్యూ

### తప్పలను సరిచేసుకోవడానికి అవకాశం

### ఆ వివరాలను ప్రిన్సిపాల్స్ దగ్గర సవరించుకోవచ్చు

### నేటి నుంచి పంపనున్న ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** ఫిబ్రవరి 25 నుంచి జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలతోపాటు, ఫిబ్రవరి 2 నుంచి జరగనున్న ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్ల ప్రివ్యూను ఇంటర్ బోర్డు విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు పంపించనుంది. విద్యార్థుల తల్లిదండ్రుల రిజిస్టర్ మొబైల్ నంబర్లలో వాట్సాప్ ఉన్న నంబర్లకు వారి పిల్లలకు సంబంధించిన హాల్ టికెట్ల ప్రివ్యూను పంపించనున్నారు. ఈ ప్రివ్యూను నేటి(శనివారం) నుంచే పంపించనున్నట్టు ఇంటర్ బోర్డు పరీక్షల నియంత్రణాధికారి(సీవోఈ) జయప్రదబాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పంపిన హాల్ టికెట్స్ ప్రివ్యూలో విద్యార్థికి సంబంధించిన వివరాలను చెక్‌చేసకోవాలని సూచించారు. వివరాల్లో ఏమైనా తప్పులుంటే వెంటనే సంబంధిత ప్రిన్సిపాల్‌ను సంప్రదించి సరిచేసుకోవాలని సూచించారు.

మొదటి సంవత్సరం విద్యార్థుల హాల్ టికెట్స్ ప్రివ్యూ రావాలంటే ఆ విద్యార్థి ఎస్ఎస్‌సి రోల్ నంబర్, పుట్టిన తేదిని ఎంటర్‌చేయడం ద్వారా హాల్‌టికెట్ ప్రివ్యూను చూసుకోవచ్చని తెలిపారు. అలాగే సెకండియర్ విద్యార్థులకు సంబంధించి .. ఆ విద్యార్థి మొదటి సంవత్సరం హాల్ టికెట్, పుట్టిన తేది ఎంటర్ చేస్తే సెకండియర్ హాల్ టికెట్ ప్రివ్యూ చూసుకోవచ్చని తెలిపారు. సెకండియర్ విద్యార్థులకు సంబంధించి ఆ విద్యార్థి మొదటి సంవత్సరంలో పాసైన సబ్జెక్టులు, ఫెయిలైన సబ్జెక్టులతోపాటు ఆయా పరీక్షల టైం టేబుల్ వివరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నెల 21న ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, 22న సెకండియర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ఉండనుంది. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష(బాక్‌లాగ్ విద్యార్థులకు) ఈ నెల 23, 24 తేదిల్లో నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 2 నుంచి 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. చాలా మంది తల్లిదండ్రుల వద్ద స్మార్ట్‌ఫోన్‌లు ఉండటంతో, హాల్ టికెట్లను సకాలంలో పొందడం, లోపాలను ముందుగానే గుర్తించడం, విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాలలు, జిల్లా అధికారుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడం కోసం ఈ వాట్సాప్ ఆధారిత కమ్యూనికేషన్ వ్యవస్థను ఇంటర్ బోర్డు ప్రవేశపెట్టింది.

# జైళ్ల శాఖ డైరీని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్ర జైళ్ల శాఖకు సంబంధించిన 2026 డైరీని సిఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సచివాలయంలో జరి గిన ఒక కార్యక్రమంలో సిఎం జైళ్ల శాఖ డైరీని ఆవిష్కరించారు. ఇదే సమయంలో సిఎం రేవంత్ రెడ్డికి జైళ్ల శాఖ డిజి డాక్టర్ సౌమ్యా మిశ్రా పుష్ప గుచ్ఛం ఇచ్చి నూతర సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజి మురళీబాబు, డిఐజి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు-రంగారెడ్డిపై విచారణ చేపట్టాలి

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై విచారణ చేపట్టాలని ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఇష్టాగోష్టిలో ఆయన మాట్లాడుతూ తుమ్మిడి హెట్టి నుంచి మేడిగడ్డ కు కేవలం కమీషన్ ల కోసమే మార్చారని ఆరోపించారు. పాలమూరు రంగా రెడ్డి ని కూడా జూరాల నుంచి మార్చారని అన్నారు. డ్రింకింగ్ వాటర్ పేరుతో ప్రాజెక్టు స్టార్ట్ చేశారు. సుప్రీం కోర్టు లో కూడా 7 టిఎంసి లకు తాగు నీటి అవసరాలకు అంటూ చెప్పారని అన్నారు.ప్రాజెక్టులను కేవలం కాంట్రాక్టు ల కోసమే చేపట్టారనిఆరోపించారు.పైసలన్నీ నచ్చిన వ్యక్తులకు దోచి పెట్టారని విమర్శించారు,.కాళేశ్వరం మాదిరిగా పాలమూరు పై విచారణ కమీషన్ వేసి,ప్రజలకు వాస్తవలను తెలపాలనీ కోరారు.

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివి తేటలు ఉండి అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

-సి.డబ్ల్యు. వెండైట్

# 'సజీవహత్యలు' భావ్యమేనా?


ఇక ముందు రాబోయే రోజుల్లో మానవ సంబంధాలు ఎలా ఉంటాయో చెప్పలేని పరిస్థితుల్లో కన్నవారి, ప్రేమాభిమానాల నేపథ్యంలో కలిగిన ఆందోళనలు ఎంతటి కాఠిన్యానికి దారి తీస్తాయో తాజా సంఘటనలు గుర్తుచేస్తున్నాయి. కడుపు తీపి చంపుకొని కన్న బిడ్డలను కాటికెలా పంపిస్తాయో జరిగిన, జరుగుతున్న సంఘటనలు వింటేనే, తెలుసుకుంటేనే మనసును కలచివేస్తాయి. తన పిల్లల ఆలనా పాలనా చూసేవారు లేక ఎవరి సాయం అందక ఒక తండ్రి తన ముగ్గురు బిడ్డలనూ పాలల్లో విషమిచ్చి చంపేశాడు. తనూ ఆత్మహత్య చేసుకున్నాడు. మరో తల్లి తన భర్త లేని జీవితాన్ని ఊహించుకోలేక తన ఇద్దరుపిల్లలనూ చంపి ఆత్మహత్య చేసుకొంది. ఈ రెండు సంఘటనలు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది హృదయాలను కదిలిస్తున్నాయి. ఇక్కడా అక్కడా అనికాదు. తాము చనిపోయాక తమ పిల్లల భవిష్యత్ ఏమిటి? వారినెవరు సాకుతారు?వారి భవిష్యత్‌ను తానుతీర్చిదిద్దగలనా అనే సందేహాలతో ఒక చీటిరాసో, రాయకో తాము ఆత్మహత్యలు చేసుకోవడం గతంలో చూశాము. ఏమీ ఆలోచించకుండానే ఆవేశంతో ఇలాంటి అకృత్య దుష్కృత్యాలకు పాల్పడిన సంఘటనలు లెక్కకు మించి లెక్కల్లోకెక్కాయి. తదుపరి కాలంలో ఆర్థిక సమస్యలతో పరువు మర్యాదలు మంట కలసిపోతాయనే భయంతో తను తనతోపాటు తన బిడ్డలు, జీవిత భాగస్వామితో కలిసి విషాహారంతో చనిపోయిన సందర్భాలూ విన్నాం. తాజాగా మన తర్వాత మన బిడ్డల బతుకేమిటని ఆలోచించే పరిస్థితిలో వారిని కూడా 'హత్య' చేస్తున్నారు. 'ప్రేమతో చంపేస్తున్నారు' అనే మాట చిన్న మాట. మానవ సంబంధాల్లో ఇదొక కొత్త పరిణామంలా భావించాలి. భర్త మృతితో తీవ్ర ఆవేదనలో ఉన్న మహిళ ఇద్దరు పిల్లలనూ చంపి తాను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించింది. పురుగులమందు కలిపిన అన్నాని పిల్లలకు తినిపించి తానూ తింది. నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తిలో నూతన సంవత్సరం రోజున ఆ ఇల్లాలికిలాంటి దుర్బుద్ధి పుట్టింది. తానూ చనిపోవాలన్నదే నిర్ణయం కనుక ఆమె మనసు లోతుల్లోకి తొంగి చూడాలి. సాధారణంగా భర్త చనిపోయినా భార్య ఆ బాధను భరిస్తూనే భర్త జ్ఞాపకాలతో ఆలోచనలతో పిల్లల భవిష్యత్తే బంగారం కావాలని ఎలాగోలా బతికేస్తుంది. అదే భార్య చనిపోయిన ఏ మగాడైనా ఆమెతో గడిపిన మధుర క్షణాలను తలపుకొస్తే గుండెనిబ్బరాన్ని కోల్పోతాడు. మానసికంగా తోడు పోయిందని బలహీనుడౌతాడు. చెప్పాలంటే పిల్లల భవిష్యత్ చక్కగా తీర్చిదిద్దలేనేమో అనేటంత బీరువవుతాడు. కానీ మానసిక దుర్బలత్వం ఎవరికైనా ఒకటే అనుకున్నా సృష్టిలో ఇద్దరి మధ్యా ఈ తేడా ఉంది. కానీ ఇక్కడలా కాదు ఆమె తట్టుకోలేకపోయింది. వనపర్తి జిల్లా శ్రీరంగాపురానికి వాసి భీంశెట్టి ప్రకాశ్‌కు ప్రసన్న దంపతులకు కూతురు, కొడుకు. వారి ఆలనాపాలనా చదువులను చక్కగా చూసుకునేవారు. ఆర్థిక స్తోమత అంతమాత్రంగా ఉండే ఇంట్లో ప్రకాశ్ మరణించే సరికి ఇతరుల మీద బతకాల్సి వస్తుందన్న అభిమానంతో తాను ఆత్మహత్య చేసుకుంటే పిల్లలు అనాధలౌతారని బతికినా వారిని సాకగల ఆర్థిక శక్తిలేదని తలచింది. రోజులు మారాయి. కొన్నిసందర్భాల్లో భార్యలు కూడాభర్తలపై విసిగెత్తి, అకృత్యాలకు పాల్పడుతున్నారు. భర్తలని పరిమార్చాలని పన్నాగాలు పన్నుతున్నారు. వెనుకఎవరున్నా ఎవరి ప్రోద్బలమున్నా జరుగరాని ఘోరాలు జరిగిపోతున్నాయి. ఇటువంటి రోజుల్లో కూడా భర్త చనిపోయాడని, ఇక బతుకు బాటలో కష్టాలు భరించలేమని వగచి కుటుంబానికి మరణశాసనం రాసింది. తానూ ఈ భూమ్మీదనుంచి నిష్క్రమించింది. మరో సంఘటనలోనంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం తడుమలదిన్నె గ్రామవాసి వేములపాటి నరేంద్ర ముందు సంఘటనకు భిన్నంగా ప్రవర్తించాడు. భార్య మృతితో ముగ్గురు పిల్లలను పెంచలేక దుర్దశను భవించాడు. బంధువుల ఆదరణ లభించలేదని బెంబేలు పడ్డాడు. తన దారి తాను చూసుకోలేక పిల్లలు ముగ్గురికి పాలల్లో విషమిచ్చి తను ఉరిపోసుకుని తనువు చాలించాడు. ఉదంతాలు ఏవైనా, సంఘటనలెలా ఉన్నా జీవిత భాగస్వామి మాటతో తాము బతుకలేమని భావించడం మానసిక బలహీనత. ఇలాంటి వారి వారి సొంత మానసిక దౌర్బల్యానికి ఎవరూ కారణం కాదు. కానీ బిడ్డల జన్మకు కారకులయ్యే హక్కేకానీ మన ఆలోచనలకు వారిని బలిచేసే హక్కు ఏతండ్రికైనా, ఏ తల్లికైనా లేదు. ఓ శుభముహూర్తాన దంపతులై నూరేళ్ల జీవించాల్సిన జీవితాలు అర్ధ మధ్యంతరంగా అంతమైపోవడం సమాజం క్షమించదు. ఇవన్నీ ఆ తండ్రి తీర్పో, ఆ తల్లి మానసిక ప్రవర్తనలో కలిగినమార్పో అని సరిపెట్టుకోవాలా? వారి అనాలోచిత నిర్ణయాలకు పిల్లలు బలయ్యే పరిస్థితి ఎవరికీ రానీయద్దు. తిన తిండి లేని బిచ్చగాళ్లు కూడా తమ బిడ్డలని భిక్షాటన చేసి మరీ పెంచి సమాజంలో ఉద్దండులుగా తీర్చిదిద్దిన వాళ్ల జీవితాలు ఇలాంటి వారికి ఆదర్శం కాకూడదా? పాచిపనులు చేసి జీవితం వెళ్లబుచ్చుతున్న మహిళల జీవితాలు మరొకరికి మార్గదర్శకాలు కావా! ఇలాంటి వాటిపై సమాజంలో ఉన్న వారందరికీ మార్గదర్శనం కావాలి. ఇతరులు సహకరించడం లేదనో, అసహ్యించు కుంటున్నారనో, లేనిపోని అపోహ లకు పోకమానవత్వంతో ప్రవర్తించే ఆలోచన భరోసా ఈనాటి తల్లిదండ్రులకురావాలి. అందుకోసం ప్రభుత్వానికీ బాధ్యత ఉంది. ప్రజలకు మంచి జీవన విధానం అలవాట్లు నేర్పడమేకాదు. వారిలో మనో వైకల్యాన్ని పోగొట్టి దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే పాఠాలు చెప్పించడమూ చేయాలి. అప్పుడో మానసిక దౌర్భల్యపు కాఠిన్యాలు దరిచేరవు.

నిముషాన్ని సంపూర్ణత్వంతో నింపడమే సంతోషం. పశ్చాత్తాపానికి, ఆజ్ఞలకూ అతీతమైనదే అసలైన సంతోషం.



ఎమర్సన్

కొంత మంది గొప్పవారుగా పుడతారు. కొంతమంది గొప్పతనాన్ని సాధిస్తారు.



షేక్‌స్పియర్

# ప్రజావాక్కు



## నైతిక బాధ్యత

ప్రజాస్వామ్య సమాజంలోప్రజాదరణ ఒకవరమే కాకుండా గొప్ప సామాజిక బాధ్యత కూడా. ముఖ్యంగా సినిమా రంగంలోని అగ్రనటులకు ప్రజలను ప్రభావితం చేసే అపార శక్తి ఉంటుంది. వారి ఒక హాజరు కోసం వేలాది మంది ప్రాణాలకుతెగించి తరలివస్తారు. అయితే సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, నియంత్రణ లేకపోతే ఈప్రజాదరణ వినోదాన్ని విషాదంగా మారుస్తుంది. హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్‌వద్ద పుష్ప-2ప్రీమియర్ సందర్భంగా జరిగిన తొక్కిసలాటదీనికి తాజానిదర్శనం. థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం, నిర్వాహకుల అంచనాల లోపం, భద్రతా సిబ్బంది అప్రమత్తతం, పోలీసు సమన్వయం లేకపోవడం కలిసి ప్రాణనష్టానికి కారణమయ్యాయి. భారీ సినిమా విడుదల సమయంలోజనసందోహాన్నినియంత్రించేభద్రతా ఏర్పాట్లు తప్పనిసరి అయినప్పటికీ అవి పాటించబడలేదు. వేలాది మందిని ఆకర్షించే వ్యక్తిగా, జనసందోహం అదుపు తప్పే పరిస్థితుల్లో అప్రమత్తం చేయడం ఒక నైతిక బాధ్యత.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## మనిషిలో మార్పు రావాలి

జనవరి1వ తేదీ అనేది కేవలం క్యాలెండర్‌లోని తేదీ మార్పు మాత్రమేకాదు. అదికాలానికి మనిషి ఇచ్చేఒక శుభావందనం. ఆధునిక సమాజంలో ఈ తాత్వికత వక్రీకృతమైపోతోంది. ప్రతి మతంలోనూ దేవుడు, మనిషి మధ్య ఒక మధ్యవర్తి పూజారి, పాస్టర్ లేదా పండితుడు నిలబడి మతాన్ని వ్యాపారంగా మార్చేశాడు. భక్తిని లావాదేవీగా, ఆధ్యాత్మికతను ప్రదర్శనగా మార్చేశాడు. ఫలితంగా మనిషి తనలోని దైవత్వాన్ని మరచిపోయాడు. నిజమైన నూతన సంవత్సరం అంటే పటాకులులేదా ఉత్సవాలుకాదు మెలుకువ. మనిషి అర్థం చేసుకుంటూ, పంచుకుంటూ, ఎదుగుతూ ఉంటే అదే కాలానికి నిజమైన వేడుక.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## చర్యలు తీసుకోవాలి

చాలాస్కూళ్లలో విద్యార్థులు లేకపోయినా, తక్కువ సంఖ్యలో ఉన్నా , ఉపాధ్యాయులు మాత్రం అధిక సంఖ్యలో పనిచేస్తున్నారని, కేంద్రవిద్యాశాఖ ఇటీవల పార్లమెంటుకు సమర్పించిన ఓ నివేదికలో పేర్కొంది. వెంటనే ప్రభుత్వం సరిగ్గా సర్దుబాటు చేయాలి. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలి .

-మా. శ్రీ. రాజు, పాల్వంచ

## వృద్ధికి రహదారి

దేశఆర్థికాభివృద్ధికి మౌలికసదుపాయాలే మూలస్తంభమని మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోడీ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. వృద్ధికి దోహదపడే తదుపరి తరం మౌలిక సదుపాయాల నిర్మాణం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా అభివృద్ధికి బాటలువేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి ఈ విధానాల ద్వారా కలిగే ప్రయోజనాలను గమనించడం అవసరం. తెలంగాణరాష్ట్రం భౌగోళికంగా దేశమధ్యభాగంలో ఉండటంవల్ల రహదారి, రైల్వే, లాజిస్టిక్స్ రంగాల్లో కీలక స్థానం దక్కించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే హైదరాబాద్ఒక అంతర్జాతీయ ఐటీ, ఫార్మాకేంద్రంగా ఎదిగింది. అయితే ఈ వృద్ధి ఫలాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చేరాలంటే సమర్థవంతమైన రహదారి అనుసంధానం అత్యవసరం. జాతీయ రహదారుల విస్తరణ, కొత్త కారిడార్‌ల నిర్మాణం తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలను ప్రధాన మార్కెట్లతో కలుపుతాయి. ప్రత్యేకించి ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఈ మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంతో దోహదపడుతుంది.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## పాలకుల వైఫల్యం

తెలంగాణ ఉద్యమంలో ఒక ప్రధాన అంశంగా ఉన్న విషయం మనందరికీ తెలుసు. 300 కిలోమీటర్ల మేర కృష్ణానది ఆ జిల్లాలో పారినపాలమూరు కరువు చాలా హృదయ విదారకమైనది. పిల్లలను అమ్ముకునేంత కరవు ఆ జిల్లాలో ఉండేది. అయితే కృష్ణానది మీద వేసిన వివిధ కమిషన్లు అలాగే వాళ్ళు ఇచ్చిన ఆర్డర్లు అమలు చేయడంలో వచ్చిన ఇబ్బందితోనే పాలమూరు వలసల జిల్లాగా మారింది అనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రులు దత్తత తీసుకున్న ఇసుమంత అయిన వారి కరవు పోలేదు సరికదా ఇప్పుడు కృష్ణానది నీళ్ల విషయం ఒక రాజకీయ అస్త్రంగా మారింది.

-భారత అవినాష్, జనగామ

## గురుకులాల్లో ఆర్ట్స్ గ్రూప్స్

రాష్ట్రంలో ఉన్న గురుకులాలలో సైన్సు గ్రూపులతోపాటుగా ఆర్ట్స్ గ్రూపులు కూడా పెట్టాలి. 2026-2027 విద్యా సంవత్సరం నుండి ఆర్ట్స్ గ్రూపులో ప్రవేశపెట్టడానికి గాను గురుకుల ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కార్యదర్శులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఆర్ట్స్ గ్రూపులో అయినా సామాజిక శాస్త్రాలను ప్రవేశపెట్టాలి..

-రాపాక రవీందర్, జనగాం

**మనవి** ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# శుభాకాంక్షలన్నీ శుభప్రదంగా ఉండాలి

**మమ్మీ, డాడీ చదువులు ఉంటే ఉండనివ్వండి కానీ వాటితోపాటు మన సంస్కృతి సంప్రదాయాలు తెలిపే పాఠ్యాంశాలను కూడా ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలు తెలుసుకునే విధంగా విద్యావిధానం రూపొందించాలి. అలాగే ఈ క్లబ్‌లు, పబ్‌లు, సైబర్ కేఫ్‌లలో నీలిచిత్రాలు, అంగాంగ ప్రదర్శనలపై ఉక్కుపాదం మోపాలి. శుభాకాంక్షలన్నీ శుభప్రదంగా ఉండాలి. ఈ విషయంలో ప్రభుత్వంతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు కల్పించుకోవాలి. మన సంస్కృతి సంప్రదాయాలను రక్షించేందుకు సంసిద్ధులు కావాలి. ప్రజల భాగస్వామ్యమే మన సంస్కృతి పరిరక్షణకు ఏకైక మార్గం.**

దామెర్ల సాయిబాబ

చదువు సంధ్యలు పెరిగే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పులు రావాలి. ఏది మంచో, ఏది చెడో గ్రహించాలి. విచక్షణ పెంపొందాలి. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందాం. అత్యంత ప్రతిభావంతులైన యువతీ యువకులు అహర్నిశలు కష్టపడి దేశ విదేశాల్లో గుర్తింపు తెస్తున్నారు. మరోవైపు దైవం పట్ల భక్తి శ్రద్ధలు పెరుగుతున్నాయి. దేవాలయాలు కిటకిట లాడి పోతున్నాయి. ఇంకో వైపు కొందరు పాశ్చాత్య మోజులో పడి మన సంస్కృతి, సంప్రదాయాలకు మంగళం పాడుతున్నారేమో ననిపిస్తున్నది. రానురాను భారతీయ సంస్కృతి అదృశ్యమైపోతుందేమోననే కలవరం కలుగకతప్పదు. మొన్న బుధవారం రాత్రి నూతన సంవత్సర ఆరంభం పేరుతో దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో వెర్రిగంతులు వేయడం, కొన్ని పబ్బుల్లో, క్లబ్బుల్లో నృత్యాల పేరుతో చేసే వెకిలి చేష్టలు వెర్రితలలు వేస్తున్న విష సంస్కృతికి పరాకాష్ఠగా చెప్పొచ్చు. కొందరు యువతీ యువకులు కేరింతలు కొడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పేరుతో నానా హంగామా చేశారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ అర్ధరాత్రి పన్నెండు గంటల తర్వాత నినాదాలు చేస్తూ రోడ్లపై వీరంగం సృష్టించారు. అసలు వారు ఎవరికి స్వాగతం చెప్తున్నారో వారికే తెలియకుండాపోయింది. అయితే ఈసారి హైదరాబాద్‌లో మాత్రం పోలీసులు తీసుకున్న జాగ్రత్తలు, హెచ్చరికలు, అన్నింటికంటే మించి పటిష్టమైన తనిఖీల కారణంగా చాలా వరకు ప్రమాదాలు, ఘర్షణలు తగ్గాయి. కానీ పొరుగునున్న కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ వికృత చేష్టలు పరాకాష్ఠకు చేరాయనే చెప్పొచ్చు. రోడ్లపైనే మద్యంసేవిస్తూ, వారు వేస్తున్న చిందులు, వెర్రికేకలు, అరుపులను అడ్డుకోవడం పోలీసులకు తలకుమించిన భారంగా మారింది. ఎంతో మంది గాయపడ్డారు. ఒకదశలో బెంగళూరు పోలీసులు లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఇక పబ్‌లు, క్లబ్బుల్లో ఈఆనంద కేళిలో అదుపు తప్పి ఎంతమంది గాయపడ్డారో తెలియదు. అర్ధరాత్రితో ముగించాలని పోలీసులు ఆరాటపడినా, ఆదేశాలు ఇచ్చినా, కొన్ని పబ్‌లు, హోటళ్లు, తెలవార్లూ పాశ్చాత్య సంగీతహోరు, అశ్లీల నృత్యాల పేరుతో మునిగిపోయాయి. ఇది హైదరాబాద్, బెంగళూరు, ముంబాయి లాంటి నగరాలకే పరిమితం కాలేదు. గ్రామాలకు కూడా విస్తరించింది. తెలుగు రాష్ట్రాల్లో అనేక పట్టణాల్లో, నగరాల్లో చివరకు కొన్నిగ్రామాల్లో కూడా విషసంస్కృతి వికృతరూపందాల్చింది. కొన్ని యూట్యూబ్‌లు, టీవీల్లో జుగుప్సాకరమైన నృత్యాల ప్రచారం జరిగింది. తండ్రి ముందు కొడుకు, తల్లి ముందు కూతురు ఇలా కుటుంబం అంతా కలిసి కూర్చొని టీవీ చూడలేని విధంగా కొన్ని కార్యక్రమాలు సాగాయి. ఇటువంటి కార్యక్రమాలు యువతీయువకులకు ఒకింత ఆనందం కలిగించినప్పటికీ ఆ క్షణానికే పరిమితం అవుతాయి. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం క్రమేణా నగరాలు దాటి కుగ్రామాలకు సైతం పాకిపోతున్నది. గ్రామీణ జనజీవన స్రవంతిలో లీనమై భాసిల్లుతున్నది. మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే కూచిపూడి, భరతనాట్యం, జానపద కళలు, పాశ్చాత్య నాగరికత వెల్లువ ఆధునిక ముసుగులో కనుమరుగైపోతున్నాయి. అనేక మతాలు, కులాల, అంతరాల దొంతర్లపై నిర్మితమైన మన కళాసంస్కృతిని భవిష్యత్‌లో కాపాడుకోలేమేమోననిపిస్తున్నది. గతంలో జాతరులు, తిరునాళ్లలో జరిగినా ఆయా ప్రాంతాలకు, ఆచారవ్యవహారాలకు అద్దం పట్టే జానపదకళలు, పురాణాలకు చెందిన హరికథలు, బుర్ర కథలు, ఒగ్గుకథలు, నాటకాలు, పగటివేషాలతో ఎంతో ఆహ్లాదకరంగా ప్రదర్శించేవారు. పండుగ దినాల్లో ఇలాంటి కళలతో

## ఒక్క మాట

పాటు కోలాటాలు, భజనలు చేస్తుండేవారు. ప్రతికళారూపం మన సంస్కృతికి అద్దంపట్టడమే కాక, ధర్మాధర్మ వివేచన ఆలోచనల్లో ఉజ్జీవనం పెంపొందించేందుకు ఉపయుక్తంగా ఉండేవి. మనం వేసే ప్రతి అడుగులోనూ మన సంస్కృతి, నాగరికతల విశిష్టత పరిమళాలు, గుబాళిస్తుండేవి. వేషభాషల్లోనూ సభ్యతాసంస్కారం తొణికిసలాడుతుండేవి. దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి లాంటి ఏపండుగలు తీసుకున్నా వాటికి ఒక విశిష్టత ఉండేది. ఇప్పుడు ఆ పండుగల జాబితాలో 'జనవరి ఫస్ట్' కూడా చేరిపోయింది. దాంతోపాటు కళారూపాల స్థానంలో డిస్కో, రికార్డుడాన్సులు ప్రత్యక్షమయ్యాయి. డిజేలు గ్రామగ్రామానికి చేరుకున్నాయి. వేలాది మంది ప్రజల ముందు అంగాంగ ప్రదర్శనలు చేస్తున్నారు. మద్యం మత్తు, సెక్స్ కేంద్రాలుగా గ్రామసీమలు మారిపోతున్నాయి. కొందరు బాధ్యత కల్గిన ప్రజాప్రతినిధులు ఈ రికార్డు డాన్సుల్లో పాల్గొంటున్నారు. అదే మన సంస్కృతి అన్నట్టుగా వ్యవరిస్తున్నారు. ఇక మద్యం గూర్చి ఎంత తక్కువ చర్చిస్తే అంతమంచిదేమో. మద్యం సేవించండి ప్రభుత్వానికి ఆదాయం పెంచండి అంటూ పాలకులే మద్యపానాన్ని ప్రోత్సహించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఏ సందర్భంలోనైనా పండుగ, పబ్బాలకే కాదు చావులాంటి విషాద సందర్భాల్లో కూడా మద్యం వాడకం విపరీతంగా పెరిగిపోతున్నది. ఒక్క తెలంగాణలోనే మొన్న డిసెంబరు నెలలో రికార్డుస్థాయిలో ఐదువేల కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. జనవరి ఫస్ట్‌న హైద రాబాద్ నగరంలో మూడువందల పద్నాలుగు కోట్లకు పైగా మద్యం అమ్ముడుపోయింది. దీనికితోడు డ్రగ్స్ కూడా పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా వినియోగం అవుతున్నది. దేశవ్యాప్తంగా జనవరి ఫస్ట్‌న కనీసం ఏడెనిమిది వేలకోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలు అమ్మకాలు జరిగి ఉండవచ్చు నని అనధికార అంచనా. అయితే ఈ మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ గతంలో ప్రమాదాలు జరిగి ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారు. కానీ ఈసారి అలాంటి వాటికి అవకాశాలు లేకుండా తెలంగాణ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకున్నారని చెప్పొచ్చు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో భారీఎత్తునే పట్టుబడారు. మూడు కమిషనరేట్ పరిధి. లో రెండువేల ఏడువందల ముప్పైఒక కేసులు నమోదు అయ్యాయి. మరొకచోట జనవరి ఫస్ట్ పండుగ చేసుకొంటూ మద్యం సేవించి, బిర్యాని తిన్న వారిలో పదమూడు మంది అస్వస్థతకు గురికాగా, ఒకరు మరణించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా అంతర్వేది వద్ద అర్ధరాత్రి నేరుగా జీపునే సముద్రంలోకి నడిపి ఒక యువకుడు ప్రాణాలు పోగొట్టుకొన్నాడు. మన సంస్కృతిని కాపాడేందుకు ప్రభుత్వపరంగా కూడా పెద్దఎత్తున చర్యలు తీసుకున్నట్లు కనపడడం లేదు. ఈ విషసంస్కృతి గతంలో మగవారికే పరిమితమై ఉండేది. కానీ అది క్రమేణా యువ తులు కూడా అందులో భాగస్వామ్యం కావడం ఆందోళన కలిగించే అంశం. మధ్యతరగతికి చెందిన యువతీ యువ కులు ఏదో విధంగా ఈ క్లబ్బులో ప్రవేశానికి ఆరాటపడుతున్నారు. ఇది ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. కొందరు యువతీయువకులు కేవలం తమ విలాస జీవితాల కోసం డ్రగ్స్ సరఫరాతోపాటు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తాను చేసిన అప్పులు తీర్చేందుకు ఈ డ్రగ్స్ రవాణా చేస్తున్నట్లు పోలీసుల ముందు అంగీకరించాడు. మరొకపక్క మిగిలిన నేరాలు తగ్గుతున్నా ఈ విషసంస్కృతి కారణంగా లైంగిక నేరాలు పెరిగిపోతున్నాయి. మన సంస్కృతీ, సంప్రదాయాలు తెలిపే పురాణ కాలక్షేపాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అతికొద్ది ప్రాంతాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. మఠాధిపతులు చేసే ఆసక్తికరమైన ఆధ్యాత్మిక ప్రసంగాలు, ఇతిహాస పురాణ గాథలు, నిరుపేద, మధ్యతరగతి, గ్రామీణులకు అందాల్సిన అవసరం ఉంది. సమాజంలో విపరీత ధోరణులు చూపుతున్న ఈ విషసంస్కృతిని రూపుమాపేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం నడుం కట్టాలి. మమ్మీ, డాడీ చదువులు ఉంటే ఉండనివ్వండి కానీ వాటితోపాటు మన సంస్కృతీ సంప్రదాయాలు తెలిపే పాఠ్యాంశాలను కూడా ప్రాథమికస్థాయి నుంచి పిల్లలు తెలుసుకునే విధంగా విద్యావిధానం రూపొందించాలి. అలాగే ఈ క్లబ్‌లు, పబ్‌లు, సైబర్ కేఫ్‌లలో నీలిచిత్రాలు, అంగాంగ ప్రదర్శనలపై ఉక్కుపాదం మోపాలి. శుభాకాంక్షలన్నీ శుభప్రదంగా ఉండాలి. ఈ విషయంలో ప్రభుత్వంతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు కల్పించుకోవాలి. మన సంస్కృతి సంప్రదాయాలను రక్షించేందుకు సంసిద్ధులుకావాలి. ప్రజల భాగస్వామ్యమే మన సంస్కృతి పరిరక్షణకు ఏకైక మార్గం. ●

# భారత్ స్నేహాన్ని వదులుకోలేని బంగ్లాదేశ్

కనుమ ఎల్లారెడ్డి

బంగ్లాదేశ్ రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా మరణంతో, ఇప్పుడుప్రజలలో ఆమె పార్టీ బంగ్లా నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) వైపు ప్రజలు చూస్తున్నారు. బంగ్లాకు దిక్కు ఆ పార్టీయే కనపడుతోంది. ఖలీదా కుమారుడు పదిహేడేళ్ల ప్రవాసం తరువాత స్వదేశానికి వచ్చారు. దురదృష్టం ఆయన బంగ్లాకు వచ్చిన కొద్ది రోజులలోనే తల్లి మరణించడం తీరనిలోటు. ఆమె మరణం బంగ్లా ప్రజలకు కూడా గట్టి దెబ్బే. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలలో అవామీ లీగ్ అధినేత హాసీనా పార్టీ పోటీ చేయకుండా నిషేదానికి గురి అయింది. ఇప్పుడు ప్రజలలో ఒక బలమైన నాయకుడిగా తారీక్ కనపడుతున్నాడు. ఆయన మాటలలోనే స్పష్టంగా బంగ్లా అందరిది అని, బంగ్లాలో నివసిస్తున్న హిందువులు, ముస్లిమ్స్, క్రిస్టియన్స్, బౌద్ధులు ఒకటే అని తన ప్రసంగంలో చెప్పడం విశ్వంలోని ప్రజల దృష్టిని ఆకర్షించారు. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య కొన్ని పొరపొచ్చాలు ఉన్నా, భారత్ స్నేహాన్ని వదులుకోలేదు. ఒకవేళ తారీక్ ఎన్నికలలో నెగ్గితే ప్రధాని కావడం ఖాయం. ఆయన హయాంలోనైనా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగు అవుతాయని విశ్లేషకుల అభిప్రాయం. భారత్‌నుంచి అత్యధికంగా లాభపడిన బంగ్లాదేశ్ వైఖరిలో మార్పు రావొచ్చు. అయితే అక్కడ హిందువులపై దాడి చేయడం హేయం. ఇటీవల బజేంద్ర బిశ్వన్ హత్యకు గురి కావడం సహించరానిది. ఇది తారీక్‌ను కలచి వేసి ఉండవచ్చు. అందుకే తన ప్రసంగంలో బంగ్లా సమైక్యత కోరుకుంటుంది అని చెప్పడం గమనార్హం. బీ.ఎన్.పి పార్టీ రెండు పర్యా



యాలు మాత్రమే గద్దె నెక్కింది. అప్పుడు ఖలీదా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి భారత్‌తో కొంత ఘర్షణాత్మక వైఖరి అవలంభించారు. హాసీనా కూడా భారత్‌తో సయోధ్య ఉన్న నదీ జలాల వివాదంతో ఇద్దరు చేయి కలిపారు. భారత్ నుంచి ప్రవహిస్తున్న గంగానది అక్కడ పద్మానది అని పిలుస్తారు. నదీ జలాలు వినియోగంలో ఎక్కువ భాగం భారత్ పంచుకుంటుందని బంగ్లా ఆరోపణ. ఈ నదీ జలాల వివాదం బంగ్లాను పాలించిన జియా ఉర్ రెహమాన్ (ఖలీదా భర్త) కలం నుంచి ఉంది. ఆది నుంచి భారత్‌కు వ్యతిరేకంగా జమాతే ఇస్లామి పాక్‌కు అనుకూలంగా వ్యవహరించింది. తన తల్లి, తండ్రి భారత్‌కు వ్యతిరేకం అయినా తారీక్ మాత్రం ఆ బాటలో పయనించడం లేదు. భారత్‌తో ఏ సమస్య అయినా చర్చలద్వారా పరిష్కరించు కుంటామని ఆయన మాటలలో ధ్వనించింది. ఎన్నికలలో ఆయన ప్రత్యర్థులు ఎవరూ బలంగా కనపడటం లేదు. హాసీనా పోటీలో ఉండి ఉంటే ఒకింత పోటీ ఉండేది. కాని హాసీనా పార్టీలో అవినీతి పెరిగిపోవడం, హాసీనా తీసుకున్న నిర్ణయాలు బంగ్లా ప్రజలలో తీవ్ర అసంతృప్తి కలిగించింది. ఫలితంగా ఆమె భారత్‌లో తల దాచుకుని బంగ్లా రాజకీయాలను గమనిస్తోంది. ఏతావాతా ఇప్పుడు బంగ్లా రాజకీయాలలో తారీక్ ఒక ధ్రువతారగా కనపడుతున్నారు. ఏది ఏమైనా నూతన సంవత్సరం బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటులో, భారత్‌తో సంబంధాలు ఏ మేరకు వుంటాయో తేలిపోతుంది. మొత్తానికి తారీక్ అధికారంలోకి వస్తే మాత్రం లౌకికత్వం బలంగా ఉంటుంది. అదే ఆయన పార్టీకి, ఆయనకు శ్రీరామ రక్ష. ●

# గ్రామసభల బాధ్యతలు పెరగాలి

మేకిరి దామోదర్

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలలో గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిసి, నూతన పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించాయి. పల్లె భవిష్యత్తు తమ చేతుల్లో ఉందనే ఆశతో గ్రామవాసులు వీరిని ఆశగా చూస్తున్నారు. గత రెండేళ్లగా పాలకవర్గాలు లేక, ప్రత్యేక పాలనలో అభివృద్ధి కుంటుపడి గ్రామాలు కునారిల్లిన పరిస్థితిఅందరికీ తెలిసిందే. రహదారులు, పారిశుద్ధం, మౌలిక సదుపాయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఇలాంటి నేపథ్యంలో, కొత్తగా ఎన్నికైన సర్పంచులు-పాలకవర్గ సభ్యులు గ్రామాభివృద్ధి బాట పట్టిస్తారనే విశ్వాసం ప్రజల్లో నెలకొంది. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 ఆధారంగా, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన కరదీపిక సర్పంచులు, ఉపసర్పంచులు, పౌరుల విధులు- బాధ్యతలను స్పష్టంగా గుర్తుచేస్తోంది. ఈ కరదీపికను అధికారులు ప్రజాప్రతినిధులకు అందజేసి, చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సర్పంచి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామంలోనే నివసించాలి. అప్పుడే గ్రామపంచాయతీ కార్యకలాపాలు సమర్థంగా పర్యవేక్షించగలుగుతాడు. గ్రామపంచాయతీ తీర్మానాలకు లోబడి విధులు నిర్వహించాలి. గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించి, వాటికి అనుగుణంగా పనులు అమలు చేయాలి. నిర్దేశిత కాలవ్యవధిలో గ్రామసభలు నిర్వహించడం, పారిశుద్ధం సక్రమంగా ఉండేలా చూడటం, పంచాయతీ కార్యదర్శి విధులను పర్యవేక్షించడం సర్పంచి ముఖ్య బాధ్యతలు. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితిలో సంచిత కాంటిజెన్సీ నిధుల నుంచి ఖర్చులకు అనుమతులు ఇవ్వాలి. ప్రతి ఏటా నాటిన మొక్కల్లో కనీసం 85 శాతం జీవించి ఉండేలా చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం, ప్రభుత్వ ఆదేశాల ఉల్లంఘన, గ్రామసభలు నిర్వహించకపోవడం, ఖాతాల ఆడిట్ చేయించడంలోవిఫలం కావడం, అసమర్థతతో గ్రామాభివృద్ధిని అడ్డుకోవడం వంటి సందర్భాల్లో సర్పంచిని తొలగించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుంది. తొలగించే ముందు నోటీసు ఇవ్వబడుతుంది. తొలగింపునకు గురైన సర్పంచి ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడు. నెలరోజుల్లో గ్రామపంచాయతీ ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. గ్రామ పంచాయతీ విధులు సర్పంచి 15 రోజులకుపైగా గ్రామపంచాయతీ పరిధి దాటి వెళ్లినప్పుడు లేదా సస్పెన్షన్‌లో ఉన్నప్పుడు, ఉపసర్పంచ్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. సర్పంచ్‌పదవి ఖాళీ అయినప్పుడు, మళ్లీ ఎన్నికలు జరిగే వరకు తాత్కాలిక సర్పంచిగా వ్యవహరిస్తారు. పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన చెక్కులపై సర్పంచితో కలిసి ఉపసర్పంచ్ ఉమ్మడిగా సంతకం చేస్తారు. వార్డు సభ్యులకు



పంచాయతీ సమావేశాల్లో తీర్మానాలు ప్రవేశపెట్టే అధికారం ఉంది. పంచాయతీ రికార్డులను పరిశీలించే హక్కు వారికి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే లేదా హోదాను దుర్వినియోగం చేస్తే, కలెక్టర్ వార్డు సభ్యులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేయవచ్చు. అవసరమైతే కమిషనర్ మరో ఆరు నెలలు పొడిగించవచ్చు. సర్పంచ్, ఉపసర్పంచ్ఇద్దరూ 15 రోజులకుపైగా అందుబాటులో లేని పరిస్థితుల్లో, ఒక వార్డు సభ్యుడికి సర్పంచి అధికారాలను జిల్లా కలెక్టర్ అప్పగించవచ్చు. పంచాయతీ కార్యదర్శులు గ్రామసభల నిర్వహణ, పారిశుద్ధం, మొక్కల పెంపకం, రికార్డుల నిర్వహణ, ఖాతాల నిర్వహణ, తీర్మానాల అమలు వంటి బాధ్యతలు నిర్వర్తించాలి. చట్టంలోని సెక్షన్ 52(1) ప్రకారం, 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువలు, చెత్త నిర్వహణ, ప్రతి ఇంటి ప్రాంగణంలో కనీసం ఆరు మొక్కల నాటడం, వీధిదీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఆస్తిపన్నుల వసూలు, జనన-మరణ-వివాహాల నమోదు వంటి విధులు పంచాయతీల ప్రధాన బాధ్యతలు. గ్రామ లేఅవుట్లు, నిర్మాణ అనుమతులు, సామూహిక మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, వ్యాధుల నివారణ, బాల్యవివాహాలు, వరకట్నం వంటి సామాజిక దురాచారాల నివారణ, వృద్ధులు, దివ్యాంగులు, అనాధల సంక్షేమం కూడా పంచాయతీల పరిధిలోనే ఉన్నాయి. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వయోవృద్ధులు, దాతలు, గ్రామ సంఘాల అధ్యక్షు లు కోఆప్షన్ సభ్యులుగా ఉండవచ్చు. గ్రామసభలు స్థాయి సంఘాలు గ్రామంలో ఓటుహక్కు గల ప్రతిఒక్కరూ గ్రామ సభ సభ్యులే. రెండు నెలలకు ఒకసారి చొప్పున ఏడాదిలో ఆరుసార్లు గ్రామసభలు నిర్వహించాలి. వార్షిక ఆడిట్ నివేదికలు, గ్రామ నిర్వహణ నివేదికలు గ్రామసభకు సమర్పిం చాలి. గ్రామపంచాయతీలో నాలుగు స్థాయి సంఘాలు (స్టాండింగ్ కమిటీలు) ఉంటాయి. పారిశుద్ధం, వీధిదీపాలు, మొక్కల పెంపకం తదితర అంశాలను ఇవి సమీక్షిస్తాయి. అవసరమైతే ఆయా రంగాల నిపుణులను సభ్యులుగా చేర్చుకోవచ్చు. ఆశల్ని అభివృద్ధిగా మలచే పరీక్ష రెండేళ్లుగా పాలకవర్గాలు లేకపోవడం వల్ల గ్రామపంచాయతీ పాలనలో జవాబుదారీతనం కొరవడింది. అభివృద్ధికుంటుపడి, గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రత్యేక అధికారులు ప్రజాసమ స్యలను పట్టించుకోని పరిస్థితి కూడా ఎదురైంది. ఇలాంటి పరిస్థితుల నుంచి గ్రామాలను బయటకు తీసుకురావడం నూతన సర్పంచు లు-పాలకవర్గ సభ్యుల ముందున్న అసలైన సవాల్. శత కోటి ఆశలతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవ డం వారి ప్రధాన బాధ్యత. పరిపాలనా సామర్థ్యాన్ని, ప్రజాప్రతినిధుల ఐక్యతను చూపుతూ పల్లెల అభివృద్ధిని గాడిలో పెట్టగలిగితేనే సర్పంచి పదవికి అర్థం ఉంటుంది. ప్రతి పల్లె ప్రగతి పథంలో పయనించేలా నిజాయితీతో, పారదర్శకతతో, ప్రజాస్వామ్య విలువలతో పాలన అందించిన ప్పుడే గ్రామపంచాయతీలు ఆదర్శంగా నిలుస్తాయి. అదే నిజమైన ప్రజాసేవ, అదే సర్పంచుల విజయానికి కొలమానం. ●

# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు



అటు చలిగాలులు తీవ్రతరం.. ఇటు ప్రమాదస్థాయిలో వాయు కాలుష్యం

హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ అదే పరిస్థితి

పలు విమానాలు, రైళ్లు రద్దు, రోడ్డు రవాణాకు అంతరాయం

6 వరకు ఇదే పరిస్థితి: ఐఎండి హెచ్చరిక

**న్యూఢిల్లీ, జనవరి 2:** దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. అటు చలిగాలుల తీవ్రత పెరిగింది. దీనికి తోడు ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం. హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) అధికారుల సమాచారం మేరకు రాబోయే రోజుల్లో చలిగాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశముంది. అలాగే దట్టమైన పొంగమంచు ఉంటుందని అంచనా వేసింది. కాలుష్యం కూడా బాగా పెరిగి పోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. హిమాలయ ప్రాంతాలలో హిమపాతం, చల్లని గాలుల తీవ్రత 6వ తేదీ వరకు ఎక్కువగా ఉంటుందని ఐఎండి హెచ్చరిక జారీ చేంది. కాలుష్య నియంత్రణ అధికారుల ప్రకారం, శుక్రవారం ఉదయం నగరంలో ఏక్యూఐ లెవెల్స్ 386గా నమోదైంది. 26 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో గాలి నాణ్యత వెరీ పూర్ కేటగిరీలో నమోదైనట్లు పేర్కొంది. అత్యధికంగా ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 423గా నమోదైంది. అయితే దట్టమైన పొగమంచు రాజధానిలో అనేక ప్రాంతాల్లో దృశ్యమానత గణనీయంగా పడిపోయింది. సఫ్దర్‌జంగ్, పాలం వద్ద దృశ్యమానత 50 మీటర్లకు పడిపోయింది. మధ్యాహ్న సమయానికి 60 మీటర్లకు స్వల్పంగా మెరుగుపడింది. దీనికి తోడు తీవ్రమైన చలిగాలులతో ఢిల్లీ వాసుల సాధారణ జీవనానికి తీవ్ర ఇబ్బందులు కలిగించింది. రైళ్లు, విమానాల రాకపోకలకు అంతరాయం కలిగించింది. డజన్ల కొద్దీ విమానాలు రద్దు కాగా, 80కి పైగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఇంకొన్నింటిని అధికారులు దారి మళ్లించారు. పొగమంచు విపరీతంగా కురుస్తున్నందున విజిబిలిటీ తగ్గిపోవడంతో పలు విమానాలను రద్దు చేస్తున్నట్లు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు ప్రకటించాయి. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రీబుక్ చేసుకోవచ్చని, లేదంటే డబ్బు వాపసు పొందవచ్చని తెలిపాయి.

**హైదరాబాద్‌లోనూ దట్టమైన పొగమంచు.. స్తంభించిన ట్రాఫిక్**

హైదరాబాద్ శివారు ప్రాంతాలను శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోడ్లు, భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, ఆదిబట్ల తదితర ప్రాంతాల్లో జీరో విజిబిలిటీ నమోదైంది. దీంతో ఉదయాన్నే రోడ్లెక్కిన వాహనదారులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొగమంచు కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంతో పాటు బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఫలితంగా శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)పై కూడా మంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై కూడా ఇదే పరిస్థితి. విజిబిలిటీ పూర్తిగా తగ్గిపోవడంతో వాహనదారులు హెడ్ లైట్లు, ఇండికేటర్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉండటంతో వాహనదారులు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు.



## ఇరాన్‌లో ఖమైనీకి వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శనలు,

### ఏడుగురు మృతి, వందలాది మందికి గాయాలు

**టెహ్రాన్, జనవరి 2:** ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీకి వ్యతిరేకంగా సాగుతున్న నిరసనలు 2026 నూతన సంవత్సరం వేళ హింసాత్మకంగా మారాయి. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదలపై సామాన్యులు మొదలుపెట్టిన ఈ పోరాటం ఇప్పుడు ఇరాన్ వ్యాప్తంగా ఉన్న పల్లెలకు కూడా పాకింది. ఒకవిధంగా చెప్పాలంటే ఇరాన్‌లోకూడా జెన్‌జడ్ ఉద్యమం తీవ్రస్థాయికి చేరుతున్నట్లు స్పష్టం అవుతోంది. ఆందోళనల్లో యువత ఎక్కువగా పాల్గొంటుండటమే ఇందుకు నిదర్శనం. వారం రోజులుగా జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకు ఏడుగురు మరణించగా, వందలాది మంది గాయపడినట్లు తేలింది. టెహ్రాన్ యూనివర్సిటీ విద్యార్థులు రోడ్లపైకి వచ్చి సర్వాధికారికి మరణం అంటూ నినాదాలు చేశారు. 1979 ఇస్లామిక్ విప్లవం కంటే ముందు ఇరాన్‌ను పాలించిన షా మహమ్మద్ రెజా పహ్లవీ కుమారుడు రెజా పహ్లవీకి నిరసనకారులు మద్దతు పలకడం విశేషం. ప్రస్తుతం అమెరికాలో ప్రవాసంలో ఉన్న రెజా పహ్లవీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ విజయం మనదే ఎందుకంటే మన పోరాటం న్యాయమైనది అంటూ నిరసనకారులకు సంఘీభావం ప్రకటించారు. 1979 ఇస్లామిక్ విప్లవం సందర్భంగా పదవీచ్యుతుడైన అమెరికా మద్దతుదారు షా మొహమ్మద్ రేజా పహ్లవీ కుమారుడు రేజా పహ్లవీకి అనుకూలంగా విద్యార్థులు నినాదాలు చేశారు. టెహ్రాన్ వ్యాప్తంగా షాకు కీర్తిస్తూ నినాదాలు మార్మోగిన దరిమిలా అమెరికాలో ప్రవాస జీవితాన్ని గడుపుతున్న రేజా పహ్లవీ ఎక్స్ వేదికగా స్పందించారు. తాను మీతోనే ఉన్నానని, తమ పోరాటం న్యాయమైనది కాబట్టి విజయం తమదేనని ఆయన నిరసనకారులను ఉద్దేశించి ప్రకటించారు. ఇరాన్ రియాల్ విలువ డాలర్‌తో పోలిస్తే సగానికి పడిపోవడం, ద్రవ్యోల్బణం 42.5 శాతానికి చేరడంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. లోర్దెగాన్, కుహదాష్త్, ఇస్ఫహాన్ వంటి నగరాల్లో భద్రతా బలగాలకు, నిరసనకారులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరుగుతోంది. కుహదాష్త్‌లో జరిగిన ఘర్షణలో బాసిజ్ పారామిలిటరీ దళానికి చెందిన అమీర్ హుస్సామ్ ఖోదయారీ ఫర్ద్ అనే వ్యక్తి మరణించగా, మరో 13 మంది గాయపడ్డారు. పరిస్థితి విషమిస్తుండటంతో ఇరాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఒకవైపు భద్రతా చర్యలు చేపడుతూనే, మరోవైపు చర్చలకు సిద్ధమని ప్రకటించింది. వర్తక సంఘాల ప్రతినిధులతో నేరుగా మాట్లాడతామని ప్రభుత్వ అధికార ప్రతినిధి ఫాతిమా మొహజెరానీ తెలిపారు. కాగా, నిరసనకారులను అణచివేయడానికి ఇరాన్ ఇంటర్నెట్ సేవలను కూడా కొన్ని ప్రాంతాల్లో నిలిపివేసింది.



## నీరు కాదు విషాన్ని పంచారు..

### ఇండోర్ మరణాలపై రాహుల్‌గాంధీ ఆందోళన

**న్యూఢిల్లీ, జనవరి 2:** కలుషిత నీరు తాగి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. అక్కడి ప్రభుత్వం నీరు కాకుండా విషాన్ని పంపిణీ చేస్తోందని మండి పడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభ కర్ణుడిలా నిద్రపోతోందని రాహుల్ విమర్శించారు. కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొందని పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. దీనికి తోడు అధికార బిజెపి నేతలు నిర్లక్ష్యపు ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. బాధిత కుటుంబాలకు ఓదార్పు ఇవ్వకుండా అహంకారంతో వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. మురికిగా, దుర్వాసన వస్తోన్న నీటి గురించి గతంలో ప్రజలు పదే పదే ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు? తాగే నీటిలో మురుగునీరు ఎలా కలిసింది? వెంటనే నీటి సరఫరా ఎందుకు ఆపలేదు? బాధ్యులైన అధికారులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు? అని రాహుల్ ప్రశ్నించారు. పరిశుభ్రమైన నీరు పొందడం ప్రజల హక్కు అని అన్నారు. ఈ హక్కును కాలరాసిన బిజెపి ప్రభుత్వమే ఇందుకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. దుష్పరిపాలనకు మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని విమర్శించారు. మొన్నటి వరకు దగ్గు మందు కారణంగా, ఆ తర్వాత ప్రభుత్వాసుపత్రుల్లో ఎలుకల వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు కలుషిత నీరు కారణంగా మృతి చెందుతున్నారన్నారు. ఇలా ఎప్పుడు పేదలు మరణించినా మోడీజీ మాత్రం మౌనంగా ఉంటారన్నారని విమర్శించారు. ఇక ఓ మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజ్ వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని నగర మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తాజాగా తెలిపారు.

## గిగ్‌వర్కర్లకు మేలుచేసే నాలుగు కొత్త లేబర్‌కోడ్‌లు

**న్యూఢిల్లీ, జనవరి 2:** గిగ్ వర్కర్లకు సైతం మేలుచేసేవిధంగా కేంద్రం నాలుగు కొత్త కార్మిక చట్టాలకు (లేబర్ కోడ్స్) సంబంధించిన ముసాయిదా నిబంధనలను కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఈ కొత్త విధానం ద్వారా తొలిసారిగా గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు అంటే ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవర్లు వంటివారినికూడా సామాజిక భద్రత పరిధిలోకి తీసుకువస్తున్నారు. వారికి కనీస వేతనం, ఆరోగ్యం, వృత్తి భద్రత వంటి ప్రయోజనాలు అందనున్నాయి. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త చట్టాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముసాయిదా నిబంధనల ప్రకారం ఈ ప్రయోజనాలు పొందాలంటే గిగ్ వర్కర్లు కొన్ని షరతులను పాటించాల్సి ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకే సంస్థ (అగ్రిగేటర్)తో కనీసం 90 రోజులు పనిచేసిన వారు సామాజిక భద్రత పథకాలకు అర్హులవుతారు. ఒకటి కంటే ఎక్కువ సంస్థలతో పనిచేసే వారికి ఈ పరిమితిని 120 రోజులుగా నిర్ణయించారు. ఒకే రోజులో ఒక వర్కర్ వేర్వేరు సంస్థల కోసం పనిచేస్తే, ఆ పనిదినాలను వేర్వేరుగా లెక్కిస్తారు. ఉదాహరణకు ఒకే రోజు ముగ్గురు అగ్రిగేటర్లతో పనిచేస్తే, దానిని మూడు పని దినాలుగా పరిగణిస్తారు. ఈ కొత్త చట్టాల ద్వారా మరికొన్ని ముఖ్యమైన మార్పులు కూడా రానున్నాయి. ఇకపై అన్ని రంగాల ఉద్యోగులకు యాజమాన్యాలు తప్పనిసరిగా నియామక పత్రాలు (అపాయింట్‌మెంట్ లెటర్లు) ఇవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల ఉద్యోగ భద్రత, పారదర్శకత పెరుగుతాయి. అలాగే ఇప్పటివరకు కొన్ని నిర్దిష్ట పరిశ్రమలకే పరిమితమైన కనీస వేతనం, ఇకపై అన్ని రంగాల కార్మికులకు చట్టబద్ధంగా వర్తిస్తుంది. అధిక వేతనాలు,



మెరుగైన పని పరిస్థితులు కోరుతూ గిగ్ వర్కర్లు సమ్మెకు దిగడానికి ఒక రోజు ముందు, అంటే గత ఏడాది డిసెంబరు30న ఈ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల కావడం గమనార్హం. ప్రస్తుతం ఈ ముసాయిదాపై భాగస్వామ్య పక్షాల నుంచి కేంద్ర ప్రభుత్వం అభిప్రాయాలను స్వీకరిస్తోంది.

## ప్రతి ఒక్కరూ ఇంట్లో మాతృభాషనే మాట్లాడాలి!

### ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**ముంబయి, జనవరి 2:** దేశంలో భాషా వివాదం ముదురుతున్న తరుణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతి భారతీయుడు తన సొంత భాషను గౌరవించాలని ముఖ్యంగా కుటుంబ సభ్యులతో మాతృ భాషలోనే సంభాషించాలని ఆయన కోరారు. భాషా వైవిధ్యం దేశానికి బలం కావాలి తప్ప బలహీనత కాకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంగ్లీష్‌తో అన్నీ సాధ్యం కాదని ఆయన అన్నారు. ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న భగవత్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలోని లోతైన అర్థాలను వివరించడానికి ఇంగ్లీష్ భాషలో తగిన పదజాలం లేదని అన్నారు. ఉదాహరణకు కల్పవృక్షం అనే పదాన్ని ఇంగ్లీష్‌లోకి అనువదిస్తే దాని అసలు అర్థం, ఆధ్యాత్మికత దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. కేవలం ఇంగ్లీష్ మీడియం చదువుల వల్ల భాషలు అంతరించిపోవని ఇంట్లో మాతృభాషలో మాట్లాడటం మానేయడం వల్లనే ప్రాంతీయ భాషలకు ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కులం, మతం, సంపద లేదా భాష ఆధారంగా అంచనా వేయకూడదని భగవత్ సూచించారు.

“భారతదేశం అందరిదీ ఇక్కడ పుట్టి, ఈ దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ భారతీయులే“ అని ఆయన స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక వేత్తలు కూడా ఇప్పుడు ఇంగ్లీష్‌ను ఆశ్రయించాల్సి రావడం మన భాషల పట్ల పెరుగుతున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని అన్నారు. నైతిక విలువలు, సంప్రదాయాలు తదుపరి తరాలకు అందాలంటే మాతృభాషను కాపాడుకోవడం ఒక్కటే మార్గమని ఆయన ఉద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. మాతృభాషపై భగవత్ చేసిన సూచనలను పలువురు ఆహ్వానిస్తుండగా మరికొందరు మాత్రం తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇంగ్లీషు భాష మాట్లాడడం బాగా అలవాటు అవ్వాలంటే ఇంట్లో కూడా ఆ భాషలోనే మాట్లాడాలంటూ పలువురు సూచిస్తున్నారు. అభిప్రాయపడ్డారు. ఇంగ్లీష్‌తో అన్నీ సాధ్యం కాదని ఆయన అన్నారు. ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న భగవత్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలోని లోతైన అర్థాలను వివరించడానికి ఇంగ్లీష్ భాషలో తగిన పదజాలం లేదని అన్నారు. ఉదాహరణకు కల్పవృక్షం అనే పదాన్ని ఇంగ్లీష్‌లోకి అనువదిస్తే దాని అసలు అర్థం, ఆధ్యాత్మికత దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. కేవలం ఇంగ్లీష్ మీడియం చదువుల వల్ల భాషలు అంతరించిపోవని ఇంట్లో మాతృభాషలో మాట్లాడటం మానేయడం వల్లనే ప్రాంతీయ భాషలకు ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కులం, మతం, సంపద లేదా భాష ఆధారంగా అంచనా వేయకూడదని భగవత్ సూచించారు. “భారతదేశం అందరిదీ ఇక్కడ పుట్టి, ఈ దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ భారతీయులే“ అని ఆయన స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక వేత్తలు కూడా ఇప్పుడు ఇంగ్లీష్‌ను ఆశ్రయించాల్సి రావడం మన భాషల పట్ల పెరుగుతున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని అన్నారు. నైతిక విలువలు, సంప్రదాయాలు తదుపరి తరాలకు అందాలంటే మాతృభాషను కాపాడుకోవడం ఒక్కటే మార్గమని ఆయన ఉద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. మాతృభాషపై భగవత్ చేసిన సూచనలను పలువురు ఆహ్వానిస్తున్నారు.

## అంగారక గ్రహంపై నీటి గుహలు!



**న్యూయార్కు, జనవరి 2:** అంగారక గ్రహంపై నీటి గుహలను చైనా శాస్త్రవేత్తలు గుర్తించారు. హెబ్రుస్ వాలీస్ ప్రాంతంలో ఆ గుహలు ఉన్నట్లు తేల్చారు. నీటి వల్ల గుహలు ఏర్పడినట్లు అంచనా వేస్తున్నారు. భూమి కాకుండా మరో గ్రహంపై నీటి గుహలను గుర్తించడం ఇదే మొదటిసారి. మార్స్ గ్రహంపై అగ్నిపర్వతాల ద్వారా ఏర్పడిన గుహలను గతంలో గుర్తించారు. కానీ రాళ్లలోని రసాయనాల వల్ల నీటి గుహలు ఏర్పడినట్లు తాజా రిపోర్టులో తేల్చారు. 'ద ఆస్ట్రోఫిజికల్ జనరల్ లెటర్స్'లో ఈ స్టడీకి చెందిన నివేదిక ఇచ్చారు. నీటి గుహల ఆవిష్కరణ మార్స్ గ్రహంపై జీవం ఉందన్న ఆధారాలను స్టడీ చేసేందుకు ఊతం ఇచ్చేలా ఉన్నది. ఎన్నో ఏళ్ల క్రితమే ఈ గుహలు ఏర్పడినట్లు తేల్చారు. భవిష్యత్తు అన్వేషణలకు ఈ గుహలను స్టడీ చేయనున్నారు. 2025 అక్టోబర్ 30న ఆ అధ్యయనానికి చెందిన డేటాను పబ్లిష్ చేశారు. నాసా శాటిలైట్ల నుంచి సేకరించిన డేటా ఆధారంగా చైనా శాస్త్రవేత్తలు రిపోర్టు ఇచ్చారు.

## సంక్షిప్తంగా..

### తమిళనాట మల్లెపూలు కిలో రూ.3 వేలు!



**చెన్నై, జనవరి 2:** తమిళనాడులో ఆధ్యాత్మిక మాసం మార్గళి పూజలకు తోడు, ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు తోడవడంతో పూల ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా మల్లెపూల ధరలు సామాన్యులకు అందనంత స్థాయికి చేరాయి. మధురై మార్కెట్‌లో కిలో మల్లెలు రూ. 2,500 పలకగా, తేని జిల్లా ఆండిపట్టి మార్కెట్‌లో ఏకంగా రూ. 3,000 మార్కును తాకాయి. రాష్ట్రంలో వర్షాలు తగ్గి మంచు కురుస్తుండటంతో పూల దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఇదే సమయంలో వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సరం కూడా కావడంతో పూలకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. మల్లెపూలతో పాటు ఇతర పూల ధరలు కూడా పెరిగాయి. కిలో కనకాంబరం రూ. 2,500, ముల్లై పూలు రూ. 1,200, పన్నీటి గులాబీలు రూ. 200 చొప్పున విక్రయించారు. సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో పూల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

### పుతిన్ ఇంటిపై దాడి నిజమే: యుఎస్‌కు ఆధారాలిచ్చిన రష్యా



**మాస్కో, జనవరి 2:** యుద్ధం ముగించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇల్లే లక్ష్యంగా డ్రోన్ దాడులు జరగడం తీవ్రం చర్చనీయాంశమైంది. ఉక్రెయిన్ దళాలు ఈ దాడికి పాల్పడ్డాయంటూ రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే. వీటిని పలు దేశాలు ఖండిస్తున్న నేపథ్యంలో.. దాడి నిజమేనని రష్యా నిజరూపించుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా దాడికి సంబంధించి లభ్యమైన కొన్ని ఆధారాలను అమెరికాకు అందజేసింది. ఈ మేరకు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ఓ విడియో విడుదల చేసింది. రష్యా సైనిక నిఘా సంస్థ అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్ట్యుకోవ్ మాస్కోలోని యుఎస్ మిలిటరీ అటాచ్ అధికారులతో భేటీ అయ్యారు.

### తైవాన్ సమీపంలో యుద్ధ విన్యాసాలు ఆపండి : చైనాను కోరిన అమెరికా

**వాషింగ్టన్, జనవరి 2:** తైవాన్ విషయంలో చైనా అనుసరిస్తున్న విధానాలపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. బీజింగ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసింది. ఇటీవల తైవాన్ జలసంధి చుట్టూ చైనా భారీగా యుద్ధ విన్యాసాలు చేయడం తీవ్ర ఆందోళన కలిగించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపైనే తాజాగా అమెరికా విదేశాంగ శాఖ స్పందించింది. 'తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు, బెదరింపులకు పాల్పడటం ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తలు పెంచుతాయి. బీజింగ్ సంయమనం పాటించాలని, తైవాన్‌పై సైనిక ఒత్తిడిని ఆపాలని కోరుతున్నాం. దౌత్యమార్గాలతో ఈ సమస్య పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం.' అని



విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ పిగోట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తైవాన్ జలసంధి చుట్టూ శాంతి, స్థిరత్వానికి యుఎస్ మద్దతుస్తోందన్నారు.

### ఫుడ్‌పాయిజనింగ్‌తో 200 చిలుకల మృతి

**భోపాల్, జనవరి 2:** కలుషిత ఆహారం వల్ల సుమారు 200 చిలుకలు మరణించాయి. ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు. బర్డ్ ఫ్లూ కారణంగా చిలుకలు చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అయితే చిలుకల మృతికి ఫుడ్ పాయిజనింగ్ కారణమని పశు వైద్యులు నిర్ధారించారు. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బద్వా ప్రాంతంలోని నర్మదా నది ఒడ్డున ఉన్న అక్విడక్ట్ వంతెన సమీపంలో గత నాలుగు రోజుల్లో సుమారు 200 చిలుకలు మరణించాయి. ఇది చూసి స్థానికులు ఆందోళన చెందారు. బర్డ్ ఫ్లూ సోకడం వల్ల చిలుకలు చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు.

వందలాది చిలుకలు మరణించిన సమాచారం తెలుసుకుని పశువైద్యులు, వన్యప్రాణుల సంరక్షణ శాఖతో పాటు అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు.

చిలుకల కళేబరాలకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. వాటి మృతికి ఫుడ్ పాయిజనింగ్ కారణమని పశువైద్యులు నిర్ధారించారు.

## మోడీతో ట్రంప్‌నకు వ్యక్తిగత విభేదాలు.. అందుకే భారత్‌కు దూరం!

**వాషింగ్టన్, జనవరి 2:** రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. భారత్‌తో అనుసరిస్తున్న విధానాలను అమెరికా కాంగ్రెస్ సభ్యుడు సుహాస్ సుబ్రమణ్యం తప్పుబట్టారు. ట్రంప్ తన చర్యలతో భారత్-అమెరికాల మధ్య సంబంధాలను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. ఇది ఇరు దేశాల ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు ప్రమాదకరమని హెచ్చరించారు. డెమోక్రటిక్ నేత సుబ్రమణ్యం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'ట్రంప్ తన తొలివిడత పాలనలో తీసుకున్న చర్యలకు పూర్తి వ్యతిరేకంగా ఇప్పుడు వ్యవహరిస్తున్నారు. తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత ప్రధాని మోడీతో సంబంధాలను బలోపేతం చేశారు. ఇప్పుడు మోడీతో ఆయనకు వ్యక్తిగత విభేదాలు ఉన్నట్లుగా కన్పిస్తోంది. దానివల్ల చాలా యేళ్లుగా బలంగా ఉన్న ఇరు దేశాల సంబంధాలను ఆయన చెడగొట్టుకుంటున్నారు. ఇది ఇరు దేశాలకు మంచిది కాదు' అని ఆయన అన్నారు. భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడం అమెరికాకు చాలా ముఖ్యమని, ముఖ్యంగా చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి ఇది సాయపడుతోందన్నారు. ట్రంప్ విధించిన సుంకాలు ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయని సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. అమెరికా కాంగ్రెస్‌లో ఉభయపక్షాలు భారత్‌తో సంబంధాలకు కట్టుబడి ఉన్నాయన్నారు.




## కుమార్తెతో కలిసి కొత్త సంవత్సరవేడుకల్లో కిమ్!

**ప్యాంగ్యాంగ్, జనవరి 2:** ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తె జుయేను మరోసారి ప్రపంచానికి ప్రత్యేకంగా పరిచయం చేశారు. 2026 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా, కిమ్ తన తండ్రి కిమ్ జోంగ్ ఇల్, తాత కిమ్ ఇల్ సంగ్ భౌతిక కాయాలను భద్రపరిచిన పవిత్రమైన కుమ్సుసాన్ ప్యాలెస్ ఆఫ్ ది సన్ ను కుమార్తెతో కలిసి సందర్శించారు. జుయే ఈ ప్యాలెస్‌ను సందర్శించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా కెసీఎన్‌ఏ విడుదల చేసిన చిత్రాలలో కిమ్ కుటుంబం ప్రధాన వరుసలో నిలబడి నివాళులర్పించింది. ఇందులో కిమ్ జోంగ్ ఉన్, ఆయన భార్య రి సోల్ జు మధ్యలో కుమార్తె జుయే నిలబడి ఉన్నారు. సాధారణంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన వారు ఉండే మధ్య స్థానాన్ని తన కుమార్తెకు కేటాయించడం ద్వారా కిమ్ ఆమెను తన వారసురాలిగా సూచనప్రాయంగా ప్రకటిస్తున్నారని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్యాంగ్‌యాంగ్‌లో జరిగిన నూతన సంవత్సర ప్రదర్శనలో కూడా జుయే సందడి చేశారు. తన తండ్రి ధరించిన శైలిలోనే నల్లటి లెదర్ కోటు ధరించి ఆయన పక్కనే కూర్చున్నారు. కౌంట్‌డౌన్ ముగిసిన తర్వాత కిమ్ బుగ్గపై ముద్దుపెట్టుకుని శుభాకాంక్షలు తెలుపుతూ కనిపించారు. ఈ వేడుకల్లో ఆమె పిల్లలను హత్తుకోవడం, ప్రజలకు అభివాదం చేయడం వంటి దృశ్యాలు ఆమెకు పెరుగుతున్న ప్రాధాన్యం చాటుతున్నాయి.

## ఆస్తి కోసం తండ్రిని చంపేశారు

### - ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఘోరం



**లక్నో, జనవరి 2:** ఆయనో రిటైర్డ్ ఆర్మీ అధికారి. ఆయనకు ఇద్దరు కుమారులు. వారి మధ్య ఆస్తి వివాదం. ఇల్లు విడిచి వెళ్లాలని కొడుకులకు తండ్రి అల్టిమేటం జారీ చేశాడు. కొంతకాలంగా కుమారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఆస్తిపై ఆశతోపాటు, ఇల్లు ఖాళీ చేయడం ఇష్టంలేని కుమారులిద్దరూ తండ్రిని హతమార్చాలని కుట్ర పన్నారు. తండ్రిని హత్య చేయాలని తెలిసిన వ్యక్తికి సుపారీ ఇచ్చారు. సుపారీ తీసుకున్న ముఠాలో ఓ కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. అంతా అనుకున్నట్లుగా ఇంటికొస్తున్న తండ్రిని సుపారీ గ్యాంగ్ డిసెంబర్ 26న తుపాకీతో కాల్చి చంపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎఫ్ అధికారి యోగేష్ (58) తన ఇంట్లో ఉంటున్న కుమారులను ఆ ఇల్లు ఖాళీ చేయాలని కొంతకాలంగా ఒత్తిడి తెస్తున్నారు. ఆస్తిపై ఆశతో పాటు, ఇల్లు ఖాళీ చేయడం ఇష్టం లేని కుమారులు తండ్రిని వదిలించుకోవాలని పథకం వేశారు. ఇందుకోసం తమ పొరుగున ఉండే అరవింద్ (32) అనే వ్యక్తికి సుపారీ ఇచ్చారు. అరవింద్ తన బావమరిది, కౌశాంబి జిల్లాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నవీన్‌తో కలిసి ఈ కాల్పులకు పాల్పడ్డాడు. బుధవారం సాయంత్రం నిందితుడు అరవింద్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి పిస్టల్, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో యోగేష్‌పై తానే కాల్పులు జరిపినట్లు అరవింద్ అంగీకరించాడు. ఘజియాబాద్ కోర్టు అతడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. యోగేష్ ఇద్దరు కుమారులు, కానిస్టేబుల్ నవీన్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# బిఆర్ఎస్ నినాదాలతో సభ ప్రారంభం

## పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు పట్టుబట్టిన బిఆర్ఎస్

## ప్రశ్నోత్తరాలు జరగడం ప్రతిపక్షానికి ఇష్టం లేదా?: మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** 'కాంగ్రెస్ వచ్చింది రైతులను నిండా ముంచింది' – 'స్టాకుల్లో లేని యూరియా బ్లాకుల్లో యూరియా' అంటూ బిఆర్ ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ప్రారంభం కాగానే నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస యాద్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి సునీత లక్ష్మారెడ్డి, కాలే వెంకటేశ్వర్లు తదితరులు ప్లకార్డులు పట్టుకొని నినాదలు చేయడంతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వారిని వారించారు. బిఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు యూరియా కొరతపై పాయింట్ ఆఫ్ ఆర్డర్ కోరారు. ప్రశ్నోత్తరాల సమయంలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు అవకాశం ఉండదని హరీశ్‌రావు ప్రతి పాదనను ఖరాఖండిగా స్పీకర్ ప్రసాద్ తిరస్కరించారు. ప్రతిపక్ష సభ్యులు వెనక్కి తగ్గకుండా నినాదాలు చేయడంతో ప్రారంభంలోనే ఇరుపక్షాల మధ్య వాగ్వాదం మొదలైంది. శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నో త్తరాల సమయం కొనసాగించాలని సమస్యలు ఉంటే సమస్యను వివిధ రూపాల్లో సభలో చర్చకు తీసుకొచ్చే అవకాశం ఉందని నినాదాలు చేయడం తగదని అన్నారు. లెజిస్లేచర్ ప్రొసిజర్ ప్రకారం రావాలని సమస్యను నిర్ణీత ఫార్మెట్‌లో చర్చకు తీసుకొని రావాలని ఇలా నిరసన చేస్తూ సమయాన్ని వృధా చేయవద్దని సూచించారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఇవ్వాలని హరీశ్‌రావు పట్టుబట్టడంతో ప్రతిపక్ష సభ్యులకు ప్రశ్నోత్తరాలు జరగడం ఇష్టంలేనట్లు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

### ఐదు జోన్లుగా మూసీ అభివృద్ధికి వికేంద్రీకరణ

మూసీ నదిని ఐదు జోన్లుగా వికేంద్రీ కరణ చేసి అభివృద్ధి ప్రక్షాళన చేస్తామని నైట్ ఎకనామిక్ గ్రోత్‌సెంటర్‌గా మార్చు తామని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధ్‌రబాబు తెలిపారు. ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు మూసీ అభివృద్ధి పనులకు అధ్యయనం చేస్తున్నారని అన్నారు. త్వరలోనే డిపిఆర్‌లను తయారు చేయనున్నట్లు వెల్లడించారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధులు ఇస్తుందని తెలిపారు.

# వైద్య విద్యపై బాధ్యతతో ఉన్నాం

## మంత్రి దామోదర రాజనర్సింహా



**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఓ వైపు ప్రభుత్వ రంగ సంస్థ లను బలోపేతం చేస్తూనే ప్రైవేటు సంస్థలను ప్రోత్స హిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా తెలిపారు. మెడికల్, హెల్త్, క్వాలిటీ ఎడ్యుకేషన్ అంశంలో ప్రభు త్వం బాధ్యతతో ఉన్నదని చెప్పారు. యూనివర్సిటీలను ప్రోత్సహించే దిశగా తెలంగాణ ప్రైవేటు విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు తెచ్చినట్లు తెలిపారు.

### ప్రభుత్వ విద్యాసంస్థలపై నమ్మకం పోతుంది : ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్

రాష్ట్రంలో రోజురోజుకూ ప్రైవేటు విద్యాసంస్థలు పెరిగిపోతున్నాయని.. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారని సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలపై నమ్మకం లేకుండా పోతున్నదన్నారు. రాష్ట్రంలో కొత్తగా తీసుకొచ్చే యూనివర్సిటీలకు భూములు సేకరించారా అని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ప్రశ్నించారు.

### ప్రైవేట్ వర్సిటీ బిల్లును వ్యతిరేకిస్తున్నాం : సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని

రాష్ట్రంలో విద్యను పూర్తిగా ప్రయివేటీకరణ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని సిపిఐ కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావు ఆరోపించారు. ముఖ్యంగా ఫారిన్ యూనివర్సిటీలకు ద్వారాలు తెరుస్తున్నారని ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలు, ఇంజినీరింగ్ కాలేజీల మీద నియంత్రణ లేకుండా పోయిందన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్నా చూస్తూ ఊరుకుంటున్నారని...ప్రైవేట్ కాలేజీ, యూనివర్సిటీల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు సైతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. ఈ ప్రైవేటు యూనివర్సిటీ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

# విలీనగ్రామాల్లో పన్నులు పెంచే ప్రసక్తే లేదు

## నిధుల కేటాయింపులోనూ సమాన ప్రాధాన్యం

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం అవుతున్న గ్రామాల్లో పన్నులు పెంచే ప్రసక్తే లేదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. శుక్రవారం జీహెచ్ ఎంసీ సవరణ బిల్లు సందర్భంగా ఆయన మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ పూర్వ మున్సిపల్ పరిమితులను దాటి విస్తరించిందని.. అందుకే ఓఆర్ఆర్ లోపల, ఆనుకొని ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ప్రాంతంగా తీసుకొస్తున్నామని చెప్పారు. ఓఆర్ఆర్ పరిధిలో పంచాయతీ రాజ్, మున్సిపల్, గ్రేటర్ కార్పొరేషన్ చట్టాలు అమలవుతున్నాయని.. సమగ్ర ప్రణాళికలు లేక ప్రజలకు సరైన సేవలు అందడం లేదన్నారు. అందుకే ఈ సవరణ బిల్లులను తీసుకొచ్చామని చెప్పారు. అన్నింటా ఒకే విధమైన సేవలు అందేలా చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఆర్థిక , సాంకేతిక, పరిపాలన సామర్థం లేకుండా పోయిందని.. దీని ద్వారా సులభమైన పాలన అందించవచ్చని చెప్పారు. 27 మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేయాలని కార్పొరేషన్ తీర్మానించిందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా విలీన గ్రామాల్లో ఇప్పుడే పన్నులు పెరగబోవని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తామని చెప్పారు. 12 జోన్లను, 60 సర్కిళ్లను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని.. సరైన మున్సిపల్ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ముందుగా సలహాలు, అభ్యంతరాలు సేకరించామని.. మొత్తంగా 5,935 సూచనలు తీసుకున్నామని తెలిపారు. నిధుల కేటాయింపులోనూ సమాన ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. ఎన్ని కార్పొరేషన్లు అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అందరి అభిప్రాయాలు తీసుకున్నాకే ప్రకటిస్తామన్నారు. నగరంలో పొల్యూషన్ కంట్రోల్ కోసం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే.. మెర్జింగులో భాగంగా రంగారెడ్డి అస్థిత్వం పోనివ్వమని.. ఇంద్రేశం, ఐనవోలును గ్రేటర్‌లో కలిపే విషయాన్ని ఆలోచిస్తామని హామీ ఇచ్చారు. చాంద్రాయణగుట్ట ఫ్లైఓవర్ పూర్తికి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇక కొత్తగా ఏర్పాటుకానున్న కార్పొరేషన్లలో సిబ్బందిని సైతం పూర్తిస్థాయిలో నియామకం చేపడుతామన్నారు.

# మున్సిపల్, జిహెచ్ఎంసి బిల్లులు వెనక్కి తీసుకోండి

## బిజెపి సభ్యుడు పాల్వాయి హరీష్

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** మున్సిపాలిటి, జిహెచ్ఎంసి, మోటారు వాహన చట్టసవరణ బిల్లులు మంత్రి శ్రీధర్‌బాబు, తెలంగాణ ప్రైవేటు విశ్వవిద్యాలయ సవరణచట్ట బిల్లు మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం సభలో ప్రవేశపెట్టారు. మునిసిపల్, జీహెచ్ ఎంసి చట్టసవరణ బిల్లుపై దానం నాగేందర్ 650 చదరపు కిలోమీటర్ల నగరం 2,050 చదరపు కి.మి విస్తరించి మూడుగా విభజించబడుతోందని 300 కార్పొరేటర్లు ఉండబోతున్నారని నగర అభివృద్ధికి ఇది ఎంతగానో ఉపయోగపడుతోందని ఆయన తెలిపారు. తెలంగాణ శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన



పురపాలక, జిహెచ్ఎంసి చట్ట సవరణ బిల్లులో స్పష్టత లేదనిబిజెపి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు విమర్శించారు. బిల్లుపై ప్రతిపక్ష సభ్యులకు పూర్తి సమాచారం ఇవ్వకుండానే ప్రభుత్వం ముందుకు రావడం ప్రజాభిప్రాయానికి విరుద్ధమన్నారు. లోపాలను సరిదిద్దకుండా బిల్లును రూపొందించడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 12 మున్సిపాలిటీలను జిహెచ్ఎంసి లో విలీనం చేసిందని గుర్తు చేసిన హరీశ్ బాబు, ఇప్పుడు ప్రతిపాదిత విలీనాలతో కలిగే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు.

రెండు వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని ఒకే కార్పొరేషన్గా మార్చడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ప్రజాభిప్రా యానికి విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. 51 గ్రామ పంచాయతీలను ముందుగా మున్సిపాలిటీల్లో, వెంటనే జీహెచ్ఎంసీలో విలీనం చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఈ ప్రక్రియతో పచ్చదనంతో కలకలలాడే గ్రామాలు కనుమరుగయ్యాయని, చేతివృత్తులు, కులవృత్తులకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని తెలిపారు. విలీనాలు ఒక పార్టీకి అనుకూలంగా జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. విలీనంతో ఆయా గ్రామాల్లో పన్నులు భారీగా పెరిగే అవకాశం ఉందని, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతోందని హరీశ్బాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో యూరియా కొరతపై చర్చ పెట్టాలి

## అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేల వాయిదా తీర్మానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 2:** రాష్ట్రంలో యూరియా కొరతపై శాసనసభలో బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులు, ఎరువుల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానల వల్ల కలుగుతున్న నష్టాలపై సభలో వెంటనే చర్చ చేపట్టాలని ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల కమలాకర్, కల్వకుంట్ల సంజయ్ కోరారు. మరోవైపు యూరియా కొరతపై చర్చ చేపట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ ప్రాంగణంలో నిరసన తెలిపారు. షాపుల్లో దొరకని యూరియా యాప్‌ల్లో దొరుకుతుందా?, కాంగ్రెస్ వచ్చింది.. యూరియా కొరత వచ్చిందని ప్లకార్డులు ప్రదర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులతో శాసనసభకు వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డులతో లోనికి వెళ్లవద్దని సూచించారు. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదం జరిగింది. నేను మాట్లాడిన తర్వాతనే మీకు సరెండర్ లీవ్‌ల డబ్బులు వచ్చాయి.. ఇప్పుడు యూరియా మీద కూడా రైతుల పక్షాన మాట్లాడితేనే యూరియా వస్తుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. యూరియా కొరతపై అసెంబ్లీలో చర్చించాలని డిమాండ్ చేశారు. కాగా, యూరియా కొరతపై బిఆర్ఎస్ ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాన్ని చర్చించేందుకు తిరస్కరించినట్లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సభలో ప్రకటించారు.

# మూసీ సుందరీకరణతో నిరుపేదలను నిరాశ్రయులను చేయొద్దు

## అక్బరుద్దీన్ ఒవైసి

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** మూసీ ప్రక్షాళనతో నిరుపేదలకు నిలువ గూడు లేకుండా నిరాశ్రయులను చేయవద్దని నదుల తీరాల్లో చెరువు గట్టుల వెంట అత్యధికులు నిరుపేదలు జీవిస్తారని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన వికారాబాద్ నుంచి చేస్తారా? మధ్యలో నుంచి చేస్తారా అని ప్రశ్నించారు. మూసీకి-మీరాలమ్‌కు సంబంధమేంటని రెండు మూడు అంశాలను కలగలిపితే ఎలా అని అడిగారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉందని అడిగారు. ప్రపంచంలో కాలుష్యంలో మూసీ 8వ స్థానంలో ఉందని తెలిపారు. మూసీ – ఈసా నదులు కావు అవి ఇప్పుడు మురికినీటిని తీసుకొని వచ్చే ప్రవాహాలు అని విమర్శించారు. నగరంలోని మురుగు అంతా మూసీ నదిలోకే వెళ్తోందని తెలిపారు. మూసి నది ఎప్పుడు ప్రక్షాళన



ప్రారంభిస్తారు రెండేళ్ళ నుంచి కాలం గడుపుతున్నారని అడిగారు. 18నెలలలో ప్రక్షాళన కార్యక్రమం ముగిస్తామంటు గత సంవత్సరం కాలంగా చెబుతున్నారని ఎప్పటి నుంచి మొదలై ఎప్పటిలోగా 18నెలల కాలం ముగుస్తుందో తెలుపాలని కోరారు. మూసీలో ప్రైవేటు లాండ్ ఎంత ఉందని ప్రశ్నించారు. గోదావరి నీళ్ళు హిమాయత్‌సాగర్ ఉస్మాన్‌సాగర్‌లో ఎలా తెస్తారు హిమాయత్ సాగర్ ఉస్మాన్‌సాగర్ కాచ్‌మెంట్ ఏరియా ఎంతో చెప్పాలని కోరారు. గత వర్షాకాలం వరదలను తట్టుకోని మూసీ, జంటజలాశయాలు గోదావరి నీళ్ళు తీసుకొచ్చి నింపితే ఆ నీరు ఎటు పోతుందని అడిగారు. చెక్‌డ్యామ్‌లు ఓఆర్ఆర్ కారణంగా క్యాచ్‌మెంట్ ఏరియా తగ్గిందని నీళ్ళు వదిలితే ఓఆర్ఆర్‌వైపు నుంచి వెనక్కి తన్ని నగరంలోకి వరద వస్తోందని ఆయన ఆవేదన చెందారు. దశాబ్దాల కింద నిర్మించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లో పూడిక తీసి, వాటి సామర్థ్యం పెంచాలని కోరారు. నీటి నిల్వ సామర్థం పెంచితే గోదావరి జలాలను తరలించవచ్చని తెలిపారు గండిపేట జలాశయంలో కూడా మురుగు నీరు కలుస్తుందని అన్నారు..వికారాబాద్ నుంచి గండిపేట వరకు ప్లాన్స్ ఏంటో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చార్మినార్ వద్ద మూడేళ్ల కిందట మొదలుపెట్టిన పెడస్ట్రేరియన్ ప్రాజెక్టు ఏమైందని ప్రశ్నించారు.

# ఎగ్జిబిషన్ సొసైటీ స్టాల్ కేటాయింపుల అవకతవకలపై ప్రభుత్వానికి విజ్ఞప్తి

## ప్రొ.కోదండరామ్

**హైదరాబాద్ (గోషామహల్), జనవరి 2, ప్రభాతవార్త:** నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటిలో స్టాల్ కేటాయింపుల్లో జరుగుతున్న అవకతవకలపై ప్రభుత్వం పెద్దలతో చర్చించి,రానున్న కాలంలో స్టాల్ ఎంపికలో పూర్తిస్థాయి పారదర్శకత పాటించే విధంగా కృషి చేయాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో నాంపల్లి టి.జె.ఎస్ కార్యాలయంలో నిర్వ హించిన అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయనమాట్లాడుతూ రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి సొసైటీ అధ్యక్షులు, మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు.ప్రీమియం పేరుతో లక్షలాది రూపాయల అక్రమాలకు సొసైటి సభ్యులు పాల్పడుతున్నారనే ఆరోపణలపై నిర్ధారణ కమిటిని ఏర్పాటుచేసి,సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ అఖిల పక్ష సమావేశానికి తెలంగాణజన సమితి అధ్యక్షులు ఎం.నర్సయ్య అధ్యక్షత వహించగా,సిపిఐ(ఎం) నగర నాయకులు సత్తార్, న్యూడెమోక్రసీ నాయకురాలు అనురాధ,మాస్‌లైన్ నాయకులు సదానంద్, గాంధీదర్శన్, సెక్రటరీప్రసాద్, స్టాల్ బాధితుల కమిటి కన్వీనర్ అబ్రార్, బాధితులు ఇక్బాల్, తెలంగాణ జనసమితి నాయకులుబట్టల రామచందర్,పల్లె వినయ్, మహమ్మద్ అఫ్జల్, జశ్వంత్,సురేష్, కన్నయ్య, రవీందర్, అజయ్‌గౌడ్, వెంకటయ్య, మెరుగు శ్రీనివాస్,జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 8న విజయవాడలో 'తెలుగు రాష్ట్రాల బిసి ఉద్యోగుల సదస్సు'

## ఎంపి ఆర్.కృష్ణయ్య వెల్లడి

**హైదరాబాద్ (సైఫాబాద్), జనవరి 2, ప్రభాతవార్త:** కే ంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్‌లు కల్పించాలని, బిసి రిజర్వేషన్‌లపై ఉన్న క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8వ తేదీన విజయవాడ నగరంలో 'తెలుగు రాష్ట్రాల బిసి ఉద్యోగుల సదస్సు' జరుగు తుందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ సదస్సులో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎపి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రులు సవిత, కొల్లు రవీందర్ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని ఆయన చెప్పారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కల్పించడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేపడతామని, ఇందుకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టడానికి చట్టపరమైన, రాజ్యాంగపరమైన, న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమిలేవన్నారు. రాజ్యాంగ బద్దమైన మండల్ కమీషన్ బిసి ఉద్యోగులకు ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కల్పించాలని సిఫార్సు చేసిందని, చట్టబద్ధమైన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ నాచియప్పన్ కమిటీ కూడా బిసి ఉద్యోగులు ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కల్పించాలని సిఫార్సు చేయడం జరిగిందని ఆయన వివరించారు. పార్లమెంట్‌లో బిసి బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, 2 లక్షల కోట్లుతో ప్రత్యేక అభివృద్ధి పథకాన్ని ప్రవేశపెట్టాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

# కొత్తవాహనాలకు ఇక నుంచి రోడ్డుసేఫ్టీ సెస్ : మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొత్తగా రిజిష్టర్ అయ్యే వాహనాలకు ఇకనుంచి రోడ్ సేఫ్టీ సెస్ విధించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. శుక్రవారం అసెంబ్లీలో తెలంగాణ మోటార్ వెహికిల్స్ టాక్సేషన్ బిల్లు 2025ని ప్రవేశపెట్టి మాట్లాడారు. ద్విచక్ర వాహనాలకు రూ.2వేలు, లైట్ మోటార్ వాహనాలకు రూ.5 వేలు, పెద్ద వాహనాలకు రూ.10 వేలు రోడ్ సేఫ్టీ సెస్ విధించనున్నట్లు చెప్పారు. 4 వీలర్ తేలికపాటి గూడ్స్ వాహనాలకు త్రైమాసిక టాక్స్ ఉండేదని.. రవాణా శాఖ నిపుణులతో చర్చించి గూడ్స్‌కు సంబంధించిన వాహనాలపై లైఫ్ టాక్స్ విధిస్తూ 7.5 శాతానికి చేయడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రోడ్ సేఫ్టీపై సెస్ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే.. జనవరి 1 నుండి 31 వరకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని.. అందరూ భాగస్వాములు కావాలని



పిలుపునిచ్చారు. తాము రోడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తామని విద్యార్థులు వారి తల్లిదండ్రులతో అఫిడవిట్ తీసుకురావాలని.. ఇందులో విద్యా, సంక్షేమ శాఖ పాఠశాలలు పాల్గొనేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. యూనిసెఫ్ సహకారంతో స్కూళ్లలో చిల్డ్రన్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎవరికి వారు స్వయంగా వాహనాల ఫిట్నెస్ చూసుకోవాలని.. రోడ్డు నిబంధనలు పాటించాలని అన్నారు. త్వరలో ఢిల్లీ మాదిరి ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ స్టేషన్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### ద్విచక్ర వాహనాలపై ట్యాక్స్ వేయడం దారుణం: బిజెఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

ద్విచక్ర వాహనాలపైనా వేయడం సరికాదని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. వాహనాలతో జీవనోపాధి పొందే వారికి ఈ బిల్లు ఎంతగానో భారం అవుతుందని పన్ను పెంపును వారు భరించలేరని ఆందోళన వ్యక్తం చేశారు.

# మీ బండారం బయటపడుతుందనే అసెంబ్లీ నుంచి పారిపోయారు

## మంత్రి జూపల్లి కృష్ణారావు




**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ అసెంబ్లీ సెషన్‌ను బాయ్‌కాట్ చేయడంపై మంత్రి జూపల్లి కృష్ణారావు ధ్వజమెత్తారు. శుక్రవారం మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పలాయనవాదం పాటిస్తోందని..అసెంబ్లీ సెషన్‌ను బాయ్‌కాట్ చేయడం పలాయన వాద మేనని అన్నారు. అసెంబ్లీలో కృష్ణా జలాలపై చర్చ జరిగితే మీ బండారం బయటపడుతుందనే సెషన్ బాయ్‌కాట్ డ్రామా పేరుతో పారిపోయారని విమర్శించారు. బిఆర్ఎస్ హయాంలోనే కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని సంతకం చేసి కెసిఆర్ తెలంగాణకు మరణ శాసనం రాశారని విమర్శించారు. కృష్ణా జలాలపై పోరాటం చేస్తామన్న కెసిఆర్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతుంటే ఎక్కడున్నారని ప్రశ్నించారు. కృష్ణా జలాలపై పార్టీ కార్యాలయంలో మాట్లాడటం కాదని, అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని కెసిఆర్‌కు సవాల్ విసిరారు.

### చర్చకు రాకపోతే హరీశ్‌రావు తప్పుఒప్పుకున్నట్టే: మంత్రి వాకిటి

బిఆర్ఎస్ వాళ్లు ఇంట్లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చుకుంటే ఏమి వస్తుంది.. ఎప్పుడు సందర్భం దొరుకుతుందా అని సభ బైకాట్ చేయాలని బిఆర్ఎస్ పార్టీ వాళ్లున్నారని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. చిన్న చిన్న విషయాలపై అరిచి గగ్గోలు చేసే హరీశ్‌రావు తోకముడిచి ఎందుకు వెళ్లిపోయారో సమాధానం చెప్పాలి.సభలో మైక్ ఇస్తే ఎంతసేపు ముఖ్యమంత్రి తిడుదామనే తప్ప బిఆర్ఎస్ వాళ్లకు చర్చ చేయాలని మాత్రం లేదన్నారు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో బిఆర్ఎస్ చర్చకు రావాలి హరీశ్‌రావు చర్చకి రాకపోతే తప్పు ఒప్పుకున్నట్టేనని మంత్రి వాకిటి అన్నారు.

### అసెంబ్లీ నుండి పారిపోయారు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఫ్లోర్ లీడర్ అసెంబ్లీకి రారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ చర్చలో పాల్గొనకుండా అసెంబ్లీ నుండి పారిపోయారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఎవరికి మైక్ ఇచ్చినా నేనే మాట్లాడతా అనే ధోరణిలో హరీశ్‌రావు వ్యవహరించారు. ఉపాధి హామీ పథకం పేరులో మహాత్మా గాంధీ పేరు తొలగించిన అంశంపై చర్చ ఉంది. బీజేపీతో ఢిల్లీలో దోస్తీ ఉన్న కారణంగా అసెంబ్లీలో మాట్లాడాల్సి వస్తుందనే వారి బంధం పోతుందని బాయ్ కాట్ చేశారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబ రాజకీయాలు శాసన సభకు పాకాయి. కేసీఆర్‌కు తెలియకుండా ఈరోజు బాయ్ కాట్ జరిగింది అని నేను అనుకోను. ఎవరి హయాంలో నీళ్ల వాటాలో ద్రోహం జరిగిందో చర్చ పెడదాం అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనండి అని డిమాండ్ చేశారు.


### పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఒక్క పాయింట్ లేదు: రేవంత్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సంజయ్ ధ్వజం




అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మండిపడ్డారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో ఒక్క పాయింట్ లేదు. అధికార బలం, అహంకారం మాత్రమే వారి పవన్ పాయింట్ ప్రజెంటే షన్‌లో ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలు గుప్పించారు.అసెంబ్లీకి కెసిఆర్ వస్తే గౌరవం ఇస్తానని అంటున్నాడు.. అంటే రేవంత్ రెడ్డి ఇప్పటివరకు అగౌరవంగానే ప్రవర్తించాడని అర్థం కదా అని ప్రశ్నించారు. కెసిఆర్ వచ్చి సలహాలు ఇవ్వాలని రేవంత్‌రెడ్డి అంటున్నాడని.. మరి జూరాల ప్రాజెక్టు కింద క్రాప్ హాలీడే ప్రకటించింది మీ ప్రభుత్వమే కదా అని ప్రశ్నించారు. కేఎల్ఐలో ఇప్పటికీ పుష్కలంగా నీళ్ల ఉన్నాయని తెలిపారు. కానీ ఆదిత్యనాథ్ దాస్ సలహాతో జూరాల నుంచి లిఫ్ట్ చేయాలని అంటున్నాడని పేర్కొన్నారు. దయచేసి ఇప్పటికైనా మంచి సలహాదారుడిని పెట్టుకోవాలని సూచించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఇరిగేషన్ గురించి అర్థం కావడం లేదని ఎమ్మెల్యే సంజయ్ ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా బాగా ప్రిపేర్ అయ్యి సభకు రావాలని సూచించారు.

### కెమెరాలను తిప్పేస్తున్నారు.. మైక్‌లు కట్ చేస్తున్నారు.. బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద

శాసనసభ సమావేశాల్లో అధికార పార్టీ తీరుపై కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్ర విమర్శలు చేశారు. అసెంబ్లీ ఆవరణలో మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ 'రేవంత్‌రెడ్డి.. నీకెందుకు అంత భయం?' అంటూ ప్రశ్నించిన కేపీ వివేకానంద, తమ పార్టీ సభ్యులు అసెంబ్లీలో ఏదైనా అంశంపై మాట్లాడుతుండగానే మైకులు కట్ చేస్తున్నారని ఆరోపించారు. అలాగే బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడే సమయంలో కెమెరాలను స్పీకర్ వైపునకు తిప్పి ప్రతిపక్ష గొంతును బయటకు వినిపించకుండా చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడి దగ్గరికి వెళ్లి వీడియోలు తీయించి, అసెంబ్లీ ప్రారంభం కాకముందే వాటిని విడుదల చేస్తూ రాజకీయ డ్రామాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. బయట ప్రతిపక్ష నాయకుడిపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు, లోపల మాత్రం డ్రామాలు ఆడుతున్నారని అన్నారు. కేసీఆర్ గొంతుకై మేము




## అసెంబ్లీ మీడియా పాయింట్

మాట్లాడతాం. తప్పులు సరిదిద్దుకుని పాలన చేయడం ఈ ప్రభుత్వానికి చేతకాదు అని వ్యాఖ్యానించారు.

### కాంగ్రెస్, మజ్లిస్ కుమ్మక్కు అయ్యారు: ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

అసెంబ్లీలో కాంగ్రెస్, మజ్లిస్ కుమ్మక్కు అయ్యారని బిజెపి అర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభలో గంటల తరబడి మైకును మజ్లిస్‌కు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు.అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ కాంగ్రెస్ సెక్యులర్ పదాన్ని మరిచిపోయిందని విమర్శించారు. హిందూ ఎమ్మెల్యేలను విస్మరిస్తుందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఈ విషయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్‌లో హిందూ ఎమ్మెల్యేలకు అవమానం జరుగుతోందని విమర్శించారు. హిందూ ఎమ్మెల్యేలు ఉన్నచోట అభివృద్ధి ఎందుకు జరగడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు.

తమ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.500 కోట్లు ఇచ్చిందని ఓవైసీ అసెంబ్లీ సాక్షి గా చెప్పారని ప్రస్తావించారు. అత్యధిక పన్ను కడుతున్న హిందువుల సొమ్మును ముస్లింలకు దోచి పెడుతున్నారని ఆరోపణలు చేశారు. మూసీ ప్రాజెక్టుకు డీపీఆర్ లేదని.. తోక లేదని ఎద్దేవా చేశారు. దోచుకోవడానికి అప్పుడు కాళేశ్వరం.. ఇప్పుడు మూసీని తెరమీదకు తెచ్చారని దెప్పిపొడిచారు. భూముల ధరలు పెంచుకునేందుకే.. గ్రామాలను పట్టణీకరణ చేస్తోందని అన్నారు. నిజామాబాద్ జిల్లా మీద మట్టిపోయొద్దని హితవు పలికారు. నిజాంసాగర్ పునరుద్ధరణకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పుణ్యకాలం గడిచిపోయిందని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల కాంగ్రెస్ పాలన డీపీఆర్లకే సరిపోతుందని విమర్శించారు.

బీఆర్ఎస్ అవినీతి ఎక్కడ బయట పడుతుందోనని అసెంబ్లీ నుంచి ఆ పార్టీ నేతలు వాకౌట్ చేశారని ఎద్దేవా చేశారు. చిన్న అంశంపైన భయపడి వాకౌట్ చేస్తే ఎలా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పాలమూరు రంగారెడ్డికి జాతీయ హోదా కల్పిస్తామని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలకు హరీష్‌రావు, కవితలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. కవిత సరైన ఆధారాలతో హరీష్‌రావుపై ఫిర్యాదు చేస్తానంటే తాను సపోర్టు చేస్తానని స్పష్టం చేశారు. మండలి చైర్మన్ తక్షణమే కవిత రాజీనామాను ఆమోదించాలని పైడి రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

# పంట మార్పిడి విధానంపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలి

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన రైతు కమిషన్ బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 2:** అసెంబ్లీ సీఎం రేవంత్ రెడ్డి ఛాంబర్ లో రైతు కమిషన్ బృందం కలిసింది. రైతు కమిషన్ ఏర్పాటు చేసినప్పటి నుండి చేపట్టిన కార్యక్రమాలపై సీఎం రేవంత్ రెడ్డి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఊహించిన దానికంటే ఎక్కువగా కమిషన్ ఛైర్మన్, సభ్యులు పనిచేస్తున్నారని కితాబిచ్చారు. రైతుల్లో మరింత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.. రాష్ట్రంలో ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పంట మార్పిడి విధానం, సేంద్రియ వ్యవసాయం చేసేలా కమిషన్ రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆ బాధ్యతను కూడా కమిషన్ తీసుకొని పర్యటనలు చేపట్టాలన్నారు. అవసరం ఐతే కమిషన్కు అదనపు నిధులు కూడా కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో తృణధాన్యాలు, పప్పుదినుసుల సాగు తగ్గుతోందని దాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అలాగే సాంప్రదాయ పంటల విషయంలో కూడా రైతులను ప్రోత్సహించాలని ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. వరికి ఇస్తున్నట్లుగానే అవసరమైతే ఇతర పంటల వైపు వెళ్లే రైతులకు కూడా ప్రోత్సహకాలు ఇవ్వడంపై కూడా ఆలోచన చేస్తామన్నారు. ఇక కమిషన్ ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పర్యటనలు, కేరళ, హర్యానా టూర్ లపై సీఎంకు వివరించారు. ఉద్యానవన పంటల సాగు, కౌలు రైతు విధానంలో కేరళ పాలసీ బాగుందని దానిపై కమిషన్ ఓ నివేదిక సిద్ధం చేస్తున్నట్లు సీఎంకు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి కమిషన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఐతే ఈ రోజు రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి బర్త్ డే విషయం తెలియగానే.. సీఎం రేవంత్ రెడ్డి .. కోదండరెడ్డికి బర్త్ డే విషెస్ చెప్పారు. సీఎంను కలిసిన వారిలో ఛైర్మన్ కోదండరెడ్డి తోపాటు కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, భూమి సునీల్, భవానీ రెడ్డి, కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ వున్నారు.

# మూసీని గోదావరి నీళ్లతో ప్రక్షాళన

### యేడాదంతా నీళ్లు ప్రవహించేలా ప్రణాళిక
### సంక్రాంతిలోగా తొలిదశ డిపిఆర్‌లు పూర్తి
### రక్షణ భూములు 60 ఎకారాలు ఇవ్వడానికి కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సుముఖత
### మూసీ వెంట శివాలయం, మసీదు, గురుద్వారా, చర్చి నిర్మాణాలు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, జనవరి 2 ప్రభాతవార్త :** మూసీ నదిలో కాలుష్యానికి శాశ్వతంగా పరిష్కరిం చడాని రెండేళ్లలో గండిపేటకు గోదావరి నీటిని తీసుకొస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మూసీ నదిపై ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం ఇస్తూ సంక్రాంత్రి లోగా తొలి దశ డిపిఆర్‌లు పూర్తిచేస్తామని తెలిపారు.మూసి నదీతీర అభివృద్ధి ప్రాజెక్టు కోసం సమగ్ర బృహత్ ప్రణాళికను రూపొందించడానికి మెసర్స్ మీన్ హార్ట్ సింగపూర్ ప్రయివేటు లిమిటెడ్ , మెసర్స్ కుష్మన్, వేక్ ఫీల్డ్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్, మెసర్స్ ఆర్ఎఓఎస్ డిజైన్ స్టూడియో ప్రయివేటు లిమిటెడ్ తో కూడిన కన్సార్టియంను ఎంఆర్డిసిఎల్ నియామకం చేసినట్లు తెలిపారు. ఉస్మాన్ సాగర్ నుండి గౌరెల్లి వరకు, హిమాయత్ సాగర్ నుండి బాపూఘాట్ వరకు కన్సార్టియం అధ్యయనం, ప్రణాళిక, విశ్లేషణ, డిజైన్ తయారు చేసి 18 నెలలలోపు ప్రాజెక్టు చేపట్టడానికి వీలైన బ్లూ మాస్టర్ ప్లాన్, గ్రీన్ మాస్టర్ ప్లాన్, లాండ్యూజ్ మాస్టర్ ప్లాన్, మార్క్యు ప్రాజెక్టులు, మౌలిక సదుపాయల మాస్టర్ ప్లాన్, ఆర్థిక మాస్టర్ ప్లాన్ డిపిఆర్లను సమర్పిస్తుందని వివ రించారు. మూసి, ఈసా జలాల సంగమ ప్రదేశంలో మహాత్మా గాంధీ బోధనా తత్వాన్ని కొనసాగేలా చూసేందుకు అంకితమైన ప్రపంచ స్థాయి అనుభవ కేంద్రమైన గాంధీ సరోవర్‌ను 200ఎకారాలలో అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామని అయితే రక్షణశాఖ భూములు ఆనుకొని ఉన్నాయనీ ప్రస్తుతం కాన్సెప్చువల్ ప్లాన్ పూర్తయింది. దీని కోసం రక్షణ శాఖ భూములను సేకరించవలసి ఉంటుంది. భూముల బదిలీకోసం ప్రతిపాదనలను రక్షణ శాఖ అధికారులకు సమర్పించడయింది. కేంద్ర మంత్రి రాజనాథ్‌సింగ్ 60 ఎకరాలు ఇస్తానని హామి ఇచ్చారని చెప్పారు ప్రాజెక్టును 5 జోనులు అనగా జోన్ 1,2,3,4,5 గా విభజించడమయింది. మొదటి దశలోని 55 కి.మీ.లకు గాను 21 కి.మి నిడివితో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుండి బాపూఘాట్ వరకు గల జోన్1 రీచ్ ను ఎంఆర్డిసిఎల్ చేపడుతుంది. ఆసియా అభివృద్ధి బ్యాంక్ రూ.4100 కోట్ల (దాదాపు యుఎస్ 500 ఎం) నిధులను ఇవ్వడానికి అంగీకరించింది. జోన్1 కోసం డిపిఆర్ తయారీ పురోగతిలో ఉంది.మూసీ నదిలోని శుద్ధి చేసిన నీటిని విడుదల చేసే నిమిత్తం రూ.3,188 కోట్ల కోసం ఎన్ఆర్సిపి (జాతీయ నది పరిక్షణ ప్రణాళిక) క్రింద నిధులను ఇవ్వడం కోసం కేంద్ర ప్రభుత్వ జల్ శక్తి మంత్రిత్వశాఖను కోరాము. ప్రాథమిక ప్రాజెక్టు నివేదికను సమర్పించాము. కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతి అందిన మీదట, డిపిఆర్‌ను తయారు చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుంది. హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ నుండి బాపూఘాట్ వరకు నదీ సరిహద్దులను గుర్తించే పని ప్రస్తుతం చేస్తున్నామని రేవంత్ తెలిపారు. సమగ్ర బృహత్ ప్రణాళికలో భాగంగా, పర్యాటకులకు సౌకర్యాలతో పాటు నది వెంబడి ఆకర్షణ, వినోద ప్రదేశాలలో బ్లూ, గ్రీన్ మాస్టర్ ప్లాన్లను పర్యాటకంలో చేస్తున్నామని శివాలయం,గురుద్వారా,మసీదు చర్చి నిర్మాస్తామని తెలిపారు. మూసీ నదిని శుభ్రపరచడం కోసం నివేదిక పురోగతిలో వుంది. తదుపరి ఎస్‌టిపిలు, మురుగునీటి నిరోధం, మళ్లింపు నిర్మాణాలు, ట్రంక్ మురుగు కాలువలు బృహత్ ప్రణాళిక ప్రతిపాదనలో భాగంగా వున్నాయి. హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్బి నీటిని హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ లోకి పంప్ చేయడాన్ని చేపట్టింది. మూసీ నదిలోకి ఎప్పటికప్పుడు విడుదల చేయడానికి 2.5 టిఎంసిలను రిజర్వ్ చేశామని తెలిపారు. మీరాలం చెరువుపై వంతెన నిర్మాణాన్ని మెసర్స్ కెఎన్ఆర్ కన్స్ట్రక్షన్స్ లిమిటెడ్ కు ఇచ్చామని తెలిపారు.

# డ్రిల్ అండ్ బ్లాస్ట్ పద్ధతిలో ఎస్ఎల్‌బిసి పనులు

**హైదరాబాద్,జనవరి 2,ప్రభాతవార్త:** శ్రీశైలం ఎడమగట్టు కాలువ తవ్వకం డ్రిల్ అండ్ బ్లాస్ట్ పద్ధతి అనుసరించేందుకు నిపుణులు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాలను తరలించేందుకు ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు రూపొందించారు. రిజర్వాయర్ నుంచి దిండి రిజర్వాయర్ వరకు మొత్తంగా 43.50 కిలోమీటర్ల సొరంగాన్ని తవ్వాల్సి ఉన్నది. ఏకకాలంలో రెండువైపుల నుంచి ఇన్‌లెట్ అంటే అచ్చంపేట మండలం దోమలపెంట వద్ద శ్రీశైలం రిజర్వాయర్ గట్టు నుంచి, ఔట్‌లెట్ అంటే మహబూబ్‌నగర్ జిల్లా మన్యవారిపల్లె నుంచి సొరంగం పనులు చేపట్టారు. ఇన్‌లెట్ వైపు నుంచి 13.93 కిలోమీటర్ల సొరంగం తవ్వగా, 2025 ఫిబ్రవరి 22న సంభవించిన ప్రమాదంతో ఆ పనులు నిలిచిపోయాయి. దాదాపు 50 మీటర్ల మేర పేరుకుపోయిన శిథిలాలు, మట్టి, రాళ్లను కూడా తొలగించలేని దుస్థితి. ప్రమాదంలో టిబిఎం పూర్తిగా ధ్వంసమైంది. దీనితో మిగిలిన 9కి.మి టన్నెల్ పనులు చేయడంపై తెలంగాణ ప్రభుత్వం ఎన్‌జిఆర్ఐ ఆశ్రయించి నిపుణుల సూచనలమేరకు హెలిమాగ్నెట్ సర్వే చేయాలని కోరింది.

ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ఎదురవుతున్న భూగర్భ అడ్డంకులను గుర్తించేందుకు ఎన్‌జి ఆర్ఐ శాస్త్రవేత్తలు నిర్వహించిన హెలి మాగ్నెట్ సర్వే నిర్వహించింది. తాజాగా నివేదిక తాజాగా నిపుణుల కమిటీకి అందించింది. ప్రత్యేక హెలికాప్టర్ సహాయంతో సుమారు 13 లైన్లలో సర్వే చేపట్టిన శాస్త్రవేత్తలు, భూమి లోపల దాదాపు 800 మీటర్ల లోతు వరకు ఉన్న భూ స్వరూపంపై సమగ్ర సమాచారాన్ని ఈ నివేదికలో పొందుపరిచారు. ఈ సర్వేలో భాగంగా నల్లవాగు సమీప ప్రాంతంలో షీర్ జోన్ ఉన్నట్లు గుర్తించగా, మూడు ప్రాంతాలు మినహా మిగిలిన చోట్ల టన్నెల్ నిర్మాణానికి అనుకూలమైన పరిస్థితులు ఉన్నట్లు సమాచారం అందింది.భూగర్భ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం ఇప్పుడు టన్నెల్ తవ్వకం విధానం మార్పుచేయాలనే నిపుణులు సూచిస్తున్నట్లు తెలిసింది.ప్రస్తుతం ఉపయోగించే టన్నెల్ బోరింగ్ మిషన్ కంటే కొత్తగా మేలైన విధానం అనుసరించాలని చూస్తోంది, మిగిలి ఉన్న 9 కిలోమీటర్ల టన్నెల్ పనులను పూర్తి చేయడానికి డ్రిల్ అండ్ బ్లాస్ట్ పద్ధతిని ఎంచుకునే అవకాశం ఉంది. ఇందులో భాగంగా మన్నేవారిపల్లి వైపు నుంచి ప్రస్తుత టిబిఎం మిషన్ను తొలగిం చేందుకు అవసరమైన చర్యలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. నిపుణుల కమిటీ ఈ నివేదికను పరిశీలించిన తర్వాత, మరో రెండు మూడు రోజుల్లో శ్రీశైలం ఎడమగట్టు కాలువ టన్నెల్ నిర్మాణ పనులలో కీలక అడుగు పడబోతుందని భావిస్తున్నారు.

# నర్సింగ్ విద్యార్థినిపై ఇంటర్న్‌షిప్ డాక్టర్ లైంగిక దాడి

**లక్నో,జనవరి 2:** నర్సింగ్ విద్యార్థినిపై లక్నో ప్రభుత్వ మెడికల్ ఇన్స్‌టిట్యూట్‌లో పనిచేస్తున్న ఇంటర్న్ డాక్టర్ అత్యాచారం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.



పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసినట్లు డాక్టర్‌పై ఫిర్యాదు నమోదు అయ్యింది. నర్సింగ్ విద్యార్థిని ప్రైవేటు ఫోటోలను లీక్ చేస్తానని ఆ డాక్టర్ బెదిరించాడు. అయితే ఆ ఇంటెర్న్ డాక్టర్‌కు చెందిన బ్యాక్‌గ్రౌండ్, అడ్రస్‌ను వెరిఫై చేస్తున్నామని డీసీపీ విశ్వజీత్ శ్రీవాత్సవ్ తెలిపారు. అతన్ని ట్రాక్ చేస్తున్నట్లు చెప్పారు. మెజిస్ట్రేట్ ముందు నర్సింగ్ స్టూడెంట్ వాంగ్మూలం రికార్డు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఖైసర్‌బాగ్ పోలీసు స్టేషన్ వద్ద ఆ డాక్టర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆ స్టూడెంట్‌తో డాక్టర్ లైంగిక సంబంధం పెట్టుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లి చేసుకోవాలని వత్తిడి చేయగా సోషల్ మీడియాలో ఫోటోలు లీక్ చేస్తానని డాక్టర్ బెదిరించినట్లు తెలిసింది. గత రెండు వారాల్లో ఆ ఇన్స్‌టిట్యూట్‌లో ఇలాంటి కేసు నమోదు కావడం ఇది రెండోది. లవ్ జిహాదీ కేసు కూడా ఆ ఇన్స్‌టిట్యూట్‌లో నమోదు అయ్యింది. పెళ్లికి ముందు మతం మార్చుకోవాలని ఓ డాక్టర్ మరో డాక్టర్‌ను వత్తిడి చేశాడు. ఆ బాధితురాలితో సీఎం యోగి మాట్లాడారు. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

# మూసీ కంపు కంటే ముఖ్యమంత్రి మాటలు కంపు

### మూసీ సుందరీకరణపై ఎంత ఖర్చు చేస్తున్నారు?
### మూసీలో పోసే నీళ్లు ఎక్కడ నుంచి తెస్తున్నారు?
### బిఆర్‌ఎస్‌ఎల్‌పి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు



**హైదరాబాద్,జనవరి 2,ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు మూసీ కంటే కంపుగా ఉన్నాయని బిఆర్‌ఎస్‌ఎల్‌పి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. సభలో ఉన్న సభ్యులందరికీ సమానమైన హక్కులు ఉంటాయని ఆయన తెలిపారు. సభ్యుల హక్కులను కాపాడాల్సింది స్పీకరేనని స్పష్టం చేశారు. ఏడు రోజులు సభ నడుపుతామనిబిఏసిలో చర్చించామని ఐతే బిఏసి కాపీలో 7 రోజులు అని ఎక్కడా లేదని పేర్కొన్నారు. సభ ఎజెండా వివరాలు అర్ధరాత్రి 2 గంటలకు వస్తే సభ్యులు ఎలా ప్రిపేర్ అవుతారని ఆయన ప్రశ్నించారు.అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మూసీ సుందరీకరణ అంశంపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని అంటూ చేసిన వ్యాఖ్యపై హరీష్‌రావు స్పందిచడానికి స్పీకర్ అనుమతి ఇవ్వలేదు. దీనిపై బిఆర్‌ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చివేస్తే బిఆర్‌ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. అవసరమైతే బుల్డోజర్ల కింద పడుకుని కూల్చివేతలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వం రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్ ఇవ్వకుండా,మరోవైపు విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు ఇవ్వకుండా మూసీ నది సుందరీకరణ అంటూ అడ్డగోలుగా బుల్డోజర్‌లు పెట్టి ఇళ్ళు కూల్చివేస్తున్నారని ఇంతకు ఎంత మొత్తం ఈ ప్రాజెక్టుపై ఖర్చుపెడుతున్నారని ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణకు లక్ష కోట్లు అని ఒక సారి లక్షా50వేల కోట్లు అని మరొకసారి అంటున్నారని ఇందులో ఏది కరెక్టు అని ఆయన అడిగారు.దీని కోసం ఇప్పటి వరకు ఎన్ని ఇళ్ళు కూల్చారు వాటికి ఎంత మొత్తం 2013 భూసేకరణ చట్టం అనుసరించి చెల్లింపులు చేశారు. కెసిఆర్ కట్టిన డబుల్ బెడ్ రూమ్‌లు కాదు వారికి ఇవ్వాల్సింది వ్యక్తికి రూ.14.50లక్షల రూపాయలు,రీ సెటిల్‌మెంట్ కింద రెండువందల గజాల భూమి అని ఆయన చెప్పారు. మూసి ప్రక్షాళన కోసం 32కోట్లతో 39 ఎస్‌టిపిలు నిర్మించామని వికరాబాద్‌లో వాటి నిర్వహణ లేక పంపులు మోటార్లు కూడా పీక్కపోయారని ఇప్పుడు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లోకి వికరాబాద్ డ్రైనేజి సీవరేజి వాటర్ పెద్ద ఎత్తున చేరుతోందని అదే మనం నీటిని తాగుతున్నామని హరీష్‌రావు చెప్పారు. మూసీ గేట్లు ఆలస్యంగా ఎత్తడానికి కారణం ఎవరు వారిపై ఏమైనా చర్యలు తీసుకొన్నారా అని హరీష్ అడిగారు. అసలు జంట జలాశయాల్లోకి ఎంత వరద నీరు వస్తుందో తెలుసా అని ప్రశ్నించారు. ఒకేసారి ఉద్దేశపూర్వకంగా జలాశయాల గేట్లు ఎత్తారా అని నిలదీశారు. మూసీ పరివాహక ప్రాంతంలోని ఇండ్లను ముంచడానికే గేట్లు తెరిచారా అని అడిగారు. మూసీలోకి నీళ్లు తీసుకొస్తామని మంత్రి చెప్పారని హరీశ్‌రావు తెలిపారు. రెండున్నర టీఎంసీల గోదావరి జలాలను ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మల్లన్న సాగర్ నుంచి తీసుకొస్తున్నారా? లేదా గాలిలో నుంచా అని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు ఎంత ఖర్చు పెట్టాలని ప్రభుత్వం అనుకుంటుందో సమాధానం చెప్పాలన్నారు.

# నేటి నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు

### హాజరవుతున్న వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు
### ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా విశ్వయోగి విశ్వంజీ
### ప్రతిభావంతులకు 80 పూర్ణకుంభ పురస్కారాలు, 40 విశిష్ట పురస్కారాలు
### 3 రోజులపాటు సాహితీ సదస్సులు, అవధానాలు, సంగీత కార్యక్రమాలు

**విజయవాడ, జనవరి 2, ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాషకు ప్రాధాన్యతను, అవశ్యకతను వివరించే దిశలో తెలుగువారి ఆత్మీయ పండుగకు గుంటూరు సర్వాంగ సుందరంగా ముస్తాబయింది,. జనవరి 3, 4, 5 తేదీల్లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరిగాయి.శనివారం ఈ సభలు అంగరంగ వైభోగంగా ఆరంభమవుతున్నాయి.ఈ సభలకు తెలుగువారి అనురాగ సంగమంగా నామకరణం చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.3వ తేది విశ్వయోగి విశ్వంజీ ముఖ్య అతిధిగా ప్రారంభ సభలో పాల్గొంటారు.కీలక సభలో జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహా ముఖ్య అతిధిగా స్పీకరు చింతకాయల అయ్యన్న పాత్రుడు, విశిష్ట అతిధిగా, కేంద్రమంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కింజరపు అచ్చన్నాయుడు, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొంటారు. సభలో తెలుగుభాష అభ్యున్నతి, పరిరక్షణకు విశేష కృషి చేసిన సంస్థలు, ప్రతిభావంతులకు 80 పూర్ణకుంభ పురస్కారాలు, 40 విశిష్ట పురస్కారాలతో పాటు జీవన సాఫల్య పురస్కారాలనూ ప్రదానం చేయనున్నారు. వెయ్యిమంది కవులతో అమరావతికి సహస్ర కవితా నీరాజనం సమర్పించనున్నారు. దీనికితోడు పండితులతో సైతం అవధానం సాగనుంది జనవరి 4వ తేదీన మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ ఈ కార్యక్రమానికి హాజరై మంచి సందేశం ఇస్తారని గజల్ శ్రీనివాస్ తెలిపారు. మారిషస్‌లో ఎక్కువమంది తెలుగువారు ఉండడంతో ఆహ్వానించామని గజల్ శ్రీనివాస్ చెప్పారు. అంతేకాకుండా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పూర్వపు సీజేఐ జస్టిస్ ఎన్.వి. రమణతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తులు, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి నలుగురు గవర్నర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ రాష్ట్రాల ఎంపీలు సైతం హాజరవుతారని గజల్ వివరించారు. 5వ తేది సీఎం చంద్రబాబునాయుడు ఈ సభలో పాల్గొంటారు. వీవీఐపీల కోసం ప్రత్యేకంగా సభావేదికల వద్ద మూడు క్యాప్సూల్ హోమ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఇంటిని తలపించేలా షవర్లు, బెడ్‌రూమ్, బాల్కనీ వంటి వసతులన్నీ ఉన్నాయి. అతిథుల కోసం గుంటూరు పరిసరాల్లో 3,000 గదులను నిర్వాహకులు ఇప్పటికే సిద్ధం చేశారు. మొత్తం మూడు రోజుల పాటు దాదాపు 25,000 మంది యువతీ యువకులతో తెలుగు భాషపై వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

# ఇందుకే కమ్యూనిస్టులు ప్రజల ఆదరణ కోల్పోయారు

### అసెంబ్లీలో కూనంనేని వ్యాఖ్యలు సరికాదు: బండి సంజయ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 2:** కేంద్ర ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించడంతో పాటు, పథకం విధానాన్ని మార్చడంపై తెలంగాణ అసెంబ్లీలో నిరసన వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. మోడీకి చిప్ దొబ్బిందని.. ఇకనైనా మైండ్ సెట్ మార్చుకుంటే బెటర్ అని కూనంనేని మాట్లాడారు. తాజాగా ఈ వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. అసెంబ్లీలో ఇలాంటి మాటలకు స్థానం లేదని ఖండించారు. ఇలాంటి మాటలతోనే సమాజంలో కమ్యూనిస్టులు ప్రజల ఆదరన కోల్పోయారని అన్నారు. కూనంనేని సాంబశివ రావు తక్షణమే ఆయన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి.. ప్రధాని మోడీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ నాయకత్వంలో భారత్ అన్ని రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు మాత్రం రాజకీయ దూషణలకే పరిమితమై ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయని విమర్శలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో అలాంటి వ్యాఖ్యలను అనుమతించ డమే కాకుండా ఆ మాటలను ఆస్వాదిస్తూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నవ్వడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ధ్వజమెత్తారు. తక్షణమే ఈ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోడీపై కూనంనేని చేసిన వ్యాఖ్యలపై సభలో వెంటనే బిజెపి ఎమ్మెల్యేలు ఆందోళన చేశారు.

స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. రికార్డుల నుంచి కూనంనేని వ్యాఖ్యలను తొలగించాలని కోరారు. స్పీకర్ స్పందిస్తూ పరిశీలించి రికార్డుల నుంచి తొలగిస్తానని పేర్కొన్నారు.

# ఉమ్మడి కమిటీ ఏర్పాటులో తెలంగాణకు నష్టం: హరీశ్‌రావు వ్యాఖ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జనవరి 2:** నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు కుమ్మక్కై తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. బనకచర్ల ముప్పును ముందుగా పసిగట్టింది బీఆర్ఎస్ పార్టీయేనని, తాము ముల్లుకర్రతో కాదు బల్లెంతో పొడిస్తే తప్ప ఈ ప్రభుత్వం నిద్రలేవలేదని ఆయన ధ్వజమెత్తారు. అనేక ప్రెస్ మీట్లు పెట్టి హెచ్చరించినా ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు.తమ పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఏపీ, తెలంగాణతో సమావేశం ఏర్పాటు చేసిందని హరీశ్ రావు తెలిపారు.మేము వద్దని ఎంతగా వారించినా రేవంత్ రెడ్డి ఢిల్లీ సమావేశానికి వెళ్లారు. బనకచర్ల అంశం ఎజెండాలో లేదని మొదట బుకాయించారు. కానీ, మేము ఎజెండాను బయటపెట్టి వాస్తవాలను బట్టబయలు చేశాం. ఆ తర్వాత ఏపీ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా బనకచర్లపై చర్చ జరిగిందని, కమిటీ వేశారని చెప్పడంతో రేవంత్ రెడ్డి అబద్ధం బట్టబయలైంది అని హరీశ్ వివరించారు.

# ప్రత్యక్ష పన్నుల కింద కేంద్రానికి రూ.97 వేల కోట్లు

**హైదరాబాద్, జనవరి 2, ప్రభాతవార్త :** రాష్ట్రం నుండి కేంద్రానికి భారీ ఆదాయం సమకూరు తోంది. ప్రతీ ఆర్థిక సంవత్సరంలోనూ ప్రత్యక్ష పన్నుల ఆదాయం తెలంగాణ నుండి కేంద్రానికి గణనీయంగా పెరుగుదల నమోదవుతోంది. ఏడాదికి దాదాపు రూ.50 వేల కోట్లు ప్రత్యక్ష పన్నుల ఆదాయం పెరగడం విశేషం. అయితే ఇదే సమయంలో కేంద్ర నుండి రావాల్సిన గ్రాంట్లలో పెరుగుదల కనిపించడం లేదు. ఆర్థిక శాఖ అధికారవర్గాల సమాచారం ప్రకారం రాష్ట్రం నుండి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.97 వేల కోట్లకు పైగా ప్రత్యక్ష పన్నుల ఆదాయం కేంద్రానికి సమకూరింది. 2023-24 వార్షిక సంవత్సరంలో రూ. 35,433 కోట్లు ప్రత్యక్ష పన్నుల కింద కేంద్ర ప్రభుత్వానికి ఆదాయం రాగా, 2023-24లో అది రూ.84,439 కోట్లకు చేరింది. గత ఆరేళ్లలో ప్రత్యక్ష పన్నులు, సెంట్రల్ జీఎస్టీ, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ రూపంలో తెలంగాణ నుండి కేంద్రానికి రూ.4.35 లక్షల కోట్లు రాగా, కేంద్రం నుండి వివిధ పథకాల కింద రాష్ట్రానికి రూ.3.17 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి. కేంద్రం నుండి తెలంగాణకు వచ్చిన వాటిల్లో కేంద్ర పన్నుల్లో వాటా రూ.1.17 లక్షల కోట్లు, వివిధ కేంద్ర పథకాల ద్వారా రూ.1.22 లక్షల కోట్లు రాగా, కేంద్ర ప్రాయోజిత పథకాల కోసం 2019-20 నుండి 2024-25 వరకూ రూ.81 వేల కోట్లకు పైగా వచ్చాయి.

# గ్రోక్‌లో అసభ్య కంటెంట్ తొలగించాలంటే కేంద్రం నోటీసులు

### లేదంటే చర్యలు తప్పవని ఎక్స్ ఇండియా హెడ్‌కు హెచ్చరిక

**న్యూఢిల్లీ, జనవరి 2:** బిలియనీర్ ఎలాన్ మస్క్ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్‌కు చెందిన ఏఐ చాట్‌బాట్ గ్రోక్ లో అసభ్యకర కంటెంట్‌పై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. గ్రోక్ సృష్టించిన అసభ్య, అశ్లీల, చట్టవిరుద్ధ కంటెంట్‌ను వెంటనే తొలగించాలని కేంద్ర ఎలక్ట్రానిక్, సమాచార, సాంకేతిక శాఖ నోటీసులు జారీ చేసింది. తీసుకున్న చర్యల నివేదికను 72 గంటల్లో అందజేయాలని, లేదంటే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఐటీ చట్టంలోని నిబంధనలు పాటించలేదంటూ ఎక్స్ భారత ప్రతినిధికి నోటీసులు జారీ చేసింది. ఐటీ చట్టం2000, ఐటీ (ఇంటర్మీడియరీ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) నిబంధనలు2021ను ఎక్స్ సరిగ్గా అమలు చేయడం లేదని కేంద్రం పేర్కొంది. ముఖ్యంగా అశ్లీల, అసభ్య, పోర్నోగ్రాఫిక్, బాలలపై దౌర్జన్యానికి సంబంధించిన కంటెంట్ విషయంలో తగిన నియంత్రణ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని పేర్కొంది. నకిలీ ఖాతాలతో గ్రోక్ ఏఐని ఉపయోగించి మహిళల ఫొటోలు, అసభ్యకర వీడియోలు సృష్టిస్తున్నట్లు పేర్కొంది. దుర్వినియోగం మహిళల గౌరవం, గోప్యత, భద్రతను తీవ్రంగా ఉల్లంఘిస్తోందని స్పష్టం చేసింది. కేవలం నకిలీ ఖాతాలకే పరిమితం కాకుండా, నిజమైన ఖాతాలపై ఉన్న మహిళల చిత్రాలను కూడా ఏఐ ప్రాంప్ట్‌ల ద్వారా వికృతంగా మార్చి ప్రచారం చేస్తున్నారని నోటీసులో పేర్కొంది. ఎక్స్ లో అసభ్యకర కంటెంట్‌కు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఇతర భాగస్వామ్య పక్షాల నుంచి ఎప్పటికప్పుడు ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయని పేర్కొంది.

# 52.82 లక్షల మందికి 'గృహాలక్ష్మి'

>> కేంద్రం, ఇతర రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న ఛైల్డ్ కేర్ లీవ్‌లపై పిఆర్‌సి కమిటీని నివేదిక కోరామని, పిఆర్‌సి కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని డిప్యూటీ సీఎం సభకు తెలిపారు. బిజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ప్రశ్నిస్తూ..మార్చి 31, 2024 నుంచి ఇప్పటి వరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఎంత మంది, వారిలో టీచర్లు ఎంత మంది ఉన్నారని ప్రశ్నించారు. అలాగే వారికి ఫించన్ ప్రయోజనాలను వెంటనే చెల్లిస్తున్నారా? అని ప్రశ్నించారు. ఇందుకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పందిస్తూ.. రాష్ట్రంలో మార్చి 31, 204 నుంచి ఇప్పటి వరకు 13,323 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయగా.. అందులో 7177 మంది టీచర్లు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఎప్పటికప్పుడు ఫించన్ ప్రయోజనాలను మంజూరు చేసి, పెన్షన్‌దారులకు అందిస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. కరీంనగర్ జిల్లాలో గల కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటనీ.. అభివృద్ధి పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయని బిఆర్‌ఎస్ సభ్యుడు ఎలగందుల రమణ ప్రశ్నించారు. ఇందుకు దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ సమాధానమిస్తూ కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో 11 రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. వాటిలో ఇప్పటికే 8 పనులను పూర్తి చేసినట్టు తెలిపిన మంత్రి.. మరో 3 పనులను రానున్న రెండేళ్లల్లో పూర్తి చేయనున్నట్టు మంత్రి సభకు తెలిపారు. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటనష్టం వివరాలేంటి.. పంటనష్టపోయిన రైతులను ఏ రకంగా ప్రభుత్వం ఆదుకున్నదని సభ్యులు తీన్మార్ మల్లన్న, తక్కెళ్లపల్లి రవీందర్ రావు వ్యవసాయ శాఖ మంత్రిని ప్రశ్నించారు. ఇందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానమిస్తూ.. రాష్ట్రంలో ఈ ఏడాది ఆగస్టు, అక్టోబర్‌లో భారీ వర్షాల మూలంగా పంటనష్టం జరిగిందని సభకు తెలిపారు. భారీ వర్షాల కారణంగా వ్యవసాయ, ఉద్యానవన పంట నష్టానికి బాధిత రైతులందరికీ ఇన్‌ఫుట్ సబ్సిడీ చేశామన్నారు. ఇందుకు సంబంధించి జీవో 68 ద్వారా రూ. 122,33,16,000 కోట్లను మంజూరు చేయగా.. జీవో నంబర్ 69 ద్వారా రూ. 109,28,61,000 మంజూరు చేసినట్టు మంత్రి తెలిపారు. ఆ తరువాత రూ. 24,13,81,892 మంజూరు చేయడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభకు తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొనుగోలు కోసం ప్రత్యేకంగా యాప్‌ను ప్రారంభించారా? తద్వారా రాష్ట్రంలో ఎంతమంది రైతులకు యూరియాను అందించారని బిఆర్‌ఎస్ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమాధానమిస్తూ.. రాష్ట్రంలో యూరియా కొనుగోలు కోసం ప్రత్యేక యాప్‌ను ప్రారంభించామని, నల్గొండ, జనగాం, మహబూబ్‌నగర్, పెద్దపల్లి, ఆదిలాబాద్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. రైతులకు రైతునేస్తం, రైతు వేదిక, విస్తరణ అధికారులు నియోగించబడిన వాలెంటీర్లతో హెల్ప్ డెస్క్‌ల ద్వారా రైతులకు యాప్‌పై శిక్షణను అవగాహనను కల్పిస్తున్నామన్నారు. యాప్ ద్వారా 1.04 లక్షల మంది రైతులు యూరియాను బుక్ చేసుకున్నారని .. 3 లక్షల బ్యాగుల యూరియాను కొనుగోలు చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో యూరియాకు ఎక్కడా కొరత లేదన్నారు. యూరియా కొరత ఉన్నట్టు కొందరు కావాలని అలా చూపిస్తూ.. రాజకీయలబ్ధి పొందాలని చూస్తున్నారని మంత్రి మండిపడ్డారు. సుమారు 2 గంటలపాటు ప్రశ్నోత్తరాలు జరిగాయి. ప్రశ్నోత్తరాలు ముగిసిన అనంతరం సభను టీ విరామానికి వాయిదా వేస్తున్నట్టు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు.

# రైతుల మేలుకోసమే రీ సర్వే



## అంపోలులో 4 వ విడత రీసర్వే ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**శ్రీకాకుళం, జనవరి 2 ప్రభాతవార్త:** కుటుంబంతో ఎలాంటి రక్త సంబంధాలు కొనసాగిస్తామో అలాంటి బంధమే భూములతో కూడా ఉంటుందని.. ఆ బంధాన్ని బలపరిచే భాద్యత కూటమి సర్కారు తీసుకుందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ అన్నారు. గార మండలం అంపోలు గ్రామంలో జరిగిన రీ సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో కలసి పాల్గొన్నారు. సభా కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన ర్యాలీలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. సభలో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు 2026 సంవత్సరంలో కేంద్ర మంత్రి హోదాలో తాను పాల్గొంటున్న తొలి అధికారిక కార్యక్రమం ఇది అని, జిల్లాలో కీలకంగా ఉండే అంపోలులో ఇది జరగడం ఆనందంగా ఉందని చెబుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర మంత్రిగా గడచిన 18 నెలలు దేశమంతా క్షణం తీరిక లేని పర్యటనలు చేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని స్పష్టం చేశారు. ఎంతమంది ప్రజా ప్రతినిధులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా అనేక భూ సమస్యలు ఇంకా ఉండనే ఉన్నాయని, సమయం, ఖర్చులు, ప్రయాసలు పెరుగుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రీ భూ సర్వే ద్వారా అన్ని సమస్యలు పరిష్కారం అవ్వాలని ఆకాంక్షించారు. గతంలో మాదిరిగా భూ సమస్యల పరిష్కారానికి ప్రజలు ప్రభుత్వం వద్దకు వెళ్ళే విధంగా కాకుండా ఈ సారి భిన్నంగా ప్రజల వద్దకే ప్రభుత్వం వచ్చే ఏర్పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేశారని ఈ గొప్ప ఆలోచనతో శతశాతం సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు ఆస్కారం లేదని తెలిపారు. జిల్లాను అభివృద్ధి చెయ్యాలని అధికార యంత్రాంగం శ్రమిస్తున్నా వారికి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు సవాల్ విసురుతున్నాయని స్పష్టం చేశారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేలా స్థానిక ప్రజలు సైతం సహకారం అందించాలని తెలిపారు. గత వైఎస్సార్సీపి ప్రభుత్వ హయాంలో భూ సర్వే పేరుతో అనేక తప్పులు జరిగాయని ఆరోపించారు. గతంలో ఆరు వందల గ్రామాల్లో రీసర్వే జరిగితే ఎవరికీ సంబం ధ ంలేదా.

## అమరావతిలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాజధాని ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు, నీరు నిల్వలు ఏర్పడకుండా ఉండేందుకు చేపడుతున్న వరద నియంత్రణ చర్యల్లో భాగంగా, ఉండవల్లి గ్రామం వద్ద ‘పంపింగ్ స్టేషన్-2 నిర్మాణానికి టెండర్లను ప్రభుత్వం ఖరారు చేసింది అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును జోన్-8 పరిధిలో నిర్మించనున్నారు. ఈ పంపింగ్ స్టేషన్ ద్వారా వరదల సమయంలో సుమారు 8,400 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి పంపించేలా డిజైన్ చేశారు. వర్షాకాలంలో రాజధాని ప్రాంతంలో నీటి ముంపు ఏర్పడకుండా ముందస్తు రక్షణ కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం.ఈ పనులకు సంబంధించిన టెండర్లలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థ ఎల్1 బిడ్‌గా నిలవడంతో, ఆ సంస్థకే ప్రాజెక్టు బాధ్యతలను అప్పగిస్తూ తిదీదిలి నిర్ణయం తీసుకుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా ఆమోదం తెలిపింది.

# తిరుమల సమాచారం

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.20లక్షలు విరాళం

**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన రైడాన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ వంగల హర్షవర్ధన్ 10లక్షలు రూపాయలు ఎస్వీ ప్రాణ దానట్రస్ట్‌కు, గ్లోబల్ మ్యాను ఫాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ డైరెక్టర్ నేలబొట్ల శుభ సౌజన్య బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి 10లక్షలు రూపాయలు డిడిలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. ఆ సంస్థల తరపున ప్రతినిధులు కుప్పాల గిరిధర్‌కుమార్ విరాళాలిచ్చారు.



## ‘వైకుంఠవాకిలి’ దర్శనం ముక్తికి సోపానం : ప్రముఖులు



**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోపల పవిత్రమైన వైకుంఠవాకిలిద్వారా శ్రీవారిని దర్శించుకోవడం ఆనందకరమని పలువురు ప్రముఖులు తెలిపారు. భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్‌ఛంద్రచందూర్కర్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గడి ప్రవీణ్‌కుమార్,సింగర్‌మన్యచంద్రన్, ఐఎఎస్ కార్తికేయమిశ్ర కుటుంబసభ్యులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. వైకుంఠద్వార దర్శనంద్వారా శ్రీవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేశం అభివృద్ధిలో ప్రపంచంలోనే మూడవస్థానం: నటుడు సుమన్



**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ ఖ్యాతిని, అన్ని రంగాల్లో అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రపంచంలోనే ఒక గుర్తింపు తీసుకువచ్చిన ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం ప్రజల్లో విశ్వాసం చూరగొందని సినీనటుడు సుమన్ తెలిపారు. రాజకీయంగా తాను మాట్లాడటం లేదని, అభివృద్ధి చేసే నాయకుల వైపే నిజాలు మాట్లాడుతున్నానన్నారు. దేశం అభివృద్ధిలో మూడవస్థానంలో ఉండటం దేశ ప్రజలు కూడా మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు కాదని, మంచిచేసే వారిని ప్రజలు గుర్తించుకుంటారన్నారు. ప్రజలు జరుగుతున్న మంచి ,అభివృద్ధికి గర్వపడాలన్నారు.అన్నమయ్యచిత్రంలో శ్రీవారి పాత్ర పోషించడం తన జన్మధన్యత అని, ప్రస్తుతం చేస్తున్న పాత్రలన్నీ టైంపాస్‌మాత్రమేనని అన్నారు. ప్రస్తుతం 11చిత్రాల్లో నటిస్తున్నా అది నామామాత్రంగా అన్నారు. వైకుంఠద్వారంలో ఏడుకొండలస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని సుమన్ తెలిపారు. శుక్రవారం ఉదయం సినీదర్శకులు గోపీచంద్, బాబి,కోన వెంకట్, మ్యూజిక్ దర్శకుడు థమన్, గాయకుడు చిన్నికృష్ణ శ్రీవారిని దర్శించుకున్నారు.

# రాష్ట్రంలో గణనీయంగా పెరిగిన జిఎస్టీ వసూళ్లు

### - జిఎస్టీ వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి. గత ఏడాది డిసెంబరు(2025) నెలలో ఆంధ్రప్రదేశ్ అత్యధిక నికర వసూళ్లను సాధించింది. జీఎస్టీ విధానం ప్రారంభమైన తర్వాత గత నెలలో రూ.2,652 కోట్ల వసూళ్లతో రికార్డు సృష్టించింది. అంతే కాదు గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ప్రతి నెలా అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే అధిక వసూళ్లు సాధించింది. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు, వస్తు వినియోగం పెరిగిందనేందుకు ఇది సంకేతమని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ ఎ.బాబు పేర్కొన్నారు. దక్షి ణాది రాష్ట్రాల్లో జీఎస్టీ వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. తమిళనాడు 7.85 వృద్ధితో తొలిస్థానంలో ఉంది. కర్ణాటక (5.12 ), కేరళ (3.69 ), తెలంగాణ (2.45 )లను దాటి ఆంధ్రప్రదేశ్ వృద్ధి సాధించడం విశేషం. ఆటోమొబైల్, సిమెంట్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 23.69 వృద్ధి కనిపించింది. గత ఏడాది డిసెంబరులో ఎస్‌జీఎస్టీ వసూళ్లు రూ.1,102 కోట్లకు చేరుకున్నాయి. 2024 డిసెంబరుతో పోలిస్తే 2.46 వృద్ధి నమోదైంది. ఐజీఎస్టీ సర్దుబాట్లు కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచాయి. ఐజీఎస్టీ సర్దుబాట్ల రూపేణా రాష్ట్రం రూ.1,549 కోట్ల ఆదాయం రాబట్టింది. 2024 డిసెంబరు నెలతో పోలిస్తే ఇందులో 8.29 వృద్ధి ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా రూ.1,448 కోట్ల ఆదాయం వచ్చింది. అంతకుముందు ఏడాది డిసెంబరుతో నెలతో పోలిస్తే 3.89 వృద్ధి ఉంది. వృత్తి పన్ను వసూళ్లలోనూ 2025 డిసెంబరు చక్కని ఫలితాలు కనబరిచింది. అంతకుముందు ఏడాది డిసెంబరుతో పోలిస్తే 38.32 వృద్ధి నమోదైంది. జీఎస్టీ నికర, స్థూల వసూళ్లలో తొలి త్రైమాసికంలో తగ్గుదల కనిపించగా ఆ పరిస్థితులను తారుమారు చేసి వృద్ధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు కారణమయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు.దిగుమతులను మినహాయించి పరిశీలిస్తే దేశంలో సగటున 5.61 వృద్ధి రేటు నమోదు కాగా ఆంధ్రప్రదేశ్‌లో అదికంగా 5.78 ఉన్నాయి. జాతీయ వృద్ధి రేటును దాటి రాష్ట్రంలో జీఎస్టీ నికర వసూళ్లు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు 9 నెలల కాలంలో మొత్తం రూ.39,517 కోట్ల జీఎస్టీ వసూళ్లు రాష్ట్రంలో సాధ్యమయ్యాయి. అందులో కేంద్రానికి, ఇతరత్రా వెళ్లే వాటిని మినహాయిస్తే రూ.25,926 కోట్ల నికర జీఎస్టీ ఖజానాకు చేరింది.

# 15 భారీ వృక్షాలను తిరిగి నాటే ప్రయత్నం

### వందల సంవత్సరాల నుండి ఉన్న చెట్లను పరిరక్షిస్తూ మిషన్ పునర్వ వనం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్..



**ఎలమంచిలి, జనవరి 02, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న వందల సంవత్సరాల వయసు కలిగిన చెట్లకు పునర్ జీవం కలిగించే మిషన్ పునర్వ వనం కార్యక్రమాలను భావితరాలకు తెలియజేయవలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. అచ్యుతాపురం నుండి అనకాపల్లి రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న పురాతన చెట్లను వేరొక చోటకి తరలించి సంరక్షి ంచే మిషన్ పునర్వ వనం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు విస్తరణలో తొలగించాలని ఆలోచన వచ్చినప్పుడు చెట్లకు జీవం పోయాలని ఆలోచనతోనే రూపొందించిన మిషన్ పునర్వ వనం మంచి ఆలోచన అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి రూపకల్పన, ఆలోచన చేసిన శాసనసభ్యులు సుందర విజయకుమార్ను ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. వందల సంవత్సరాల వయసు కలిగి, ప్రజలతో ఎంతో అనుబంధం కలిగిన చెట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం గూర్చి విద్యార్థులకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ మానవ మనుగడకు సరైన జీవన విధానానికి ముఖ్యమైనవి గాలి నీరు ఆహారం చెబుతున్నామని కోటమే ప్రభుత్వంలో అభివృద్ధితో పాటుగా పకృతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడాన్ని మనం చూస్తూనే ఉంటున్నామన్నారు. జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో ఇప్పటికే ఎమ్మెల్యేగా తన అధికారం చేపట్టినప్పుడు నుండి 30000 పైచిలుకు మొక్కలు నాటామన్నారు.

# ఎస్‌పిడిసిఎల్‌లో 46 మందికి పదోన్నతులు

### - చీఫ్ ఇంజనీర్లుగా కృష్ణారెడ్డి, సంపత్ కుమార్



**తిరుపతి, జనవరి 2 ప్రభాతవార్త:** ఎస్‌పిడిసిఎల్‌లో 46 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తూ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సూపరింటెండింగ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న ఎం. కృష్ణారెడ్డికి చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) గానూ, శ్రీసత్యసాయి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న కే. సంపత్ కుమార్ కు చీఫ్ జనరల్ మేనేజర్ (క్వాలిటీ కంట్రోల్ !! ప్లానింగ్) గానూ పదోన్నతి కల్పించారు. అదేవిధంగా తిరుపతి సర్కిల్ ఎంఆర్ టి విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న పి. రవికుమార్ కు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎంక్వైరీ !! అసెస్మెంట్) గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నెల్లూరు సర్కిల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న కె. వెంకట పవన్ కుమార్ కు తిరుపతి ఎంఆర్ టి విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పదోన్నతి కల్పించారు. వీరితోపాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న సి. హరి ప్రసాద్, సి. విజయ వెంకటేష్ లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గానూ, జూనియర్ ఇంజనీర్ స్థాయి నుంచి అసిస్టెంట్ ఇంజనీర్లుగా 28 మందికి, గ్రాడ్యుయేట్ జూనియర్ ఇంజనీర్ నుంచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా 6 మందికి, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ నుంచి పర్సనల్ ఆఫీసర్లుగా నలుగురికి, జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా ఇద్దరికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గంటెల సుమన కన్నుమూత



**విశాఖపట్నం, జనవరి 2 ప్రభాతవార్త:** పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నేత గంటెల సుమన (68) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, విశాఖపట్నంలోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆమె మృతితో పాయకరావుపేట నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి.విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి1983లో టీడీపీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా విజయం ఆమె మృతి పట్ల పలువురు నేతలు, కార్యకర్తలు సంతాపం గంటెల సుమన 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో పాయకరావుపేట (ఎస్సీ రిజర్వ్‌డ్) నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తన పదవీకాలంలో 1984లో నక్కపల్లిలో బాలికల కోసం గురుకుల పాఠశాల ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. సుమన అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి అదే స్థానం నుంచి రెండుసార్లు పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉన్న ఆమె, ప్రస్తుతం టిడిపిలోనే కొనసాగుతున్నారు. సుమన మరణ వార్త తెలియగానే పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని విశాఖ అక్కయ్యపాలెంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో ఉంచారు. ఆమె స్వగ్రామంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## పరకామణికేసు కోర్టు పరిధిలో ఉన్నందున పూర్తి సమాచారం చెప్పలేం

### - ఎసిబి డిజి అతుల్ సింగ్



**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణికేసు కోర్టు పరిధిలో ఉన్నందున పూర్తి సమాచారం చెప్పలేమని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ స్పష్టం చేసారు.ఈ కేసుపై ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తెలిపారు. కానీ.. కోర్టు డైరెక్షన్ ప్రకారమే కేసు విచారణ కొనసాగుతోందని స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసు బుక్ చేసిన తర్వాత విచారణ మొత్తం పూర్తి చేయడానికి 15 రోజులు పడుతుందని.. సిబ్బంది తక్కువగా ఉన్నందున అన్ని కేసులను దర్యాప్తు చేయడం సాధ్యం కావడం లేదని తెలిపారు. చిన్న ఎమోంట్ ఉన్న కేసులు ఉంటే.. ఆయా శాఖలకే చర్యలు తీసుకోవాలని రాస్తున్నామ్నారు. పెద్ద మొత్తం డిమాండ్ చేసే వారిపైనే తాము ఇప్పుడు దృష్టి పెట్టామని చెప్పారు. గత నాలుగైదు నెలలుగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇండియాలో క్రికెట్‌కు బాగా క్రేజ్ ఉందని.. టెండూల్కర్, విరాట్ వంటి వారు త్వరగా అవుట్ అయితే జోక్స్ చేస్తామని.. అదే విధంగా అవినీతి నిర్మూలనపై కూడా ఎవరిష్టం వచ్చినట్లు వారు అటువైపు నుంచి మాట్లాడతారని చెప్పారు. ఇటువైపు కూడా వచ్చి చూస్తే కన్విక్షన్ వరకు కేసు విచారణ ఎలా ఉంటుందో అందరికీ తెలుస్తుందని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఏసీబీకి ఏ విధంగా ఫిర్యాదు చేయాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లే ప్రజల నుంచి చిన్న మొత్తంలో లంచాలు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రజలు దీనిపై తమకు ఫిర్యాదులు చేస్తే.. ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఏసీబీ డీజీ తెలిపారు. ఏసీబీ దృష్టికి వచ్చే ఫిర్యాదుల్లో తమ ప్రధాన కార్యాలయంలో చర్చించి.. ఆ తర్వాత ప్రాధాన్యతను బట్టి దాడులు చేస్తామని వివరించారు. ఏసీబీ టీం నుంచి సమాచారం ముందుగా లీక్ అవుతుందనేది వాస్తవం కాదన్నారు. ఏసీబీ కార్యాలయంలో ఎప్పుడూ ఇంటర్నల్ విజిలెన్స్ ఉంటుందని చెప్పారు. తాము అన్నీ ముందుగానే చర్చించలేమని.. దర్యాప్తులో అనేక అంశాలను తీసుకుని ముందుకు సాగుతామని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే ఏసీబీ కార్యాలయాలు పనిచేస్తున్నాయన్నారు. దీనివల్ల లంచం డిమాండ్ చేసే ఉద్యోగులపై ఏసీబీకి ఫిర్యాదు చేయాలన్నారు.

# వల్లభనేని వంశీకి హైకోర్టులో తాత్కాలిక ఊరట

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ కీలక నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఏపీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. బెజవాడ మాచవరం పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వంశీని అరెస్టు చేయవద్దంటూ కోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వెకేషన్ బెంచ్‌కు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.నూతక్కి సునీల్ అనే వ్యక్తి ఈ నెల 17న మాచవరం పోలీస్ స్టేషన్‌లో వంశీపై ఫిర్యాదు చేశాడు. వల్లభనేని వంశీ అనుచరులు తనపై దాడికి పాల్పడ్డారని, తనను హత్య చేయడానికి ప్రయత్నించారని ఆరోపించాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వంశీతో పాటు మరో ఎనిమిది మందిపై హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన విషయం బయటకు రావడంతో వంశీ ఒక్కసారిగా అందుబాటులో లేకుండా పోయారు. ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. వంశీతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఇతరులు కూడా కనిపించకపోవడంతో, వారిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కొన్ని బృందాలు హైదరాబాద్ కేంద్రంగా గాలింపు చర్యలు చేపట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వంశీ హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. తనపై పెట్టిన కేసు రాజకీయ ప్రేరణతో కూడినదని, తప్పుడు ఆరోపణల ఆధారంగా కేసు నమోదు చేశారని వంశీ తన వాదనలో పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు, ప్రస్తుతం వంశీని అరెస్టు చేయవద్దంటూ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

# ఎపిలో దట్టంగా అలుముకుంటున్న పొగమంచు

## పెరుగుతున్న చలి తీవ్రత

**విజయవాడ,జనవరి 2,ప్రభాత వార్తప్రతి నిధి:** రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావాలంటే వణికిపోతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే వ్యత్యాసం లేకుండా కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లోనైతే ఉష్ణోగ్రతలు మరీ దారుణంగా పడిపోతున్నాయి. రాష్ట్ర ప్రజలను చలి గజగజలాడిస్తోంది.
పొగ మంచు కమ్మేసి వాతావరణమంతా శ్వేతమయంగా మారింది. పొగ మంచు దట్టంగా ఆవరించటంతో ఎదురుగా వచ్చే వాహనానికి హెడ్ లైట్లు ఏమాత్రం కనిపించడం లేదు. దగ్గరగా వచ్చే వరకు ద్విచక్ర వాహనాలు కనపడకపోవటంతో భారీ వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణంలో ఉదయం 7 గంటల సమయంలోనూ మంచుపొరలు తొలగలేదు. అద్దంకి పట్టణం, గుండా నామ్ రహదారిపై విపరీతమైన పొగ మంచు ఉండటంతో వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కాదు. ఈ రహదారిపై నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. పొగ మంచు దట్టంగా ఆవరించటంతో ఎదురుగా వచ్చే వాహనానికి హెడ్ లైట్లు ఏమాత్రం కనిపించడం లేదు. దగ్గరగా వచ్చే వరకు ద్విచక్ర వాహనాలు కనపడకపోవటంతో భారీ వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. శీతల పదార్థాలకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వేడిగా ఉండే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. గోరు వెచ్చటి నీరు తాగితే మంచిది. మంచులో ఉదయం, రాత్రులు తిరగటం తగ్గించాలి. అవసరమైనపుడు ఉన్ని దుస్తులు, స్వెట్టర్లు, మాస్కులు ధరించాలి. చలికాలంలో తక్కువ మోతాదులో నీరు తీసుకోవడం మంచిది కాదు. దీని వల్ల పలు అనార్యోగ సమస్యలు వస్తాయి. ఎక్కువ నీరు తీసుకోవడం వల్ల లోపల పేరుకుపోయిన కఫం బయటకు వస్తుంది. న్యూమోనియా రాకుండా ఉండేందుకు చిన్నారులు, పెద్దలు టీకాలు వేయించుకోవాలి. శ్వాస సమస్యలు ఉన్నవారు ఉదయం సమయంలో చల్లటి గాలికి వాకింగ్ చేయడం కొద్ది రోజులు తగ్గించాలి అని వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో చలి బాగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలి. న్యూమోనియా వచ్చే ప్రమాదం ఉంది. దీనివల్ల జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు ఎదురవుతాయి. శీతాకాలంలో జాగ్రత్తలు పాటించకుంటే రక్తనాళాలు గడ్డ కట్టే ప్రమాదం పొంచి ఉంది. తద్వారా గుండె, బ్రెయిన్ స్ట్రోక్‌లు వంటివి వచ్చే అవకాశం ఉంది. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రిలో వెళ్లాలి. సరైన చికిత్స చేయించుకోవాలి. ఎల్లప్పుడూ పోషకాహారాన్నే తీసుకోవాలని, ఈ సీజన్లో లభించే పండ్లు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. మంచు ఎక్కువగా కురుస్తుండడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారులను మంచు దుప్పటి కప్పేసింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత అధికంగా ఉండడం వల్ల వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరూ చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దట్టమైన పొగ మంచు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాపట్లజిల్లా చీరాల, పర్చూరు నియోజకవర్గాలను మంచు దుప్పటి కప్పేసింది. దీంతో వాహనాలదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. చీరాల, వేటపాలెం, చినగంజాం, పర్చూరు, మార్టూరు ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా అలుముకుంది. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, చిన్నారులు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ప్రయాణం సాగాలంటే వాహనాల హెడ్ లైట్లు వెళ్లాల్సిందే, లేదంటే ప్రమాదమే. ఒంగోలు కత్తిపూడి జాతీయ రహదారిపై మంచు ఆవహించటంతో వాహనాలు నెమ్మదిగా వెళుతున్నాయి. రైళ్లు కూడా నిదానంగా వెళుతున్నాయి.
ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణంలో ఉదయం 7 గంటల సమయంలోనూ మంచుపొరలు తొలగలేదు.
అద్దంకి పట్టణం, గుండా నామ్ రహదారిపై విపరీతమైన పొగ మంచు ఉండటంతో వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కాదు.
ఈ రహదారిపై నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి.

# టోల్‌ప్లాజాలో వసూళ్లను నిలిపివేయండి

### - కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి టిడిపి ఎంపి సనా సతీష్ వినతి

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి సందర్భంగా టోల్‌ప్లాజాలో టోల్ వసూళ్లను నిలిపివేయాలంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని టీడీపీ ఎంపీ సనా సతీష్ కోరారు. సంక్రాంతికి హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది ఏపీలోని సొంత గ్రామాలకు వస్తారని.. ఫలితంగా హైదరాబాద్‌విజయవాడ రహదారిపై విపరీతమైన రద్దీ ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టోల్ వసూళ్లు నిలిపివేయాలని కేంద్రాన్ని కోరారు. సంక్రాంతి పండుగ కారణంగా హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ వాసులు పెద్ద ఎత్తున తమ తమ స్వస్థలాలకు వెళ్తుంటారని.. ఫలితంగా హైదరాబాద్‌విజయవాడ రహదారిపై తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందన్నారు ఎంపీ సనా సతీష్. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పంతంగి, కొర్లపహడ్, చిల్లకల్లు, కీసర టోల్ ప్లాజాల వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతుందన్నారు. ఈ కారణంగా తెలుగు ప్రజలకు సమయం ఆదా అవ్వడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు టోల్‌ప్లాజాల వద్ద టోల్ వసూళ్లను మాఫీ చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు ఎంపీ సనా సతీష్.
దీని వలన ప్రయాణం సాఫీగా జరిగి ఇళ్లకు క్షేమంగా చేరుకుంటారని అన్నారు. సంక్రాంతి పండుగను అందరూ సాంప్రదాయ బద్ధంగా జరుపుకునేందుకు అవకాశం కలుగుతుందని.. తమ విజ్ఞప్తిని పరిశీలించాలంటూ కేంద్ర మంత్రిని కోరారు .

## నర్సింగ్ విద్యార్థినిపై ఇంటర్న్‌షిప్ డాక్టర్ లైంగికదాడి

**లక్నో,జనవరి 2:** నర్సింగ్ విద్యార్థినిపై లక్నో ప్రభుత్వ మెడికల్ ఇన్స్‌టిట్యూట్‌లో పనిచేస్తున్న ఇంటర్న్ డాక్టర్ అత్యాచారం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసినట్లు డాక్టర్‌పై ఫిర్యాదు నమోదు అయ్యింది. నర్సింగ్ విద్యార్థిని ప్రైవేటు ఫోటోలను లీక్ చేస్తానని ఆ డాక్టర్ బెదిరించాడు. అయితే ఆ ఇంటెర్న్ డాక్టర్‌కు చెందిన బ్యాక్‌గ్రౌండ్, అడ్రస్‌ను వెరిఫై చేస్తున్నామని డీసీపీ విశ్వజీత్ శ్రీవాత్సవ్ తెలిపారు. అతన్ని ట్రాక్ చేస్తున్నట్లు చెప్పారు. మెజిస్ట్రేట్ ముందు నర్సింగ్ స్టూడెంట్ వాంగ్మూలం రికార్డు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఖైసర్‌బాగ్ పోలీసు స్టేషన్ వద్ద ఆ డాక్టర్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## తిరుప్పావై

### 19వ పాశురము



కుత్తువిళక్కెరియ క్కోట్టుక్కాల్
కట్టిన్మేల్,
మెత్తైన పఞ్చశయనత్తిన్ మేలేఱి,
కొత్తలర్ పూంగుళల్ నప్పిన్నై
కొంగైమేల్
వైత్తుక్కిడన్ద మలర్‌మార్ పా!
వాయ్ తిరవాయ్,
మైత్తడం కణ్ణినాయ్! నీ ఉన్
మణాళనై,
ఎత్తనైపోదుమ్ తుయిలెళ
వొట్టాయా కాణ్,
ఎత్తనై యేలుమ్ పిరివాత్త
కిల్లాయాల్,
తత్తువమన్ఱు తగవేలో
రెమ్బావాయ్

ఆ గదిలో గుత్తిదీపములు వెలుగు చూస్తున్నవి. అందులో దంతకోళ్ళు గల మంచము. వేసవిలో చల్లదనము శీతాకాలములో వెచ్చదనము యివ్వగల, తెల్లదనము, మెత్త ధనము, పరిమళముగల విశాలమైన పడక ఉన్నది. కాటు కను విశాలమైన కనులకు అలంకరించుకొన్న, గుత్తులు గుత్తులుగ పూలను తన కొప్పులో అలంకరించుకొన్న నీలా దేవి వడుకొని యున్నది. ఆమె స్థానములపై, విశాల వక్ష స్థలముగల కృష్ణుడు తన శరీరమును ఆనించినాడు. ఒక క్షణమైన కృష్ణుని నీ నుండి ఎడబాటు చేయవా? అది నీ స్వభావమునకు తగదమ్మా ! అని నీల దేవితోను, ఒకమారైనా పలకవా అని కృష్ణునితోను, వెలుపలి గోపికలు అంటున్నారు. **ఫలం:** "పరమాత్మ తత్త్వం"

## మగువ మనసు పేస్టల్స్ వైపే!



ఫ్యాషన్ ఫ్యాషన్

పప పెళ్లి వేడుకంటే తికమక మొదలయ్యేది... వధువు చీరల విషయంలోనే! కంచి, బనారస్, కోట, టస్సర్... బోలెడు రకాలు. ఒకరు కాంజీవరం బాగుందంటే మరొకరు ఉప్పాడదే ట్రెండంటారు. తికమక అంతా ఇక్కడే... రంగుల విషయంలో మాత్రం ఈసారి వధువులు చాలా స్పష్టతతో ఉన్నారు. వాళ్ల ఓటు పేస్టల్సే! కాబట్టే ఈసారి వధువుల ఫ్యాషన్ ట్రెండ్‌లో పేస్టల్ కలర్స్ రాజ్యమేలాయి. ముదురు రంగుల్లో మెరిసిపోతారు, పెళ్లి కళ కొట్టొచ్చినట్టు కనిపిస్తుందన్న మాటల్ని పక్కన పెట్టేసి మరీ వీటినే ఎంచుకోవాలి. వీటిలో పౌడర్ బ్లూ, బ్లష్ పింక్, మింట్ గ్రీన్, సాఫ్ట్ ఎల్లోలాదే హవా! అందుకు కారణమూ లేకపోలేదు. ఈసారి అమ్మాయిలు జపించిందంతా మినిమాలిస్టిక్ మంత్రమే! ఇదైతే సాఫ్ట్, తాజా రూపాన్ని ఇస్తుంది. క్లాస్ లుక్ సంగతైతే చెప్పనక్కర్లేదు. పైగా సంప్రదాయ నగలే వేసినా, స్టైలిష్ జ్యువెలరీనే ఎంపిక నప్పడం ఖాయం.



## పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత కోసం..



పది హేడేళ్ల వయసులో గుండెకు శాస్త్ర చికిత్స... క్యాన్సర్‌పై పోరాటం... ఆపై భర్త మరణం... ఇలా జీవితం విసిరిన ప్రతి సవాలునూ స్వీకరించా రామె. మనం జీవిస్తూ మరో పదిమందికి చేయూతనివ్వాలనుకునే మనసు... జీరోవేస్ట్ పద్ధతిలో జీవనం సాగిస్తూ పర్యావరణ పరిరక్షణకు, మహిళా సాధికారతకూ మార్గం చూపుతుంది. తనే పద్మశ్రీ గ్రహీత జనక్ పాల్టా మైక్ గిలింగన్..




పంజాబీ కుటుంబంలో పుట్టిపెరిగిన జనక్ బాల్యం అంతా చండీగడ్‌లో సాగింది. 17ఏళ్ల వయసులో గుండె జబ్బు బారిన పడ్డారామె. ఆంగ్ల సాహిత్యంలో పీజీ, పొలిటికల్ సైన్స్‌లో ఎంఫిల్, పీహెచ్‌ఈ పూర్తి చేశారు. చదువు కుంటూనే పీఎఫ్ ఆఫీస్, హైకోర్టు, గ్రామీణ పారిశ్రామిక అభివృద్ధి కేంద్రాల్లో పనిచేశారు. ఆ సమయం లోనే పరిష్క చెందిన జేమ్స్ మైక్ గిలింగన్‌తో పరిచయం కాస్త ప్రేమగా మారి వివాహం చేసుకున్నారు. జీవితం అంటే మనం బతకడమే కాదు. పదిమందికీ దారి చూపించాలి అంటే మనస్తత్వం ఉన్న ఈ జంట మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి వాటిని పని చేయాలనుకున్నారు. 'బర్లీ డెవలప్‌మెంట్ ఇన్ డిగ్రీ ఆఫ్ రూరల్ విమెన్'తో మొదటి అడుగువేశారీ ద్వయం. చదువుకి దూరమై గ్రామీణ, గిరిజన మహిళలకు నైపుణ్యాల శిక్షణ, కల్పన దిశగా అడుగులు వేసి సంస్థ. జనక్ 1992లో రియో డిజెనీరోలో జరిగిన మొదటి ఎర్త్ సమ్మిట్‌కు ఆహ్వానం అందుకున్నారు. అప్పుడే ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యావరణ సమస్యలను తెలుసుకున్నారు.

**అవార్డుతో గుర్తింపు...** 2007లో క్యాన్సర్ బారిన పడ్డారు జనక్. తన సంస్థనీ,, నివాసాన్ని ఇండోర్ సమీపంలోని సనావాడియాకి మార్చుకున్నారు. జీరో వేస్ట్ జీవనశైలిని అలవాటు చేసుకు న్నారు. సోలార్, పవర్ స్టేషన్ల నిర్మాణంతో ఇంటికి కావలసిన విద్యుత్తును సమకూర్చుకోవడమే కాదు... మరో యాభై ఇళ్లల్లో సోలార్ దీపాలను వెలిగించారు. సోలార్ కుక్కర్లు, దీపాల వినియోగాన్ని మహిళలకు నేర్పించడం వల్ల వంటచెరకు కోసం 20 30మైళ్లు నడిచి వెళ్లే దూరాన్ని తగ్గించా 'మైక్ గిలింగన్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సంస్థను స్థాపించారు. ఫలితంగా వెయి. గ్రామాల్లోని లక్షా యాభై వేలకు పైగా యువతకు, ఆరువేలకు పైగా గ్రామీణ, గిరిజన సౌరశక్తిని ఉపయోగించి వంటచేయడంలో శిక్షణ ఇచ్చారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి జైవిక్ సేతుని ప్రారంభించారు. అంతేకాదు, స్థానికుల కష్టసుఖాలను పంచు జనక్‌ని 'దీదీ' అని ఆప్యాయంగా ఆప్యాయంగా పిలుస్తుంటారు అక్కడి ప్రజలు. అంతా బాగుంది అనే సమయంలో ఓ ప్రమాదంలో భర్తని కోల్పోయారీమె. అయినా తన ప్రయాణాన్ని ఆపలేదు. తన సామాజిక సేవను గుర్తించిన భారత ప్రభుత్వం 2015లో పద్మశ్రీతో గౌరవించింది. 77 ఏళ్ల వయసులోనూ ప్రకృతికి హాని చేయకుండా జీవిస్తూ ఇతరులకు దాంట్లో శిక్షణ ఇస్తున్న జనక్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమే కదూ! □

## రంగవల్లి



\- లక్ష్మీ ప్రసన్న
బి.ఎన్. రెడ్డి నగర్
హైద్రాబాద్



17 చుక్కలు 5వరుసలు ఇటు అటు వదిలి 5 వరకు

## పనీర్ జిలేబీ



**కావలసిన పదార్థాలు** పనీర్ తురుము: ఒక కప్పు, ఉప్మా రవ్వ: రెండు టేబుల్ స్పూన్లు, మైదా: రెండు టేబుల్ స్పూన్లు, కార్న్‌ఫ్లోర్: ఒక టేబుల్ స్పూన్, పాలు: పావు కప్పు, యాలకుల పొడి: అర టీస్పూన్, చక్కెర: ఒక కప్పు, రెడ్ ఫుడ్ కలర్: చిటికెడు, నూనె: వేయించడానికి సరిపడా. **తయారీ :** రవ్వ, మైదా, కార్న్‌ఫ్లోర్, ఫుడ్ కలర్ వేసి కొద్దికొద్దిగా పాలుపోసి ముద్దలా వచ్చేలా గ్రైండ్ చేయాలి. స్టవ్‌మీద పాన్ పెట్టి చక్కెర వేసి కొద్దిగా నీళ్లు పోసి పాకం పట్టుకోవాలి. పాకం వచ్చాక యాలకుల పొడి వేసి దించేయాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి వేయించడానికి సరిపడా నూనె పోసి వేడి చేయాలి. పనీర్ మిశ్రమాన్ని పైపింగ్ బ్యాగ్‌లో కానీ, పాల ప్యాకెట్ కవర్‌లో కానీ వేసి కాగిన నూనెలో జిలేబీల్లా ఒత్తుకుని దోరగా కాల్చుకోవాలి. కాలిన జిలేబీలను పాకంలో వేసి అర గంటపాటు నానిన తర్వాత, సర్వ్ చేసుకుంటే నోరూరించే పనీర్ జిలేబీ సిద్ధం. □

## ముగ్గులకు ఆహ్వానం



**మా చిరునామా** ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80 Gmail: cheli@vaartha.com

కృత్రిమ మేధతో రూపొందించిన ముగ్గులు పంపవద్దు

## ఆరోగ్య భాగ్యం — రుచి

**ఆహార పదార్థాల** రుచిని తెలియచేసేది నాలుకపైన ఉన్న రుచి మొగ్గలు. రుచి మొగ్గలు అనేది పెరిఫెరల్ కీమో రిసెప్టర్లు. రుచి మొగ్గలు ఫ్లాస్క్ ఆకారంలో ఉండే సెన్స్ ఆర్గాన్స్. వీటినే సున్నితమైన జీర్ణ అవయవాలు లేదా సూక్ష్మ ఇంద్రియ అవయవాలు అంటారు. గాస్టేటరీ కార్టెక్స్ రుచిని తెలియచెప్పడం వల్ల దీన్ని గస్టేటరీ సిస్టమ్ అంటారు. ఇది నాలుకపైన ఉన్న చిన్న బుడిపెల్లో ఉండి ఫేసియల్, గ్లాసో ఫారింజియల్, లీగస్ వంటి d3 క్రేనియల్ నర్వ్స్ ద్వారా మెదడులోని గస్టేటరీ ప్రాంతానికి పంపుతుంది. ఒక్కోటేస్ట్ బడ్‌లో 4-20 కణాలుంటాయి. వీటి జీవితకాలం 10-14 రోజుల లుంటుంది. మన నాలుకలో 2,000-8,000 రుచి మొగ్గలుండి 4 రకాల పాపిల్లే అనబడే వాటితో అను సంధానమై ఉంటాయి. ఇవి లాలాజలంలోని డైజేస్టివ్ ఎంజైమ్స్‌తో కలిసి ఉండడం వల్ల రుచుల్ని సులభంగా గుర్తిస్తాయి. రుచి మొగ్గల పరిమాణం, సంఖ్య ఒకరిలో ఉన్నట్లు మరొకరిలో ఉండవు. ఇవి ఎక్కువగా పురుషుల కన్నా స్త్రీలలో ఉంటాయి. వయస్సు పెరిగేకొద్ది రుచి మొగ్గలు తగ్గుతాయి. చిన్న పిల్లల్లో వృద్ధాప్యంలో ఆహారం అలవాట్లని బట్టి రుచి మొగ్గలు మారుతాయి. పిల్లల్లో 30,000 రుచి మొగ్గలు ఉంటామి, పెద్దలకన్నా పిల్లల్లోనే ఆహారం రుచిలో మార్పులు ఉంటాయి. ఆరిస్టాటిల్ 350 బి.సిలో తీపి/చేదు అని రెండు రకాల్ని మొదట గుర్తించాడు. రుచి మొగ్గలు కంటికి కన్పించనంత చిన్నవిగా ఉంటాయి. వివిధ రకాల రుచి మొగ్గలు లేవు. కాని వివిధ రుచులకు స్పందించే మొగ్గ కణాలుంటాయి. ఈ రుచి మొగ్గలు నాలుక ఎగువ భాగంలో, అంగిలి, అన్నవాహిక, బుగ్గలు, ఎపిగ్లాటిస్, ఫారింక్స్ భాగంలో ఉంటాయి. **రకాలు:** 1.ఫియారీ టెస్ట్: ఇవి పొడి, వేడికి తేలికగా ఉండి డైజెస్టిన్ పవర్‌ను పెంచుతాయి. ఉదా: ఉప్పు, పులుపు, కారం. **వాటరీ టెస్ట్ :** ఇవి తడి, చల్లగా బరువుగా ఉండి డైజేస్టివ్ పవర్‌ను తగ్గిస్తాయి. ఉదా: తీపి, చేదు, వగరు. మనం భుజించే, ఆహార పదార్థాల లక్షణాల్ని బట్టి ఆరు రుచుల్నింటాయి. వీటినే షడ్రుచులు, రస, చవి అని అంటారు. ఈ రుచుల్ని నాలుకలోని ఏ ప్రాంతం ద్వారానైనా గుర్తించవచ్చు. రుచి మొగ్గలు మైక్రోవిల్లి అనబడే సున్నితమైన సూక్ష్మ వెంట్రుకల్ని కల్గి 50మి.మి. వెడల్పు, 80 మి.మి. పొడవు కల్గి ఉంటాయి. ప్రతి గ్రాహకానికి ఇంద్రియ ట్రాన్స్‌డక్షన్ పద్ధతి ఉంటుంది. ఇవి ఎక్కువగా సోమాటోసెన్సరీ సిస్టమ్ ద్వారా గుర్తించబడతాయి. నాలుక కొనభాగంలో తీపి ఉప్పు నాలుక ఇరుప్రక్కల పులుపు, నాలుక వెనుక భాగంలో చేదు. వంటి రుచి గ్రాహక కణాలుంటాయి. రుచి మొగ్గలు డైనమిక్ సిస్టమ్ ద్వారా గుర్తించబడతాయి. **రుచి మొగ్గల ఉపయోగాలు:** ఇవి ఆహారం యొక్క రుచిని గుర్తించి, ఆహారాన్ని ఆస్వాదించడానికి, ఆహారం తిన్న సంతృప్తినిస్తాయి. ఇది తినే ఆహారాన్ని తెలుసుకోవడానికి, ఆహారం మంచిదా, చెడ్డదా అని గుర్తించడానికి, ఆహారాన్ని మళ్ళీ మళ్ళీ తినాలనే కోరికని కల్గిస్తుంది. ఇది ఆకలిని కల్గించే గ్రెలీన్ హార్మోన్ ఆధీనంలో ఉంటుంది. □



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

## సంచలన టీజర్‌తో 'లెగసీ' చిత్రం



ఒకే తరహా సినిమాలు చేయకుండా విభిన్న పాత్రలు, భిన్నమైన కథలతో ముందు కెళ్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు మాస్ కా దాస్ విశ్వక్ సేన్. ఎక్కువ సినిమాలు చేయడం కంటే, నాణ్యమైన సినిమాలు చేయడానికి ప్రాధాన్యతను ఇస్తూ.. ఉత్తమ వినోదాన్ని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. అదే ఆయనకు ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించి పెట్టింది. "మినిమమ్ క్వాలిటీ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ హీరో అనే పేరు కూడా తెచ్చి పెట్టింది. ఇప్పుడు ఆయన, సాయి కిరణ్ దైదా దర్శకత్వం వహించిన విమర్శకుల ప్రశంసలు పొందిన 'పిండం' చిత్రాన్ని నిర్మించిన కలాహీ మీడియా పతాకంపై తెరకెక్కుతోన్న రెండవ సినిమాలో నటిస్తున్నారు. 'లెగసీ' అనే టైటిల్ తో రూపొందుతోన్న ఈ చిత్రానికి కూడా 'పిండం' సినిమాతో తన ప్రతిభను చాటుకున్న సాయి కిరణ్ దైదా రచన, దర్శకత్వం వహిస్తున్నారు. 'లెగసీ' ఒక రాజకీయ నేపథ్యంతో సాగే కథ. అత్యంత ప్రభావవంతమైన రాజకీయ నాయకుడైన తన తండ్రి వారసత్వాన్ని అనివార్యంగా మోయవలసి వచ్చే సిద్ధార్థ్ అనే యువకుడి కథగా ఇది రూపొందుతోంది. వారసుడు లేని కుర్చీ చుట్టూ తిరిగే అవకాశవాద రాజకీయ రాబందులను తాను ఎంతగా ద్వేషిస్తాడో చెప్పే విశ్వక్ సేన్ వాయిస్ ఓవర్‌తో టీజర్ తన దివంగత తండ్రి స్మారక చిహ్నాన్ని సందర్శించడానికి వెళ్తున్నట్లు విశ్వక్ సేన్ పాత్రను పరిచయం చేశారు. అక్కడ అతను మృతదేహంపై మూత్ర విసర్జన చేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడం వైవిధ్యంగా ఉంది. పిండం వంటి విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రం తర్వాత, దర్శకుడు సాయి కిరణ్ దైదా ఒక ఉత్కంఠభరితమైన పొలిటికల్ డ్రామాకి ప్రాణం పోసేందుకు సిద్ధమయ్యారు.

## విడుదలకు 'వశం' సిద్ధం



చేతన్ , కావ్య, రాజీవ్ హీరో హీరోయిన్లుగా ఆలాపన స్టూడియోస్ సమర్పణలో కోన రమేష్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం ఖివశంఖి విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా .. దర్శక, నిర్మాత కోన రమేష్ మాట్లాడుతూ .. సిటీ మరియు గిరిజన ప్రాంతంలో జరిగే కథ. సిటీలో పెరిగిన ఒక వ్యక్తి గిరిజన ప్రాంతంలోని అమ్మాయిని ఎంతగానో ప్రేమించి, చివరికి సిటీలోనే అమ్మాయినే ఎందుకు పెళ్లి చేసుకోవలసి వచ్చింది? ఇంతకీ వాస్తవానికి ఏమి జరిగిందనే ఆసక్తికరమైన కథ. గిరిజన ప్రాంతం నేపథ్యంలో జరిగే కథ ఇది . బెంగళూరు.. హైదరాబాద్‌లలో తదితర ప్రాంతాల్లో తెరకెకెక్కించాం. కాంద్రేగుల చందు, సలాపు మోహనరావు, కుబిరెడ్డి వెంకన్న దొరగార్ల సహకారం మరువలేనిది. వారి సంపూర్ణ సహకారంతో సినిమా చక్కగా తెరకెక్కింది. తెలుగు, కన్నడ భాషల్లో ఫిబ్రవరిలో భారీగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం. సినిమాను ఎక్కడా రాజీపడకుండా చిత్రీకరించాం. నటీనటులంతా ఎంతో చక్కగా తమ పాత్రల్లో జీవించారు. ఇందులో ప్రతీ సన్నివేశం ఎంతో ఉత్కంటగా అందర్నీ ఆకట్టుకుంటుంది అని దర్శకుడు కోన రమేష్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కథస్క్రీన్ ప్లే దర్శకత్వం, కొరియోగ్రఫీ : కోన రమేష్, నిర్మాతలు : కోన రమేష్, యెన్నం శెట్టి ఆంజనేయులు, కో ప్రొడ్యూసర్స్ : రేగం మత్యలింగం , (ఎమ్మెల్యే), పోతూకూరి దేముడు, వడిగొండ అర్జున అప్పారావు, డీఓపీ : శంకర, సంగీతం : కిరణ్ తోటంబ్లే, ఆర్ట్ డైరెక్టర్ : మంజుల, కో డైరెక్టర్స్ : నవీన్ రామ్ నల్లం రెడ్డి, చెక్క ప్రేమ్ జీ ,నని సత్తిబాబు, సుబ్బు, చందు, వెంకట్.
పి.ఆర్.ఓ : బాబు నాయక్


## తెర

## 'ది పారడైజ్' నాని పోస్టర్ రిలీజ్



నేచురల్ స్టార్ నాని ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'ది పారడైజ్ ప్రతి అప్‌డేట్ ఈ సినిమా కోసం ఎక్సయి ట్మెంట్ మరింతగా పెంచుతుంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో SLV సినిమాస్ సుధాకర్ చెరుకూరి ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని భారీగా నిర్మిస్తున్నారు. దసరా బ్లాక్ బస్టర్ తర్వాత నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. మేకర్స్ రిలీజ్ చేసిన నాని, మోహన్‌బాబు, సంపూర్ణేష్ బాబు ఫస్ట్ లుక్ పోస్టర్‌లకు అద్భుతమైన స్పందన వచ్చింది. మేకర్స్ న్యూ ఇయర్ సందర్భంగా నేచురల్ స్టార్ నాని అదిరిపోయే పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో నాని జడల్ పాత్రలో పవర్ ఫుల్‌గా, తన కెరీర్‌లో ఇప్పటివరకు ఎప్పుడూ చూడని ఓ కొత్త అవతార్‌లో కనిపిస్తున్నారు. స్ట్రాంగ్ ఫిజిక్, పొడవైన జడలు కట్టిన జుట్టు, రగ్గడ్ గడ్డం, మీసాలతో నాని లుక్ అదిరిపోయింది. రెడ్ టింట్ గ్లాసులు, మెటల్ చైన్స్, స్లీవ్‌లెస్ బ్లాక్ అవుట్‌ఫిట్ అతని పాత్రలోని ఇంటెన్సిటీని చూపిస్తోంది. ఈ చిత్రానికి సిహెచ్ సాయి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఎడిటింగ్ నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా. ఈ సినిమా 2026 మార్చి 26న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్, స్పానిష్ భాషల్లో విడుదల కానుంది. ది ప్యారడైజ్ ఇండియన్ సినిమాని ప్రపంచవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకునే పాన్‌వరల్డ్ స్పెక్టకిల్‌గా నిలవనుంది.

## 'హే భగవాన్!' గ్రాండ్‌గా రిలీజ్



సుహాస్ యూనిక్ స్క్రిప్ట్‌లతో అలరిస్తున్నారు. ప్రస్తుతం నూతన దర్శకుడు గోపి అచ్చర దర్శకత్వంలో 'హే భగవాన్!' సినిమా చేస్తున్నారు. ఈ కంప్లీట్ ఎంటర్‌టైనర్‌ను త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి. నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు, ఇది వారి ప్రొడక్షన్ నంబర్ 2. రైటర్ పద్మభూషణ్ ఫేం షణ్ముక ప్రశాంత్ ఈ కథను రాశారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. టీజర్ లో సస్పెన్స్, కామెడీ అదిరిపోయింది. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. చిత్ర బృందం నూతన సంవత్సరం సందర్భంగా విడుదల చేసిన ప్రత్యేక వీడియో అందరినీ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో శివాని నగరం హీరోయిన్ గా నటిస్తున్నారు. డా. నరేష్ వికె, సుదర్శన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీవోపీ మహిరెడ్డి పండుగల, సంగీతం వివేక్ సాగర్, ఎడిటర్ విప్లవ్ నిషాదం, ఆర్ట్ డైరెక్టర్ ఎ రామ్ కుమార్ . 'హే భగవాన్' 2026 లో గ్రాండ్ గా రిలీజ్ కానుంది.

## హారర్ మూవీ రుక్మిణి ఫస్ట్ లుక్ లాంచ్



నిరంజన్, గ్రీష్మ నేత్రికా, ప్రియాంక, దీప్తి శ్రీరంగం హీరో హీరోయిన్స్‌గా జి సినిమా బ్యానర్ పై నేలబల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, కట్టా గంగాధర రావు నిర్మిస్తున్న సినిమా 'రుక్మిణి'. ఈ చిత్రానికి శ్రీమతి నేలబల్లి కుమారి సమర్ప కులుగా వ్యవహరిస్తున్నారు. సరికొత్త హారర్ కామెడీ కథతో దర్శకుడు సింహాచలం గుడుపూరి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ రోజు న్యూ ఇయర్ డే సందర్భంగా నటకిరీటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా 'రుక్మిణి' మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్ చేశారు. అనంతరంనటకిరీటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గంగాధర్ నాతో ఎన్నో ఏళ్లు పనిచేశాడు. ఎదురింటి మొగుడు పక్కింటి పెళ్లాం వంటి ఎన్నో హిట్ మూవీస్ కు మాతో వర్క్ చేశాడు. నాకు మంచి స్నేహితుడైన ఆయన నిర్మాతగా 'రుక్మిణి' సినిమా చేయడం హ్యాపీగా ఉంది. హీరో నిరంజన్ మాట్లాడుతూ మా 'రుక్మిణి' మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ లాంఛ్ చేసిన నటకిరీటి రాజేంద్రప్రసాద్ గారికి థ్యాంక్స్. హీరోయిన్ గ్రీష్మ నేత్రికా మాట్లాడుతూ మల్లీశ్వరి మూవీలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నన్ను మీరంతా ఆదరించారు. ఇప్పుడు 'రుక్మిణి' సినిమాతో హీరోయిన్‌గా మీ ముందుకు వస్తున్నాను. నటుడు విఖ్యాత్ మాట్లాడుతూ మా 'రుక్మిణి' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాం. నిర్మాత కట్టా గంగాధర్ రావు మాట్లాడుతూ ప్రేక్షకులందరికీ నూతన సంవత్సర శుభాకాం క్షలు. 'రుక్మిణి' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ను నటకిరీటి రాజేంద్రప్రసాద్ గారితో రిలీజ్ చేయించుకోవడం హ్యాపీగా ఉంది.

## 'అసుర సంహారం' టీజర్ విడుదల



లెజెండరీ యాక్టర్ తనికెళ్ల భరణి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం అసుర సంహారం. శ్రీ సాయి ప్రవర్తిక బోయళ్ళ సమర్పణలో, శ్రీ సాయి తేజో సెల్యూలాయిడ్స్ బ్యానర్‌పై సాయి శ్రీమంత్, శబరిష్ బోయెళ్ళ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కిషోర్ శ్రీకృష్ణ ఈ సినిమాకు కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్స్, సాంగ్ లాంచింగ్ కార్యక్రమం తనికెళ్ల భరణి చేతుల మీదుగా ఘనంగా జరిగింది. సుమారు 750కి పైగా చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలతో మెప్పించిన తనికెళ్ల భరణి, ఈ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన విలేజ్ క్రైమ్ డ్రామ్మాగా ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సందర్భంగా తనికెళ్ల భరణి మాట్లాడుతూ.. "అసుర సంహారం అంటే చెడుపై మంచి సాధించిన విజయం. డైరెక్టర్ కిషోర్ శ్రీకృష్ణ మంచి సబ్జెక్టను తెరకెక్కించారు.

## సువర్ణ టెక్స్‌టైల్స్ ఫస్ట్ లుక్



శివకుమార్ రామచంద్రవరపు, డిబోరా డోరిస్ ఫెల్, రాజశేఖర్ అనింగి, విక్రమాదిత్య డాంబర్ ప్రధాన పాత్ర దారులుగా ప్రశాంత్ నామిని రచన దర్శకత్వంలో తెరకెక్కుతున్న "సువర్ణ టెక్స్టైల్స్" చిత్రం ఫస్ట్ లుక్ విడుదల అయింది. యూత్ ఫుల్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎ.వై.వి.ప్రొడక్షన్స్, సనాతన క్రియేషన్స్ బ్యానర్స్ పై నిర్మాత అనిల్ ఈరుగుదిండ్ల నిర్మిస్తున్నారు. త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. రెండు షెడ్యూల్లలో షూటింగ్ కంప్లీట్ చేసి... ఆగస్టులో సినిమాని రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు నిర్మాత అనిల్ తెలిపారు. ఫస్ట్ లుక్ కి యూత్ లో మంచి ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఇందులో యూత్ కి నచ్చే కొంత అడల్ట్ కంటెంట్‌కి కామెడీని కూడా జోడించి చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం అన్నారు.

# డబ్ల్యూపిఎల్‌లో.. అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్స్


నాట్ స్కైవర్‌బ్రంట్



ఎల్లీస్ పెర్రీ



మెగ్ లానింగ్




షఫాలీ వర్మ



హర్మన్‌ప్రీత్ కౌర్

**న్యూఢిల్లీ:** ఉమన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్)–2026 ఈ నెల 9న ప్రారంభమవుతుంది. టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుతో తలపడ నుంది. టోర్నమెంట్ చరిత్రలో, ముంబై రెండు టైటిళ్లను గెలుచుకోగా, బెంగుళూరు ఒక టైటిల్‌ను గెలుచుకుంది. ఇక ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఐదుగురు మహిళా ప్లేయర్లు ఉన్నారు. ఇందులో భారత్ మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పేరు మాత్రం లేదు. ఈ టాప్ 5 ప్లేయర్ల జాబితాలో అగ్రస్థానంలో నాట్ స్కైవర్‌బ్రంట్ ఉంది. ఆమె 29 మ్యాచ్‌ల్లో 1,027 పరుగులు చేసింది. ముంబైలో కీలక సభ్యురాలైన నాట్ స్కైవర్‌బ్రంట్ 46.68 సగటుతో అద్భుతమైన స్కోరు చేసి, 8 అర్థ సెంచరీలు కూడా చేసింది. ఇవి ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాయి. రెండవ స్థానంలో రాయల్ ఛాలెంజర్స్ ప్లేయర్ ఎల్లీస్ పెర్రీ ఉంది. పెర్రీ మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యంత నమ్మకమైన బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా పరిగణించ బడుతోంది. ఆమె 25 మ్యాచ్‌ల్లో 64.80 సగటుతో 972 పరుగులు చేసి, 8 హాఫ్ సెంచరీలు కూడా చేసి బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచింది. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్ మూడో స్థానంలోఉంది. ఆమె 27 మ్యాచ్‌ల్లో 952 పరుగులు చేసింది, సగటున 39.66తో, తొమ్మిది అర్థ సెంచరీలు చేసింది. లానింగ్ తన జట్టుకు స్థిరంగా మంచి ఆరంభాలను అందించింది. నాలుగో స్థానంలో యువ మరియు దూకుడు బ్యాట్స్‌మెన్ షఫాలీ వర్మ ఉంది. ఆమె నిర్భయమైన ఆటతీరు డబ్ల్యూపిఎల్‌లో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఆమె 27 మ్యాచ్‌ల్లో 865 పరుగులు చేసింది. ఆమె స్ట్రైక్ రేట్ 162.59చూస్తే ఎంతత్వరగా స్కోరు చేస్తుందో చూపిస్తుంది. ఆమె ఆరు అర్థ సెంచరీలు చేయగా, బౌలర్లను ఎల్లప్పుడూ ఒత్తిడిలోఉంచుతుంది. ఐదవ స్థానంలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఉంది. ఆమె జట్టు మిడిల్ ఆర్డర్‌లో బలమైన ప్లేయర్‌గా ఉంది. ఆమె 27 మ్యాచ్‌ల్లో 851 పరుగులు చేయగా, సగటున 40.52తో 8 అర్థ సెంచరీలు చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ తరచుగా తన జట్టును విజయాల వైపు నడిపిస్తుందిమరియు మ్యాచ్‌లను ముగించడంలో నిష్ణాతురాలు.

## అగ్రస్థానంలో స్కైవర్‌బ్రంట్
## టాప్ 5లో చోటు దక్కని స్మృతి





# నేడే రెజ్లింగ్ లీగ్ వేలం
## ఆమన్, అంతిమ్, అన్షులకు డిమాండ్

**న్యూఢిల్లీ:** ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్) వేలం పాటకు రంగం సిద్ధమైంది. జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ (డబ్ల్యూఎఫ్ఐ) ఆధ్వర్యంలో తొలిసారి ఈనెల 3న జరుగనున్న పీడబ్ల్యూఎల్ కోసం ప్లేయర్ల ఎంపిక ప్రక్రియ అన్ని హంగులతో సమాయత్తమైంది. ఆటగాళ్లను కొనుగోలు చేసుకొనేందుకు ఆరు ఫ్రాంచైజీలు మెగా వేలంలో పాల్గొనున్నాయి. ఒక ప్రొ రెజ్లింగ్ టోర్నమెంట్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరగనుంది. రాబోయే సీజన్‌లో హర్యానా థండర్స్, టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్, పంజాబ్ రాయల్స్, మహారాష్ట్ర కేసరి, ఢిల్లీ దంగల్ వారియర్స్, యుపి డామినేటర్స్ ఫ్రాంచైజీలు రెజ్లింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రధానంగా పారిస్(2024) ఒలింపిక్స్ కాంస్య విజేత అమన్ సెహ్రావత్‌తో పాటు, విదేశీ స్టార్ రెజ్లర్లు యుయి సుసాకి, యుసెనిలిస్ గుజ్‌మన్ లోపెజ్ రూ.18 లక్షల కనీస ధరతో వేలంలోకి అడుగుపెడుతున్నారు. మహిళల విభాగంలో ప్రపంచ చాంపియన్‌షిప్ మెడలిస్టు అంతిమ్ పంగల్, అన్షు మాలిక్, కామన్వెల్ క్రీడల పతక విజేత దీపక్ పునియా, నవీన్ రూ.10లక్షల బేస్ ధరతో వేలం రేసులో నిలువగా, అత్యుత్తమ రెజ్లర్లలో ఒకరైన సుజీత్ కల్కల్ రూ.7లక్షలతో కనీస ధరతో వేలంలో దిగాలని నిర్ణయించుకున్నాడు. మహిళల విభాగంలో అంతిమ్ పంగల్ రూ.10లక్షల బేస్ ధరతో వేలం రేసులో నిలిచింది. ఇక ఆషూ మాలిక్, జాతీయ ఛాంపియన్ స్మృతి షిండే రూ.10లక్షల, ఒలింపిక్ ఛాంపియన్, జపాన్‌కు చెందిన యూ రూ.18లక్షలతో వేలం బరిలో దిగుతోంది. క్యూబా, ఉక్రెయిన్, అజర్‌బైజాన్, రష్యా రెజ్లర్లు కూడా భారత్ వేదికగా జరిగే ప్రొ రెజ్లింగ్ వేలం కోసం రిజిస్టర్ చేయించుకున్నారు. వీరంతా కనీస ధర రూ.5లక్షల నుంచి 10 లక్షలలోపు రిజిస్టర్ చేయించుకున్నారు.




## ఇంటర్నేషనల్ లీగ్ టి20..
# ఫైనల్ బెర్త్‌కు నైట్‌రైడర్స్

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ లీగ్ టి20, 2025–26 ఎడిషన్ చివరి దశకు చేరింది. క్వాలిఫయర్–1లో గెలిచి డెజర్ట్ వైపర్స్ నేరుగా ఫైనల్స్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా, మరో ఫైనల్ బెర్త్ కోసం పోటీ జరిగింది. దుబాద్ వేదికగా జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో అబుదాబీ నైట్‌రైడర్స్ దుబాయ్ క్యాపిటల్స్‌పై తిరుగులేని విజయం సాధించి క్వాలిఫయర్స్–2కు అర్హత సాధించింది. ఈ ఎలిమినేటర్ మ్యాచ్‌లో క్యాపిటల్స్‌పై అబుదాబీ నైట్‌రైడర్స్ 50పరుగుల తేడాతోగెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన నైట్‌రైడర్స్ మైఖేల్ పిప్పర్ (72), ఫిల్ సాల్ట్ (43), జేసన్ హోల్డర్ (22 నాటౌట్) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 158 పరుగులు చేసింది. క్యాపిటల్స్ బౌలర్లలో నబీ 3 వికెట్లతో సత్తా చాటగా, హైదర్ అలీ, వకార్ సలాంఖిల్ తలో వికెట్ తీశారు. అనంతరం ఒక మోస్తరు లక్ష్య ఛేదనలో చేతులెత్తేసిన క్యాపిటల్స్ 16.2 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. సునీల్ నరైన్ (3-0-12-3), జేసన్ హోల్డర్ (3.2-0-18-3), లివింగ్‌స్టోన్ (4-0-26-3) అద్భుతంగా బౌలింగ్ చేసి క్యాపిటల్స్ పతనాన్ని శాసించారు.

## ఉమన్స్ హాకీ లీగ్‌లో..
# బెంగాల్ టైగర్స్ విజయం

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఇండియా లీగ్ (డబ్ల్యూహెచ్ఐఎల్), 2025–26, షూటౌట్‌లో శ్రాచి బెంగాల్ టైగర్స్ 4–3తో ఎస్‌జి పైపర్స్‌ను ఓడించింది. నిర్ణీత సమయం ముగిసే సమయానికి ఇరుజట్లు 3–3తో సమంగానిలిచాయి. లాల్రెమ్సియామి సడన్‌డెత్ గోల్‌తో బోనస్ పాయింట్‌ను దక్కించుకుంది. టైగర్స్ తరపున అగస్టినా గోర్జెలానీ (6వ నిముషం, 18), లాల్రెమ్సియామి (11) నిర్ణీత సమయంలో గోల్స్ సాధించగా, పైపర్స్ తరపున లోలా రియారా (10, 60), సునెలిటా టోప్పో (59) గోల్స్ చేశారు. టైగర్స్ తొలి ఎంట్రీ దూకుడుగా ప్రారంభించి వరుసగా పెనాల్టీ కార్నర్‌లను సంపాదించింది. గోర్జెలానీ ద్వారా గోల్‌గా మార్చి ఆధిక్యంలోకి తెచ్చింది. పైపర్స్‌కు చెందిన లోలా తనదైన పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుని స్కోర్‌ను సమంచేసింది. తదుపరి లాల్రెమ్సియామి టైగర్స్ ఆధిక్యాన్ని పునరుద్ధరించే యత్నంలో గోల్ చేసి 2–1 ఆధిక్యాన్ని ఇచ్చింది. ఆ తర్వాత గోర్జెలానీ పెనాల్టీ కార్నర్ నుండి మళ్లీ కొట్టడంతో టైగర్స్ రెండవ క్వార్టర్‌లో తమ ఆధిక్యాన్ని పెంచుకుంది. ఎస్‌జీ పైపర్స్ నిరంతర దాడులు చేసినప్పటికీ, టైగర్స్ గోల్ కీపర్ జెన్నిఫర్ రిజ్జో వరుస



సేవ్‌లను చేసి తన జట్టును హాఫ్ టైం నాటికి 3–1తో ఆధిక్యంలో ఉంచింది. రెండవ అర్ధభాగాన్ని పైపర్స్ దాడులను ప్రారంభించి పెనాల్టీ కార్నర్‌ను సంపాదించినా అది పరిగణలోకి రాలేదు. నాల్గవ క్వార్టర్ పైపర్స్ చివరికి పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కెప్టెన్ నవనీత్ కౌర్ షాట్‌ను సునేలిత నేర్పుగా తిప్పికొట్టి స్కోరును ఒకే గోల్‌కు తగ్గించింది. అయితే షూటౌట్‌లో టైగర్స్‌కు పరిస్థితులు అనుకూలించడంతో విజయం సాధించింది.

# లక్నో లయన్స్ హ్యాట్రిక్
## రామ్‌దూట్స్‌పై 48-33తో గెలుపు

**న్యూఢిల్లీ:** అవధ్ రామ్‌దూట్స్‌పై ఆధిపత్య విజయంతో లక్నో లయన్స్ కొత్త సంవత్సరాన్ని ప్రారంభించింది. ఉత్తరప్రదేశ్ కబడ్డీ లీగ్, సీజన్ 2, ఎనిమిదో రోజు ప్రారంభ మ్యాచ్‌లో లక్నో లయన్స్ 48–33 తేడాతో రామ్‌దూట్స్‌ను ఓడించి మరో కమాండింగ్ ప్రదర్శనను అందించి నూతన సంవత్సరాన్ని ప్రారంభించింది. తొలి అర్ధభాగం యువ రైడర్ శివమ్‌చౌదరి నేతృత్వంలోని లక్నో జట్టుకు అనుకూలంగా ఉంది. అతను అవధ్ డిఫెన్స్‌ను పదే పదే ఇబ్బంది




పెట్టాడు. శివమ్ కేవలం ఎనిమిది రైడ్‌లలో 10 పాయింట్లు సాధించడంతో లక్నో జట్టు ఆధిపత్యాన్ని పెంచింది. నిరంతర ఒత్తిడి ఫలితంగా లక్నో లయన్స్ 13 పాయింట్ల ఆధిక్యంతో హాఫ్ టైంలోకి దూసుకెళ్లి పోటీపై పట్టు సాధించింది. విరామం తర్వాత అవధ్ రామ్‌డూట్స్ తిరిగి పుంజుకోవడానికి ప్రయత్నించింది. అయితే శివమరో కీలకమైన దాడితో మూడు పాయింట్లను సంపాదించాడు. చివరి దశలో మ్యాచ్ మందగించడంతో, లక్నో లయన్స్ ఆటను తెలివిగా నిర్వహించి చివరికి 48–33 తేడాతో సమగ్ర విజయాన్ని సాధించింది.

# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలు పైపైకి..
## మెటల్, ఆటో, పిఎస్‌యు బ్యాంకింగ్ షేర్లు ర్యాలీ




**ముంబయి, జనవరి 2:** భారత ఈక్విటీ మార్కెట్లువారాంతపు ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డులు సృష్టించాయి. మెటల్, ఆటో, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు భారీగా లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 573 పాయింట్లు లాభపడి 85,762 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 182 పాయింట్లు పెరిగి 26,328 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 26,330 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకింది. బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల జోరు కొనసాగడంతో బ్యాంక్ నిఫ్టీ కూడా 60,152.35 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. రంగాల వారీగా చూస్తే, పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 1.78 శాతం లాభంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. ఆటో, మెటల్, రియల్టీ, పవర్ సూచీలు కూడా 1 శాతం చొప్పున లాభపడ్డాయి. అయితే, ఎఫ్ఎంసీజీ రంగం మాత్రం 1.15 శాతం నష్టపోయింది. మార్కెట్ ముగిసేసరికి, 2,527 షేర్లు లాభాల్లో ముగియగా, 1,347 షేర్లు నష్టపోయాయి. వాహన విక్రయాల గణాంకాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ఆటో షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. దేశీయంగా స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉండటం, దేశ వృద్ధిపై విశ్వాసం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్నిచ్చాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.04 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.78 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ 26,300 స్థాయికి పైన స్థిరంగా కొనసాగితే, ర్యాలీ 26,500 వరకు వేగవంతం కావచ్చు. అదే జోరు కొనసాగితే 26,700 స్థాయికి చేరే అవకాశం ఉందని ఒక నిపుణులు అంచనావేసారు. ఇదిలా ఉండగా, ట్రేడింగ్ సెషన్‌లో యూఎస్ డాలర్‌తో రూపాయి మారకం విలువ 90 మార్కును దాటి బలహీనపడింది. రాబోయే కార్పొరేట్ ఫలితాలపై సానుకూల అంచనాలతో మార్కెట్‌లో సానుకూల ధోరణి కొనసాగుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇక బిఎస్ఇలో మిడ్ క్యాప్‌సైచీ 0.97శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.79శాతంపెరిగాయి. మార్కెట్ల పరంగా బిఎస్ఇలో 2772 షేర్లు పెరిగితే 1449 కంపెనీలషేర్లు క్షీణించాయి. 150 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగినట్లు తెలుస్తోంది. ఇక ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఫిబ్రవరి 5వ తేదీనాటికి 0.76 శాతం పెరిగి రూ.1,36,830కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడి చమురు మార్చినెల సెటిల్‌మెంట్‌చేసుకన్నది 04సెంట్లు క్షీణించింది. బ్యారెల్‌కు 60.81 డాలర్లు చొప్పున ధరలు కొనసాగాయి.



# డార్క్‌స్టోర్ నెట్‌వర్క్ వల్లే స్పీడ్ డెలివరీలు
## జొమాటో సిఇఒ

**ముంబయి, జనవరి 2:** జొమాటో, బ్లింకిట్ అందిస్తున్న 10నిమిషాల డెలివరీ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని ఆ కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ దీపిందర్ గోయల్ బయటపెట్టారు. స్పీడ్ డెలివరీకి డెలివరీ పార్ట్‌నర్లు వేగంగా వాహనాలు నడపడం కారణం కాదని, కస్ట మర్లకు అత్యంత సమీపంలో దట్టంగా ఏర్పాటుచేసిన 'డార్క్ స్టోర్ల నెట్‌వర్కే' కీలకమన్నారు. డెలివరీ ఏజెంట్ల భద్రతపై వస్తున్న ఆందోళనలు, న్యూఇయర్ సందర్భంగా కొందరు గిగ్‌వర్కర్లు చేసిన సమ్మె నేపథ్యంలో ఆయన సోషల్ మీడియాలో వివరణ ఇచ్చారు. ఒకఆర్డర్ వచ్చినప్పుడు ప్యాకింగ్‌కు సుమారు 2.5 నిమిషాల సమయం పడుతుంది. డెలివరీసగటున 2కిలోమీటర్ల లోపు దూరంలోనే ఉంటుందని, గంటకు కేవలం 15కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినా 8నిమిషాల్లో చేరవచ్చని వివరించారు. డెలివరీ ఆలస్యమైతే తమ ఏజెంట్లకు ఎలాంటి జరిమానాలు విధించమని, అలాగే సమయానికి డెలివరీ చేసినందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా ఉండవని ఆయన తేల్చిచెప్పారు. దీనివల్ల వారిపై ఎలాంటి ఒత్తిడి ఉండదని పేర్కొన్నారు. డెలివరీ పార్ట్‌నర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలపైనా గోయల్ స్పందించారు. ఇది కేవలం డెలివరీ పార్ట్‌నర్ల సమస్య కాదని, మన సమాజంలోనే చాలా మందికి తొందర ఎక్కువ అని ఆయన అన్నారు. యూనిఫాంలో ఉండటం వల్ల తమ వాళ్లు సులభంగా కనిపిస్తారని అన్నారు. కాగా, నిరసనల మధ్యే న్యూఇయర్ రోజున జొమాటో, బ్లింకిట్ కలిసి రికార్డు స్థాయిలో 75లక్షల ఆర్డర్లను డెలివరీ చేసినట్లు తెలిపారు.

# 92 కంపెనీలపై వచ్చిన 109 ఫిర్యాదులు పరిష్కారం
## బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి వెల్లడి



**ముంబయి, జనవరి 2:** బాంబే స్టాక్ ఎక్స్చేంజి గత ఏడాది డిసెంబరునెలలోఇన్వెస్టర్లనుంచి వచ్చిన 109 ఫిర్యాదులను పరిష్కరించింది. మొత్తం 92 కంపెనీలపై 109 మంది ఇన్వెస్టర్లు ఫిర్యాదులుచేసారు. కొత్తగా 141 ఫిర్యాదులు స్వీకరించిన బిఎస్ఇ వీటిని కూడా పరిశీలిస్తోంది. అదే డిసెంబరు నెలలో 113 ఫిర్యాదులు మా త్రమే వచ్చాయని తెలిపింది. వాటిలో 92 కంపెనీలక చెందిన 109 ఫిర్యాదులను పరిష్క రించామని వెల్లడించింది. జెఎస్‌డబ్ల్యు స్టీల్, మధువీర్‌కామ్ 18 నెట్‌వర్క్ లిమిటెడ్, ధని సర్వీసెస్ వంటి ఫిర్యాదులు పరిష్కారానికి నెలరో జులకుపైగా వ్యవధి తీసుకుందని తెలిపారు. ఇన్వెస్టర్లనుంచి ఫిర్యాదులకోసం సెబీ ఆన్‌లైన్ ఫిర్యాదుల ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఫిర్యాదుల విభాగాన్నిస్కోర్స్ అని పిలుస్తున్నారు. అంటే సెబీ కంప్లయింట్ రిడ్రెస్ సిస్టమ్‌ను స్కోర్స్‌గా చెపుతున్నది. గతంలో బిఎస్ఇ ఇన్వె స్టర్లకు హెచ్చరికలు చేసింది. ఆదిత్య రిషబ్‌మిశ్రా అనే వ్యక్తి ఇన్వెస్టర్లకు చట్టవిరుద్ధంగా అక్రమ సేవలు సలహాలు ఇస్తున్నట్లు వెల్లడించింది. ఇలాంటి వ్యక్తులనుంచి ఆ వ్యక్తులు ఆఫర్‌చేసే సేవలకు దూరంగా ఉండాలని సూచించింది. బిఎస్ఇలో రిజిస్టరు అయిన వ్యక్తులనుంచి మాత్రమే ఇన్వెస్టర్లు సేవలు పొందాలని సూచించింది. అలాగే ఆర్‌బిఐ కూడా ప్రజల్లో అవగాహన పెంచే కార్యనరకమాలుచేపట్టింది. డిజిటల్ కార్యక్రమాల్లో పూర్తి అవగాహన కలిగి ఉండాలని, టివిలు, ప్రింట్, ఎస్ఎంఎస్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో విస్తృత ప్రచారం చేస్తోంది. ఆర్‌బిఐ కెహతాహై ప్రచారం బి అవేర్ బుక్‌లెట్, వంటివి పెట్టుబడులపట్ల ఇన్వెస్టర్లలో అవగాహన పెంచే కార్యక్రమాలు చేస్తోంది.

# 2027 నాటికి భారత్ ఆర్థికవృద్ధి 11%
## ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్స్ నివేదిక

**న్యూఢిల్లీ, జనవరి 2:** భారత్ స్థూల దేశీయోత్పత్తివృద్ధి 2027నాటికి 11 శాతానికి చేరుతుందని ఎస్‌బిఐ మూచువల్‌ఫండ్ నివేదిక ప్రకటించింది. వాస్తవ జిడిపి వృద్ధిరేటు 7.2శాతంగా ఉంటుంది. దేశీయంగా వినియోగం పెరగడం, ప్రభుత్వ విధానాల మద్దతుతో వృద్ధి సులువుగా లక్ష్యం చేరుకుంటుందని వెల్లడించింది. భౌగోళికంగా అంతర్జాతీయంగా అనిశ్చితులు ఉన్నప్పటికీ దేశీయ పరిస్థితులు ఆర్థికవృద్ధికి ఎక్కువ ఊతం ఇస్తున్నట్లు తెలిపింది. జిఎస్టీ రీడిజైన్, కొత్త కార్మికచట్టాలు, మెరుగుపడిన ఆర్తిక పరిస్థితులు, పెట్టుబడులు గణనీయంగా వృద్ధి, కార్పొరేట్ కంపెనీల ఆస్తి అప్పుల పట్టీలు వృద్ధి వంటివి ఇందుకు దోహదంచేస్తాయని ఎస్‌బిఐ మూచువల్‌ఫండ్ ప్రకటించింది. దేశీయంగా రుణాల్లో కూడా వృద్ధిక నిపిస్తుండటంతో వినియోగరంగ వ్యయంపెరుగుతుందని, మానిటరీ పాలసీలు కూడా వృద్ధికి ఆస్కారం ఇస్తున్నట్లు వివరించింది. జిఎస్టీ హేతుబద్దీకరణ, కార్మిక చట్టాలు, మౌలికవనరుల వృద్ధి వంటివి పుష్కలంగా ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తాయని ప్రకటించింది. పెట్టుబడుల సైకిల్‌పరంగా చూస్తే కంపెనీలకు




పెరుగుతున్నాయని, దీనివల్ల తక్కువ వడ్డీలకే రుణపరపతి లభ్యతతోపాటు మూలధన వ్యయం పెరిగేందుకు పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని ఎస్‌బిఐ ఫండ్స్ వివరించింది. దీనికితోడు ద్రవ్యోల్బణం కూడా నాలుగు శాతానికి పెరగకుండా అటూ ఇటూగా దిగువస్థాయిలోనే నమోదవుతున్నదని ఫండ్స్ సంస్థ ప్రకటించింది. యాక్సిస్‌బ్యాంకు గత ఏడాది జిడిపి వృద్ధి 2027లో భారత్ 7.5శాతంగా ఉంటుందని వెల్లడించింది. అలాగే ఎస్ అండ్‌పి గ్లోబల్ సంస్థ కూడా జిడిపి వృద్ధి 6.5నుంచి ఏడుశాతం ఉం టుందని గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ప్రపంచ వ్యాప్త ఆర్థిక మందగమనం, భౌగోళిక పరిస్థితులు ఉద్రిక్తతలు మాత్రం కొంత ఆందో ళనకరం కాగలవని ఎస్‌బిఐ మూచువల్‌ఫండ్స్ అంచనావేసింది.


# అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.1000 కోట్ల ఎన్‌సిడిల జారీ

**ముంబయి,జనవరి 2:** ఆదాని గ్రూప్‌లోని ఆదాని ఎంటర్‌ప్రైజెస్ మూడో ఎన్‌సిడిలను జారీచేసింది. ఈ బదలీకి వీలుకాని డిబెంచర్ల ద్వారా సుమారు 1000 కోట్లు నిధులు సేకరించేందుకునిర్ణయించింద.ఇ సాలీనా రిటర్నులు 8.90శాతంగా ఉంటుంది. అయితే వీటి కాలపరిమితి 24,36,50 నెలలుగా నిర్ధారించింది. ఈనెల 6వ తేదీ ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. స్థిరమైన ఆదాయం కోరుకునే ఇన్వెస్టర్లకు ఈ రాబడులు మంచి వేదిక అవుతుందని, కంపెనీ చెపుతోంది. ఈనిధులను రుణాలు తీర్చి రీఫైనాన్సింగ్ కోసం, సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఖర్చుచేయనున్నట్లు వెల్లడించింది. డబుల్ ఎ, ఎప్లస్ రేటింగ్ ఉన్నట్లు ఆదాని వెల్లడించింది. ప్రాథమికంగా ఇష్యూబేస్ రూ.500 కోట్లు ఉంటుంది. అదనంగా మరో 500 కోట్లు సమీకరణకు కూడా వెసులుబాటు ఉంది. ఆరోతేదీ ప్రారంభం అయి 19వ తేదీ ముగుస్తుంది. సాలీనా రాబడులు 8.60శాతం నుంచి 8.90శాతం వరకూ ఉంటుంది. కంపెనీ ఆస్తులను వీటికి సెక్యూరిటీగా చూపిస్తోంది. 110శాతం సెక్యూరిటీ ఇస్తున్నట్లు




ఆదాని వెల్లడించింది. కేర్‌సంస్థ డబుల్‌ఎ, ఇక్రా డబుల్‌ఏ రేటింగ్‌ఇచ్చాయి. ప్రస్తుతం ఉన్న రుణాలను చెల్లించడంకోసం 75శాతం మిగిలిన 25శాతం కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తారు. కనీస ఎట్టుబడి 10 వేల రూపాయలుగా ప్రకటించింది. అంటే పది ఎన్సీడిలు తీసుకోవాలిస ఉంటుంది. ఈ నిధులతో మౌలి కవనరుల విస్తరణ, ఇంధనం, కొత్త వ్యాపారాలకకు వినియోగించేందుకు నిధులు ఖర్చు ఉంటుందని కంపెనీ ప్రకటించింది.

## ప్రైమరీ మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు
# రూ.34,336 కోట్ల పెట్టుబడి



**న్యూఢిల్లీ, జనవరి 2:** రిటైల్ ఇన్వెస్టర్లు ప్రైమరీ మార్కెట్లలో ఈ ఆర్థికసంవత్సరం ఎనిమిది నెలల కాలంలో 34,336 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు పారిశ్రామికవర్గాల డేటానుంచి తెలు స్తోంది. భారత్ మార్కెట్లు 2025లో గణనీయంగా నిదులు సేకరించాయి. 103 మెయిన్ బోర్డు ఐపిఒలు రూ.176 లక్షల కోట్లు సమీకరించగా 267 ఎస్ఎంఇ ఐపిఒలు సుమారు 11, 435 కోట్లు సేకరించాయి. మొత్తం 108 మెయిన్‌బోర్డు లిస్టింగ్‌లలో 72 తెరుచుకోగా వాటి ఇష్యూ ధరలకంటే తక్కువగా 36 ట్రేడ్ అయ్యాయి. లాభాలు పొందిన సంస్థల్లో 16 స్టాక్స్ ఉన్నాయి. 30 నుంచి 70శాతంవరకూ పెరిగినట్లు తేలింది. లిస్టింగ్‌లో22 సంస్థలు 10నుంచి 30శాతం పెరిగాయి. మరికొన్ని 34 సంస్థలు ఒకటినుంచి 10శాతం మధ్యలోనే లాభపడ్డాయి. అంటే స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకున్నాయి. ప్రైమరీ మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సెకండరీ మార్కెట్‌లో రికార్డుస్థాయిలో విత్‌డ్రాలు జరిగాయి. నవంబరువరకూ 13 వేల కోట్లు విత్‌డ్రా అయితే రూ.1.25 లక్షలు నిధులు వచ్చాయి. ప్రధానంగా చెప్పాలంటే ఐపిఒలనుంచే నిధులు ఎక్కువ సమకూరాయి. రూ.100 నుంచి రూ.500కోట్ల వరకూ కొన్ని కంపెనీలుంటే రూ.1000 కోట్ల నుంచి రూ.2వేల కోట్ల సెగ్మెంట్‌లోనే అత్యధిక కంపెనీలు ఐపిఒలు జారీచేసాయి. గడచిన ఎనిమిది నెలల కాలంలో గణనీయంగా వచ్చిన పెట్టుబడులు వచ్చే ఏడాది నాలుగు లక్షలకోట్ల మూలధన వనరులకు ఐపిఒలు వేదిక అవుతాయని మార్కెట్ డేటా స్పష్టం చేస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.